Pubilshed from Eluru
PRGI NO : APTEL/25/A1219

# ప్రజాభూమి
ఇది ప్రజల వెలుగు
Prajabhoomi Telugu Daily
www.prajabhoomi.com




ఏలూరు ELURU | సంపుటి : 02 Vol.No : 02 | సంచిక : 278 Issue No : 278 | బుధవారం Wednesday | సెప్టెంబర్ 30, 2026 30 SEPTEMBER 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



# మేము ప్రజలకు సేవకులం

## ప్రజలు వేసిన ఓటు వృథా కాలేదు...నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పాలన

- దూసుకెళ్తున్న డబులింజన్ పాలన...జెట్ స్పీడ్ వేగంతో అభివృద్ధి
- గ్రామాభివృద్ధిలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తనదైన ముద్ర వేశారు
- ఉదయగిరి పల్లె పండుగ-3.0 బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- పల్లె పండుగ-3.0లో భాగంగా రూ.11,085 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సీఎం, డిప్యూటీ సీఎం
- వీబీ జీ రాంజీ శ్రామికుల వద్దకెళ్లి శ్రమదానం చేసిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్

ప్రజాభూమి ప్రతినిధి,ఉదయగిరి :

"ప్రజలకు సేవ చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, తాము ప్రజలకు సేవకులమే తప్ప పెత్తందార్లం కాదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. ఉదయగిరి నియోజకవర్గం వరికుంటంపాడు మండలం, రామాపురం గ్రామంలో నిర్వహించిన పల్లె పండుగ-3.0 కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో కలిసి రూ.11,085 కోట్ల విలువైన గ్రామీణ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పల్లె పండుగ-3.0లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో రూ.2,700 కోట్లతో 6 వేల కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు, రూ.7,550 కోట్లతో 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనం చేశారు."

అలాగే పాడి రైతుల కోసం రూ.300 కోట్లతో 22 వేల మినీ గోకులాలు నిర్మాణం, రూ.225 కోట్లతో 50 వేల ఎకరాల్లో ఉద్యాన తోటల పెంపకానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, రూ.110 కోట్లతో వెయ్యి కిలోమీటర్ల మేర మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పల్లెల్లో అభివృద్ధి కార్యక్రమాలకు పల్లె పండుగ ద్వారా నాంది పలుకుతున్నామని తెలిపారు. ప్రతి ఇంటి ముందు సీసీ రోడ్ వేస్తున్నామని... రోడ్ల ఏర్పాటుతో రాకపోకలు సాఫీగా సాగుతాయని... ప్రయాణం సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో రూ. 50 వేల కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించామని... పల్లెల్లోనూ కనివినీ రీతిలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని సీఎం వెల్లడించారు. ప్రజల కళ్లకు కనబడేలా అభివృద్ధి చేస్తున్నామని... గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేసే అంశంపై దృష్టి

2 పేజీలో..



# నేనున్నాను.. మీరు ఒంటరి కాదు...

- కాకుమాను రాజశేఖర్ కుటుంబాన్ని పరామర్శించిన వైయస్ జగన్
- కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా

ప్రజాభూమి ప్రతినిధి, ఒంగోలు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఒంగోలులో పర్యటించారు. ఒంగోలు క్లౌ పేటలోని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ లిడ్‌క్యాప్ ఛైర్మన్ దివంగత కాకుమాను రాజశేఖర్ నివాసానికి వెళ్లిన వైయస్ జగన్, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాకుమాను రాజశేఖర్ మృతిపై తీవ్ర సంతాపం వ్యక్తం చేసిన వైయస్ జగన్, ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

2 పేజీలో..



## దేశవ్యాప్త ఆందోళన

- ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి
- సిజెపి కన్వీనర్ అభిజిత్ దీప్కే

న్యూఢిల్లీ : 'ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి. లేకపోతే దేశవ్యాప్తంగా ఆందోళన చేపడతాం. ఢిల్లీలో 'జంతర్‌మంతర్-2.0' పేరుతో నిరవధిక నిరసనకు దిగుతాం.

2 లో



## సిఇసిని తొలగించాలన్న పిటిషన్‌పై విచారణకు సుప్రీం ఓకే

న్యూఢిల్లీ : భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) అధ్యక్ష?ని పేరుతో సిఇసి జ్ఞానేశ్‌కుమార్ ఏకపక్ష?ంగా అధికారాన్ని వినియోస్తున్నారని, ఆయనను తొగించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను త్వరగా విచారణకు జాబితా

2 లో

# విప్లవాత్మక మార్పులు రావాలి..



## పాలనలో కొత్త ఒరవడి రావాలి..

- నైపుణ్యాలే మన అభివృద్ధికి చోదకశక్తి
- టెక్నాలజీతో పాలనా విధానాలు మరింత సరళీకృతం
- పౌరసేవల్లో నాణ్యతే సామర్థ్యాల పెరుగుదలకు గీటురాయి
- మిషన్ కర్మయోగి దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ తొలి సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఉద్యోగుల కెపాసిటీ బిల్డింగ్‌లో ఏపీకి మొదటి స్థానం, తదుపరి స్థానాల్లో కర్ణాటక, ఒడిశా
- సీఎం చేతుల మీదుగా అవార్డులు అందుకున్న మూడు రాష్ట్రాల అధికారులు

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

దేశాభివృద్ధిలో వచ్చే 20 ఏళ్లు అత్యంత కీలకమని, ఈ కాలంలో ప్రభుత్వ వ్యవస్థలు, సంస్థల్లో విప్లవాత్మక మార్పులు రావాల్సిన అవసరం ఉందని ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. దేశ ప్రజల ఆకాంక్షలు వేగంగా మారుతున్నాయని, వాటికి అనుగుణంగా ప్రభుత్వ పాలనా విధానాలు, ప్రక్రియలు, ఉద్యోగుల నైపుణ్యాలు కూడా నిరంతరం మెరుగుపడాలని పేర్కొన్నారు. సాంకేతికతను వినియోగించుకోవడంతో పాటు పాత విధానాలు, అనవసర నిబంధనలను సరళీకరించి పాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలని సూచించారు.

2 పేజీలో..

## స్టాక్ మార్కెట్‌కు వరుసగా రెండో రోజు నష్టాలు..



- సెన్సెక్స్ 242 పాయింట్లు డౌన్
- 64 పాయింట్లు తగ్గిన నిఫ్టీ
- వరుసగా రెండో సెషన్‌లో మార్కెట్‌కు నష్టాలు
- మార్కెట్ సెంటిమెంట్‌పై చమురు ధరల ప్రభావం
- మిడ్, స్మాల్‌క్యాప్ షేర్లలో అమ్మకాలు
- ఫార్మా షేర్లతో మార్కెట్‌కు కొంత ఊరట

- మిగతా 2లో..

# శ్రామికులతో కలిసి కొత్త విధానాలకు శ్రీకారం చుట్టి



- కొకులవారిపల్లి గ్రామంలో శ్రమదానం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- శ్రమదానంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్
- వీబీ జీ రాంజీ శ్రామికులతో కలసి పొలాల మధ్యకు డొంక రోడ్డుకు శ్రీకారం
- కాలినడకన పల్లెపండుగ అభివృద్ధి పనుల పరిశీలన
- పూల జల్లులతో స్వాగతించిన గ్రామస్తులు
- కొత్త రోడ్లపై గ్రామంలోకి నడిచి వెళ్లిన చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, శ్రీ మాధవ్
- గ్రామ సచివాలయం వద్ద వీబీ జీ రాంజీ శ్రామికులతో కలసి గ్రూప్ ఫొటో

ప్రజాభూమి ప్రతినిధి, ఉదయగిరి : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ గడ్డపారలు చేత పట్టి వీబీ జీ రాంజీ పనులను ప్రారంభించారు. కొత్త డొంక రోడ్డుకు శ్రీకారం చుట్టారు. పల్లెపండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా కొకులవారిపల్లి గ్రామంలో పొలాల మధ్యకు నిర్మించతలపెట్టిన డొంక రోడ్డుకు శ్రమదానం చేశారు. గడ్డపారలతో ముగ్గురు నేతలు మట్టిని తవ్వగా, ఆ గ్రామానికి చెందిన వీబీ జీ రాంజీ శ్రామికులు గంపలతో మట్టిని ఎత్తి రోడ్డు పోశారు.

2 లో..

# రూ.35కే కేజీ ఉల్లిపాయలు



- ధరల స్థిరీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం
- తొలి దశలో విజయవాడలోని అన్నిరైతు బజార్లలో నేటి నుండి అమలు
- ఆధార్/రేషన్ కార్డు ఆధారంగా కుటుంబానికి నెలకు 2 కేజీలు
- ప్రజల డిమాండ్‌ను బట్టి రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ
- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి: రాష్ట్రంలో ఉల్లిపాయల ధరల పెరుగుదల నేపథ్యంలో ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ధరల స్థిరీకరణ చర్యలను మరింత పటిష్టంగా అమలు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా నేటి నుంచి రైతు బజార్ల ద్వారా కేజీ ఉల్లిపాయలను రూ.35కే ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తొలి దశలో విజయవాడ నగరంలోని అన్ని రైతు బజార్లలో సబ్సిడీ ధరకు ఉల్లిపాయల విక్రయాలను ప్రారంభిస్తున్నట్లు మంత్రులు

2 పేజీలో..

# వివేకా హత్య కేసులో లబ్ధిదారుడు జగనే



- మంత్రి అనగాని సత్యప్రసాద్
- వివేకా హత్య కేసులో అంతిమ లబ్ధిదారుడు జగనేనన్న మంత్రి అనగాని
- ఈడీ, సీబీఐ విచారణతో భయపడే ధర్నాల డ్రామాలు ఆడుతున్నారని ఆరోపణ
- డైవర్షన్ రాజకీయాలు మాని నిజాలు చెప్పాలని జగన్‌కు డిమాండ్
- ఉపాధ్యాయుడి మరణంపైనా వైసీపీ శవ రాజకీయం చేస్తోందని విమర్శ
- సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అసలైన, అంతిమ లబ్ధిదారుడు మాజీ ముఖ్యమంత్రి జగనేనని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, ఈడీ, సీబీఐ దర్యాప్తు ముమ్మరం కావడంతో తాడేపల్లి ప్యాలెస్ పునాదులు కదులుతున్నాయని, అందుకే ప్రజల దృష్టిని మళ్లించేందుకు జగన్ ధర్నాల పేరిట డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు.

2 పేజీలో..

## నేనున్నాను...మీరు ఒంటరి కాదు...

ఈ కష్టసమయంలో ధైర్యంగా ఉండాలని వారిని ఓదార్చారు. కాకుమాను రాజశేఖర్ పార్టీకి అందించిన సేవలను ఈ సందర్భంగా వైయస్ జగన్ గుర్తుచేసుకున్నారు. పార్టీ పట్ల నిబద్ధతతో, అంకితభావంతో ఆయన పనిచేశారని పేర్కొన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. రాజశేఖర్ కుటుంబం ఒంటరిది కాదని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని వైయస్ జగన్ భరోసా ఇచ్చారు. కుటుంబానికి అవసరమైన అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కుటుంబ సభ్యులతో కొద్దిసేపు మాట్లాడి, వారికి ధైర్యం చెప్పిన అనంతరం వైయస్ జగన్ అక్కడి నుంచి తిరుగు ప్రయాణమయ్యారు.

## రూ.35కే కేజీ ఉల్లిపాయలు

వెల్లడించారు. ఆధార్ కార్డు లేదా రేషన్ కార్డు ఆధారంగా ప్రతి కుటుంబానికి నెలకు 2 కేజీల చొప్పున, కేజీ రూ.35 ధరకు ల్లిపాయలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. నిత్యావసర సరుకుల ధరల పెరుగు దల వల్ల సామాన్య ప్రజలపై అదనపు భారం పడకుండా ప్రభుత్వం ఎప్ప టికప్పుడు మార్కెట్ పరిస్థితులను సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటోందని మంత్రులు తెలిపారు. ఉల్లిపాయల ధరల విషయంలో కూడా ప్రజలకు ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో సబ్సిడీ ధరకు విక్రయాలు చేపడుతున్నట్లు వివరించారు. విజయవాడలో ప్రారంభించే ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చే స్పందన, డిమాండ్‌ను బట్టి తదుపరి దశలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని రైతు బజార్లకు విస్తరించి, సబ్సిడీ ధరకు ఉల్లిపాయలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రులు స్పష్టం చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్ కోరారు.

## దేశవ్యాప్త ఆందోళన

జ్ఞానేష్ కుమార్ అతిపెద్ద యాంటీ నేషనల్ . భారత ప్రజాస్వామ్యానికి ఆయన పెను ప్రమాదం. జ్ఞానేష్ కుమార్ నేతృత్వంలోని ఎన్నికల సంఘం ఓటర్ల హక్కులకు భంగం కలిగించేలా వ్యవహరిస్తోంది. ఇవిఎంలను హ్యాక్ చేయవచ్చని, కాబట్టి బ్యాలెట్ పేపర్లను ఉపయోగించి ఎన్నికలు నిర్వహించాలి. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) పేరుతో 30 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని ముసాయిదా ఓటర్ల జాబితాల నుంచి 13 కోట్లకు పైగా పేర్లు తొలగించారు. ఇది రాజ్యాంగ విరుద్ధం. ఈ తొలగింపులపై స్పష్టత ఇవ్వాలి. ప్రభావిత ఓటర్లకు సమర్థవంతమైన పునఃపరిశీలన అవకాశం కల్పించాలి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌డిఎ, ప్రతిపక్షాల మధ్య ఓట్ల తేడా కేవలం 2 శాతం మాత్రమే. - సిజెపి కన్వీనర్ అభిజిత్ దీప్కే

## సిఇసిని తొలగించాలన్న పిటిషన్‌పై విచారణకు సుప్రీం ఓకే

చేసేందుకు సుప్రీంకోర్టు మంగళవారం అంగీకరించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఎదుట హాజరైన పిటిషనర్ రాకేష్ కుమార్ సింగ్ తరపు న్యాయవాది వికాస్ సింగ్, ముదిత్ గుప్తా, ఈ పిటిషన్‌ను త్వరగా విచారించాలని మౌఖికంగా ప్రస్తావించారు. పిటిషన్‌పై తుది విచారణ జరిగే వరకు జ్ఞానేష్ కుమార్ ఎన్నికల కమిషనర్ విధులను నిర్వహించకూడదని ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌ను వచ్చే వారం విచారణకు చేపట్టేందుకు సిజెఐ అంగీకరించారు. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి ఏకాభిప్రాయ నిర్ణయాల ద్వారానే భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) కార్యకలాపాలను నిర్వహించాలని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు.

## స్టాక్ మార్కెట్‌కు వరుసగా రెండో రోజు నష్టాలు..

**న్యూఢిల్లీ : భారత స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండో సెషన్‌లోనూ నష్టాలతో ముగిశాయి. పెరిగిన ముడి చమురు ధరలు, అంతర్జాతీయ బాండ్ ఈల్డ్స్‌లో కొనసాగుతున్న** ఒడుదొడుకులు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌పై ప్రభావం చూపాయి. దీంతో పలు రంగాల్లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది.సెన్సెక్స్ 242.65 పాయింట్లు నష్టపోయి 72,529.07 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 64.05 పాయింట్లు తగ్గి 22,716.20 వద్ద ముగిసింది. నిఫ్టీలో టైటన్ కంపెనీ అత్యధికంగా నష్టపోయిన షేర్‌గా నిలిచింది. ఐటీ షేర్లలో విప్రో, హెచ్‌సీఎల్‌టెక్ కూడా ఒత్తిడిని ఎదుర్కొన్నాయి.
మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలోనూ అమ్మకాలు కొనసాగాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.99 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.81 శాతం పడిపోయాయి. కన్స్యూమర్ డ్యూరబుల్స్, కెమికల్స్, రియల్టీ, ఐటీ రంగాలు ఎక్కువగా నష్టపోయాయి. మరోవైపు ఫార్మా షేర్లు మార్కెట్‌కు కొంత ఊరటనిచ్చాయి. నిఫ్టీకి 22,750-22,800 స్థాయి తక్షణ నిరోధంగా ఉందని నిపుణులు తెలిపారు. 22,550-22,600 స్థాయి కీలక మద్దతుగా ఉందని పేర్కొన్నారు. 22,500 కంటే దిగువకు పడిపోతే అమ్మకాల ఒత్తిడి మరింత పెరిగి 22,300-22,000 ప్రాంతం వరకు సూచీ వెళ్లే అవకాశం ఉందని విశ్లేషకులు తెలిపారు. ఇదిలా ఉండగా, రూపాయి 95.97 వద్ద దాదాపు స్థిరంగా ట్రేడైంది.

## వివేకా హత్య కేసులో లబ్ధిదారుడు జగనే

"సొంత బాబాయ్ గొడ్డలిపోటుకు గురైతే గుండెపోటుగా నమ్మించి, సాక్ష్యాలను తుడిచిపెట్టిన చరిత్ర జగన్‌ది. ఇప్పుడు కూడా అదే తరహాలో డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారు. అప్రూవర్‌గా మారిన దస్తగిరి, సునీల్ యాదవ్ వెల్లడించిన వాస్తవాలు, రూ.40 కోట్ల సుపారీ లావాదేవీలన్నీ తాడేపల్లి నివాసం వైపే వేలెత్తి చూపిస్తున్నాయి" అని అనగాని పేర్కొన్నారు. హత్య కేసు దర్యాప్తు కీలక దశకు చేరుకోవడంతోనే డీఎస్సీ వంటి అంశాలపై వైసీపీ అనవసర రాద్ధాంతం చేస్తోందని ఆరోపించారు.అనారోగ్యంతో ఉన్న ఉపాధ్యాయుడు కాకుమాను రాజశేఖర్‌ను ధర్నాకు బలవంతంగా పిలిపించి, ఆయన మృతికి కారకులయ్యారని, ఇప్పుడు ఆ మరణంపై కూడా శవ రాజకీయం చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వమే రాష్ట్రంలో గంజాయి, బ్లేడ్ బ్యాచ్ సంస్కృతిని పెంచి పోషించిందని మండిపడ్డారు. తప్పులు చేస్తూ ఇతరులపై ఎదురుదాడికి దిగడం వైసీపీకి అలవాటుగా మారిందని, ఆ పార్టీ తన పేరును 'గొడ్డలి డైవర్షన్ పార్టీ'గా మార్చుకుంటే బాగుంటుందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా జగన్ మీడియా ముందుకు వచ్చి వివేకా హత్యపై వాస్తవాలను వెల్లడించాలని అనగాని సత్యప్రసాద్ డిమాండ్ చేశారు. సచివాలయ ఉద్యోగుల సమస్యలను కూడా తమ ప్రభుత్వం పరిష్కరించి, వారికి ఉజ్వల భవిష్యత్తును అందిస్తుందని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.

# విప్లవాత్మక మార్పులు రావాలి..

విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాధన శృంఖల-2026 మిషన్ కర్మయోగి ప్రాంతీయ సదస్సును ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఒడిశా, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన అధికారులు, శిక్షణ సంస్థల ప్రతినిధులు ఈ రెండు రోజుల సదస్సుకు హాజరయ్యారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాల పెంపు, పరిపాలనా నైపుణ్యాల మెరుగుదల, ప్రభుత్వ శిక్షణ సంస్థల సామర్థ్య నిర్మాణంపై ఈ సదస్సులో ప్రధానంగా చర్చించారు. ప్రభుత్వ శిక్షణ సంస్థలు కేవలం ఉద్యోగులకు కోర్సులు నిర్వహించే కేంద్రాలుగా ఉండకూడదని సీఎం అన్నారు. సవాళ్లను పరిష్కరించడంలో ఉద్యోగుల నైపుణ్యాలను పెంచే సంస్థలుగా అవి మారాలని సూచించారు. ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడమే కాకుండా, ఆ శిక్షణ వల్ల పాలనలో ఎలాంటి మార్పు వచ్చిందో, ప్రజలకు అందే సేవల్లో ఎలాంటి మెరుగుదల కనిపించిందో కూడా కొలవాల్సిన అవసరం ఉందన్నారు. కోర్సులు పూర్తి చేసి సర్టిఫికెట్లు పొందడం మాత్రమే కెపాసిటీ బిల్డింగ్ కాదని.. నేర్చుకున్న అంశాలను ఉద్యోగులు తమ విధుల్లో ఎంతవరకు అమలు చేస్తున్నారు. ప్రజలకు అందే సేవల నాణ్యత ఎంత మెరుగుపడుతోందన్న అంశమే ప్రామాణికత అని సీఎం స్పష్టం చేశారు.

**కెపాసిటీ బిల్డింగ్ లో ఏపీకి మొదటి స్థానం :** ప్రభుత్వ ఉద్యోగుల కెపాసిటీ బిల్డింగ్‌లో ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ రాష్ట్రంగా మొదటి స్థానాన్ని సాధించింది. ఈ అవార్డును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్, ఏపీఎస్‌డీపీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వీఆర్ అలపర్తి అందుకున్నారు. రెండో స్థానంలో నిలిచిన కర్ణాటక, మూడో స్థానంలో నిలిచిన ఒడిశా రాష్ట్రాలకు కూడా సీఎం అవార్డులు అందజేశారు. మిషన్ కర్మయోగి కింద ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 7.89 లక్షల మంది ఉద్యోగులు ఐగాట్‌లో నమోదు అయ్యారని సీఎం తెలిపారు. రాష్ట్రంలో రెండు కోట్లకు పైగా కోర్సులు పూర్తి చేసి దేశంలోని రాష్ట్రాల్లో ఏపీ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. రెండు కోట్ల సర్టిఫికెట్ల కంటే నేర్చుకున్న అంశాలే కీలకమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు అందే సేవల్లో మార్పుగా ఈ అంశాలు కనిపించాలని అని సీఎం అన్నారు. శిక్షణతో ఓ రెవెన్యూ అధికారి పౌరుడి సమస్యను వేగంగా పరిష్కరించటం, ఉపాధ్యాయుడు తరగతి గదిలో మెరుగైన బోధన అందించటం.. పోలీసు అధికారి మరింత మానవీయంగా స్పందించటం ముఖ్యమని సీఎం స్పష్టం చేశారు. పూర్తి చేసుకున్న శిక్షణతో పౌరులకు నాణ్యమైన సేవలు అందుతున్న తీరుకు కొలమానంగా ఉండాలని సూచించారు.

**టెక్నాలజీ మారింది.. పాలనా విధానాలు మారాలి :** భారత్‌లో సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్నా, కొన్ని చోట్ల పాత నిబంధనలు, విధానాలు కొనసాగుతున్నాయని సీఎం అన్నారు. కంప్యూటర్లు వచ్చినా అనవసరమైన పేపర్‌వర్క్ కొనసాగడం, దరఖాస్తులను డిజిటల్ చేసినా అనేక అనుమతులు అవసరం కావడం, ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చినా పౌరులను కార్యాలయాలకు రప్పించడం వంటి విధానాలను మార్చాల్సిన అవసరం ఉందన్నారు. పాత విధానాన్ని డిజిటలైజ్ చేయడం మాత్రమే ఆధునిక పాలన కాదని... మొత్తం ప్రక్రియను మార్పు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రగతిని నిరోధించే అనవసర నిబంధనలను సరళీకరించాల్సిన అవసరం ఉందన్నా రు. జన్ విశ్వాస్ వంటి సంస్కరణలు ఈ దిశలో కీలకమని చెప్పా రు. ప్రస్తుతం ఐటీ విప్లవం తర్వాత ఏఐ కాలం ప్రారం భమైందని, మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ప్రభుత్వ వ్యవస్థలు కూడా మారాల్సిందేనని సీఎం అన్నారు. ఏఐను కేవలం సాంకేతిక సాధనంగా కాకుండా పాలనలో నిర్ణయాలు, సమస్యల గుర్తింపు, ఉద్యోగుల నైపుణ్యాల అంచనా, శిక్షణ అవసరాల గుర్తింపులో వినియోగించుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో రియల్‌టైమ్ గవర్నెన్స్ ద్వారా పాలనా వ్యవహారాలు, పౌరసేవల నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవే క్షిస్తున్నామని చెప్పారు. డేటా ఆధారిత వ్యవస్థలు, ఈ-ఫైలింగ్ ద్వారా నిర్ణయాలు వేగంగా తీసుకుంటున్నామని, కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లను నిరంతరం పర్యవేక్షిస్తూ క్షేత్రస్థాయి అధికారుల కు అవసరమైన సూచనలు ఇస్తున్నామని వివరించారు. ఏపీ ఏఐ స్టాక్, మన మిత్ర, వాట్సాప్ గవర్నెన్స్ వంటి సాంకేతిక ఆధా రిత కార్యక్రమాలను పాలనలో వినియోగిస్తున్నామని అన్నారు.

**మానవీయత ద్వారానే పాలనకు విలువ :** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాలనా వ్యవహారాలను గణనీయంగా మార్చగలదని సీఎం అన్నారు. ఉద్యోగుల సామర్థ్య లోపాలను గుర్తించడం, వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా శిక్షణా కోర్సులను సూచించడం, పరిపాలనా నిర్ణయాలను మెరుగుపరచడంలో ఏఐ ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, యంత్రాంగం ప్రభుత్వ పాలనలో కీలకమని సీఎం అన్నారు. వరదలు, తుపాన్ల లాంటి ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలను ఆదుకునేందుకు ఉద్యోగులే ముందు ఉంటారని గుర్తుచేశారు. పండుగలు, ప్రభుత్వ కార్యక్రమాలు, విపత్తుల సమయంలో కుటుంబాలను సైతం పక్కనపెట్టి ప్రజా సేవలో నిమగ్నం అవుతున్న ఉద్యోగుల సేవలను ఎప్పటికీ విస్మరించలేమని సీఎం వ్యాఖ్యానించారు. మీ ముందున్న ప్రతి ఫైలు వెనుక ఒక మనిషి, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు ఉంటుంది. ప్రజలకు సేవ చేసే అవకాశం ఉద్యోగులకు లభించడం గొప్ప బాధ్యత అని సీఎం అన్నారు. ఉద్యోగులు నిరంతరం తమ నైపుణ్యాలను పెంచుకునేలా ఆన్‌లైన్ శిక్షణను వినియోగించుకోవాలని సీఎం సూచించారు. సామాజిక మాధ్యమాల్లో రీల్స్ చూస్తూ గడిపే సమయాన్ని కెపాసిటీ బిల్డింగ్ కోసం వెచ్చిస్తే వ్యక్తిగత నైపుణ్యాలను పెంచుకోవచ్చని అన్నారు. ఐగాట్-మిషన్ కర్మయోగి ద్వారా ఉద్యోగులు ఎప్పటికప్పుడు కొత్త నైపుణ్యాలను అందిపుచ్చు కునే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు అధికారులు, ఉద్యోగులు నిరంతర శిక్షణ పొందినప్పుడే ప్రజలకు నాణ్యమైన సేవలు అందించగలమని చెప్పారు.

**శాఖల మధ్య సమాచార మార్పిడి కీలకం :** ప్రభుత్వ శాఖల మధ్య నిరంతరాయంగా సమాచార పంపిణీ జరగాలని సీఎం అన్నారు. సమాచార వ్యవస్థలు పరస్పరం అనుసంధానమై ఉంటే సమస్యలను సంక్షోభంగా మారక ముందే గుర్తించి పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. సాంకేతికత, విధానాలు, ప్రక్రియలు, ఉద్యోగుల సామర్థ్యాలను సమన్వయం చేసినప్పుడే వేగవంతమైన నిర్ణయాలు తీసుకోవచ్చని చెప్పారు. 1978లో సంస్కరణలు ప్రారంభించిన చైనా కొన్ని దశాబ్దాల్లోనే తన సామర్థ్యాలను భారీగా పెంచుకుని ఆర్థికంగా ఉన్నతస్థాయికి చేరిందని సీఎం పేర్కొన్నారు. భారత్‌లోనూ అపారమైన అవకాశాలు, వనరులు ఉన్నాయని, ప్రపంచవ్యాప్తంగా భారతీయులు తమ నైపుణ్యాలను నిరూపించుకున్నారని అన్నారు. ఆర్థిక సంస్కరణల తర్వాత భారతీయుల ఆకాంక్షలు మారాయని, వాటికి అనుగుణంగా ప్రభుత్వ వ్యవస్థలు కూడా మారాలని సూచించారు. ప్రపంచంలోని ప్రముఖ సంస్థలకు భారతీయులు నాయకత్వం వహిస్తున్నారని, ఆ సామర్థ్యాలను దేశాభివృద్ధికి వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ శిక్షణ సంస్థలు భవిష్యత్తు సవాళ్లను ముందుగానే అంచనా వేసి ఉద్యోగులను సిద్ధం చేయాలని సీఎం సూచించారు. రాష్ట్రంలోని గుర్తించిన 61 శిక్షణ సంస్థలను ఉన్నతి కింద ఐగాట్‌లో అనుసంధానించామని తెలిపారు. అమరావతిలో గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఏర్పాటు దిశగా కూడా పనిచేస్తున్నామని చెప్పారు.

**ఏపీకి కెపాసిటీ బిల్డింగ్ పాలసీ :** ఆంధ్రప్రదేశ్ కెపాసిటీ బిల్డింగ్ పాలసీని ప్రవేశపెట్టి, రాష్ట్రంలోని 38 శాఖలకు కెపాసిటీ బిల్డింగ్ ప్రణాళికలు రూపొందించినట్లు సీఎం తెలిపారు. భవిష్యత్తులో ఉద్యోగుల సామర్థ్యాలు, నిరంతర అభ్యసనకు కెరీర్ అభివృద్ధిలో తగిన గుర్తింపు ఇవ్వాలని సూచించారు. ప్రతి ఉద్యోగికి ఎదిగే అవకాశం, ప్రతి సంస్థకు మెరుగుపడే అవకాశం, ప్రతి పౌరుడికి దాని ప్రయోజనం అందేలా వ్యవస్థను తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వం నియంత్రించే వ్యవస్థగా కాకుండా ప్రజలను సాధికారత వైపు నడిపే వ్యవస్థగా మారాలని సీఎం అన్నారు. ప్రజలకు జ్ఞానం, మౌలిక సదుపాయాలు, సాంకేతికత, అవకాశాలను అందించి వారు తమ భవిష్యత్తును తామే నిర్మించుకునేలా చేయడం ప్రభుత్వ బాధ్యతగా పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సంపద సృష్టి దిశగా ప్రభుత్వ యంత్రాంగం సమాయత్తం కావాలని, పీ4 వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచే అవకాశం ఉందన్నారు. మిషన్ కర్మయోగి ద్వారా ఉద్యోగులు కేవలం కోర్సులు పూర్తి చేయడం కాకుండా, నేర్చుకున్నదాన్ని విధుల్లో అమలు చేయాలని సీఎం సూచించారు. లెర్నింగ్ వర్క్‌ఫోర్స్ నుంచి లెర్నింగ్ నేషన్ గా భారత్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సీఎం పిలుపునిచ్చారు. 2047 వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాలకు ప్రతీ పౌరుడి జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వ యంత్రాంగాలు కలిసి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ చైర్ పర్సన్ రాధా చౌహాన్, సభ్యురాలు అల్కా, ఆ సంస్థ కార్యదర్శి జగదీప్ గుప్తా, ఏపీ ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్, మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ కాటమనేని భాస్కర్ తదితరులు హాజరయ్యారు.

# శ్రామికులతో కలిసి కొత్త విధానాలకు శ్రీకారం చుట్టి

పల్లెపండుగ 3.0
కార్యక్రమంలో డొంక రోడ్లకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. పైలట్ ప్రాజెక్టు కింద గ్రామీణ ప్రాంతాలు ఉన్న 167 నియోజకవర్గాల పరిధిలో నియోజక వర్గానికి ఒక్కటి చొప్పున డొంక రోడ్డు నిర్మించనుండగా, ఉదయగిరి నియోజకవర్గం పరిధిలో కొకులవారిపల్లి గ్రామంలో నిర్మించతలపెట్టిన డొంక రోడ్డు పనులను శ్రమదానం ద్వారా ముఖ్యమంత్రి , ఉప ముఖ్యమంత్రి ప్రారంభించారు. అంతకు ముందు కొకులవారిపల్లి గ్రామంలో పల్లెపండుగ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను ముగ్గురు నేతలు కాలినడకన పరిశీలించారు. గ్రామ సరిహద్దుల్లో పశువుల దాహార్తి తీర్చేందుకు నిర్మించిన నీటి తొట్టె స్వాగతం పలుకగా, గ్రామంలోకి వేసిన బీటీ రోడ్డు, గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డు, రోడ్డుకి సమీపంలో ఉన్న మినీ గోకులాన్ని పరిశీలించారు. రోడ్డు నాణ్యతను తనిఖీ చేశారు. సుమారు కిలోమీటరు మేర కాలినడకన కొకులవారిపల్లి గ్రామ సచివాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ వీబీ జీ రాంజీ శ్రామికులతో కలసి గ్రూప్ ఫొటో దిగారు.అంతకు ముందు తమ గ్రామానికి విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , పీవీఎన్ మాధవ్ ల కు కొకులవారిపల్లి గ్రామానికి చెందిన మహిళలు గ్రామ సరిహద్దుల నుంచి పూల జల్లులతో స్వాగతం పలికారు. మహిళలతో ముచ్చటిస్తూ, సమస్యలు అడిగి తెలుసుకుంటూ ముగ్గురు నేతలు గ్రామంలోకి నడిచి వెళ్లారు. అంతకు ముందు పల్లెపండుగ 3.0 కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సభా వేదికపైకి విచ్చేసిన ముఖ్యమంత్రివర్యులు, ఉప ముఖ్యమంత్రివర్యులకు ప్రజలు అద్భుత స్వాగతం పలికారు. తమ మెడల్లోని కండువాలు గాల్లో ఊపుతూ, జయజయధ్వానాలు పలుకుతూ నేతలను స్వాగతించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ వేదిక వద్ద ఏర్పాటు చేసిన ర్యాంప్‌పై నడుస్తూ ప్రజలకు అభివాదం చేశారు. తమ అభిమాన నేతల్ని చూసి మహిళలు సైతం ఆనందంతో చిందులు వేశారు. ఫోన్లలో సెల్ఫీలు తీసుకునేందుకు పోటీ పడ్డారు. వేదికపై పల్లెపండుగ కార్యక్రమానికి పూర్వం గ్రామాల్లో పరిస్థితులు, పల్లెపండుగ తర్వాత అభివృద్ధిని వివరిస్తూ చేసిన వీడియో ప్రజెంటేషన్ సభికుల్ని ఆకట్టుకుంది. పల్లెపండుగ 3.0కి తమ నియోజకవర్గాన్ని ఎంపిక చేసిన ఉప ముఖ్యమంత్రిపవన్ కళ్యాణ్ పై ఉదయగిరి ప్రజలు తమ అభిమానాన్ని చాటుకున్నారు. జనసేన జెండా రంగులతో కూడిన గొడుగులతో వెల్కమ్ టూ పవన్ కళ్యాణ్ సర్ అంటూ.. ఆంగ్ల అక్షరమాలిక రూపాన నిలబడి కృతజ్ఞతలు తెలియజేశారు.

---

# మేము ప్రజలకు సేవకులం

పెట్టామన్నారు. గోకులం షెడ్లు, మ్యాజిక్ డ్రైన్లను నిర్మిస్తున్నామని... ప్రతి ఒక్కరికీ ఇల్లు.. ఇంటి స్థలం, విద్యుత్, సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు చేసేలా కృషి చేస్తున్నామని తెలిపారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రకు గ్రామాలే నాంది పలకాలని సూచించారు. చెత్త నుంచి సంపద సృష్టించే వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నామని... పేదరికం లేని గ్రామాలను తీర్చిదిద్దేందుకు.. ఆర్థిక అసమానతలు తగ్గేలా చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు.

**పల్లె వికాసంలో పవన్ చొరవ అభినందనీయం :** డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఇప్పటికే మూడు పల్లె పండుగ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. ఉద్యమ స్ఫూర్తితో పవన్ కళ్యాణ్ గ్రామాలను అభివృద్ధి చేస్తున్నారని, పల్లె వికాసంలో ఆయన తనదైన ముద్ర వేశారని చంద్రబాబు అభినందించారు. గ్రామాల అభివృద్ధిలో భాగంగా పవన్ అనేక మార్పులు తీసుకొచ్చారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 13,326 గ్రామాల్లో ఒకేసారి గ్రామసభలు నిర్వహించి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని సీఎం తెలిపారు. రెండున్నర దశాబ్దాల తర్వాత పంచాయతీరాజ్ వ్యవస్థలోని వివిధ హోదాల్లో ఉన్న 10 వేల మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించామని, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4,136 కోట్లు విడుదల చేశామని చెప్పారు. లక్షకు పైగా పంటకుంటలు తవ్వించడంతో పాటు పశువుల కోసం నీటి తొట్టెలు నిర్మించామని వివరించారు. పవన్ నేతృత్వంలోని పంచాయతీరాజ్ శాఖకు 13 జాతీయ అవార్డులు రావడం అభినందనీయమన్నారు. 2024 ఎన్నికల్లో కూటమిగా ఏర్పడిన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి తాను, పవన్ కళ్యాణ్ ప్రజలకు వద్దకు వచ్చి రాష్ట్రాన్ని పునర్ నిర్మిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. నాడు హామీ ఇచ్చిన విధంగానే రాష్ట్రాన్ని నడిపిస్తున్నామన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు వేసిన ఓటు వృథా కాలేదని, ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నామని ముఖ్యమంత్రి అన్నారు. చెప్పిన విధంగానే డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రెండేళ్లలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందని, జెట్ స్పీడ్‌తో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. సంక్షేమం-అభివృద్ధి-సుపరిపాలనే ఎన్డీఏ ప్రభుత్వ మంత్రమని పేర్కొన్నారు. తల్లికి వందనం, స్త్రీ శక్తి, సామాజిక పింఛన్లు, అన్నదాత సుఖీభవ వంటి పథకాలను అమలు చేస్తున్నామని సీఎం వివరించారు. పేదలకు రూ.5కే అన్నం అందించే కార్యక్రమాన్ని గత ప్రభుత్వం నిలిపివేసిందని, తాము తిరిగి అమలు చేస్తున్నామని చెప్పారు. మత్స్యకారులు, నేతన్నలు, ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతున్నామని, అమూల్ బ్రాండ్ స్థాయిలో స్వయం బ్రాండ్‌ను అభివృద్ధి చేస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. 30 ఏళ్ల క్రితం తానే శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టును తానే ప్రారంభించానని చెప్పారు. వెలిగొండ ఫేజ్-2 పనులను కూడా పూర్తి చేసి.. ఉదయగిరి నియోజకవర్గాన్ని.. మార్కాపురం జిల్లాను సస్య శ్యామలం చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. హంద్రీ-నీవా ద్వారా రాయలసీమ చివరి భూములకు నీరందిస్తు న్నామని, పోలవరం ఎడమ కాల్వ ద్వారా అనకాపల్లి ప్రాంతానికి నీటిని తీసుకెళ్తున్నామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో తాగునీటి సమస్య, ఉద్యాన పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు.

**మరింత సంక్షేమం... మరింత అభివృద్ధి :** విశాఖలో 28 వేల మందికి పైగా కుటుంబాలకు ఇళ్ల పట్టాలు అందించామని, విజయవాడలో మరో 24 వేల మందికి పట్టాలు అందించనున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. త్వరలో మూడు లక్షల ఇళ్లకు శంకుస్థాపన చేయనున్నామని చెప్పారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే పొట్టి శ్రీరాములు జలధార పథకం పేరుతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో జల్ జీవన్ పనులను భారీ ఎత్తున ప్రారంభించబోతున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రంలో ఉద్యోగాలు కల్పించేలా వివిధ రంగాల్లో పరిశ్రమలను తీసుకొస్తూ ఏపీని నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతామని అన్నారు. కృష్ణపట్నం-రామాయపట్నం పోర్టుల మధ్య దగదర్తి విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే రైల్-రోడ్ కనెక్టివిటిని పెంచి నెల్లూరు-ప్రకాశం జిల్లాలను లాజిస్టిక్స్ హబ్ గా తీర్చిదిద్దుతామని సీఎం తెలిపారు. బీపీసీఎల్ ప్లాంట్ ద్వారా రూ.లక్ష కోట్ల పెట్టుబడులు రానున్నాయని, డిఫెన్స్ పరిశ్రమలు కూడా ఈ ప్రాంతానికి వస్తున్నాయని చెప్పారు. ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన నెల్లూరు, ఉదయగిరి ప్రాంతవాసులు తిరిగి ఇక్కడి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమస్య లను పరిష్కరించే బాధ్యత తమదని, అభివృద్ధి అవకాశాలను అందిపుచ్చుకోవాల్సిన బాధ్యత ప్రజలదని అన్నారు. తమ అభివృద్ధిని చూసి సహకరించాలని, ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే బాధ్యత ప్రభుత్వానిదైతే.. ప్రభుత్వానికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రజలదని సీఎం చెప్పారు.

**ఉదయగిరి సభలో ముఖ్యమంత్రి కీలక ప్రకటనలు...** పల్లె పండుగ-3.0 కార్యక్రమం సందర్భంగా జరిగిన సభలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు కొన్ని కీలక ప్రకటనలు చేశారు. పెద్దిరెడ్డిపల్లె రిజర్వాయర్ కాల్వ పనులకు రూ.52 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సోమశిల హైలెవల్ కెనాల్ ఫేజ్-1 నిర్మాణానికి అవసరమైన రూ.85 కోట్లు అందిస్తామని తెలిపారు. డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌కు అవసరమైన క్లియరెన్సులు మంజూరు చేస్తామని, సీబీజీ ప్లాంట్‌కు నిరంతర విద్యుత్ సరఫరాకు సహకరిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. సోమశిల డ్యామ్ భద్రతకు అవసరమైన నిధులు సమకూరుస్తామని వెల్లడించారు. క్రాకటూరు డిస్ట్రిబ్యూటరీకి నిధులను సమకూర్చడంతోపాటు... వింజమూరు ప్రాంత పరిధిలో తాగు, సాగునీటి అవసరాల కోసం రాజవోలు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. కనిగిరి ప్రాంతంలో రోడ్ల నిర్మాణానికి.. బీటే రోడ్ల పునర్నిర్మాణానికి వీబీజీ రామ్‌జీ గ్రాంట్ అందిస్తామని చెప్పారు. కనిగిరిలోని 189 ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు రూ.100 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. రాళ్లపాడు రిజర్వాయర్ ద్వారా ఓలేటివారిపాలెం, గూడూరు, లింగసముద్రం మండలాల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. కనిగిరి-బల్లిపల్లె వద్ద ట్రిపుల్‌ఐటీ ఏర్పాటుకు సహకరిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. అనంతరం కాకొల్లువారిపల్లి గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ శ్రమదానం చేశారు. 'వీబీ జీ రాంజీ' శ్రామికుల వద్దకు వెళ్లి పొలాల మధ్య డొంక రోడ్డు పనులను ప్రారంభించారు. కాలినడకన పల్లెపండుగ అభివృద్ధి పనుల పరిశీలనించారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద 'వీబీ జీ రాంజీ' శ్రామికులతో కలసి సీఎం, డిప్యూటీ సీఎం, మాధవ్ గ్రూప్ ఫొటో దిగారు.

**ఆసక్తిగా ర్యాంప్ వాక్... ఆకట్టుకున్న ఏర్పాట్లు...** సీఎం, డిప్యూటీ సీఎంలు సభా వేదిక మీదకు రాగానే సభికుల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. తమ మెళ్లో వేసుకున్న కండువాలను గాల్లో ఊపుతూ సభికులు స్వాగతం పలికారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ర్యాంప్ మీద సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నడుస్తూ ప్రజలకు అభివాదం చేశారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిని చూసి పలువురు మహిళలు ఆనందంతో డ్యాన్సులు చేశారు. ర్యాంప్ వాక్ చేసిన సీఎం, డిప్యూటీ సీఎంలను ఫొటోలు తీసేందుకు పలువురు సభికులు ప్రయత్నించారు. తమ కుర్చీల్లో నుంచి లేచి ఫోన్లల్లో ఫొటోలు తీసుకున్నారు. ఇక పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో పండుగ వాతావరణాన్ని తలపించేలా ఏర్పాట్లు చేశారు. మామిడి తోరణాలు, రంగవల్లులతో అతిథులకు, ప్రజలకు స్వాగత ఏర్పాట్లు చేశారు. సభ అనంతరం కాకొల్లువారిపాలెం గ్రామంలో పల్లె పండుగ-3.0లో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పరిశీలించారు. గ్రామస్థులు వారికి పూలు జల్లి ఘన స్వాగతం పలికారు. ప్రజలకు అభివాదం చేస్తూ అభివృద్ధి పనులను పరిశీలించిన సీఎం, డిప్యూటీ సీఎం.. గ్రామస్థులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, ఆనం రామ్ నారాయణ రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్దన్ రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహా నెల్లూరు, ప్రకాశం జిల్లాల ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# మలేరియా కేసుల నియంత్రణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

**❖ కేసులు పెరిగిన తర్వాత మేల్కొనడం కాదు.. ముందే గుర్తించి అడ్డుకోవాలి ❖ ఒక్క మలేరియా మరణం కూడా జరగకూడదు ❖ కమిషనర్ కె.వి.ఎన్. చక్రధరబాబు స్పష్టీకరణ**




ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:
రాష్ట్రంలో మలేరియా కేసుల నియంత్రణలో నిర్లక్ష్యం, అలసత్వం, జాప్యాన్ని ఎంతమాత్రం సహిం చేది లేదని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కె.వి.ఎన్. చక్రధరబాబు అధికారులను హెచ్చరించారు. కేసులు పెరిగిన తర్వాత స్పందించడం అధికారుల పని కాదని.. కేసులు పెరగకుండా ముందే గుర్తించి అడ్డుకోవడమే బాధ్యత అని స్పష్టం చేశారు. ఒక్క మలేరియా కేసును కూడా తేలికగా తీసుకోవద్దని, ముఖ్యంగా గిరిజన, మారుమూల, అధిక ప్రమాద ప్రాంతాల్లో అప్రమత్తతను మరింత పెంచాలని ఆదేశించారు.ముందస్తు నిఘా.. సత్వర పరీక్షలు .. సకాలంలో చికిత్స.. దోమల నియంత్ర ణ.. మందుల పూర్తి లభ్యత.. ఈ ఐదు అంశాల్లో ఎక్కడా లోపం ఉండకూడదని చక్రధరబాబు స్పష్టం చేశారు.విజయవాడలో మంగళవారం జరిగిన 28 జిల్లాల అధికారుల రాష్ట్రస్థాయి కార్యశా లలో మలేరియా పరిస్థితి, వ్యాధుల నిఘా, క్షేత్రస్థాయిలో దోమల నియంత్రణ, మందుల లభ్యత, సిబ్బంది పనితీరు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఐహెచ్ఐపీ–ఐడీఎస్పీ సమాచారం, ఏవేర్, ఏడీఎస్ వ్యవస్థల వినియోగం, క్రియాశీల–సాధారణ నిఘా, దోమల నియంత్రణ చర్యలు, మలేరియా నివారణ మందుల నిల్వలు, సిబ్బంది సామర్థ్య పెంపుపై చర్చించారు. ప్రతి జిల్లాలో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఏ ప్రాంతంలో కేసులు పెరుగుతున్నాయో ముందుగానే గుర్తించి, అక్కడ వెంటనే నియంత్రణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.మలేరియా కేసులు పెరిగిన తర్వాత చర్యలు ప్రారంభించడం అంటే జాప్యమేనని కమిషనర్ స్పష్టం చేశారు. వ్యాధి వ్యాప్తికి సంబంధించిన తొలి సంకేతాలు కనిపించిన వెంటనే అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని ఆదేశించారు. సమాచారం అందిన తర్వాత కూడా చర్యలు తీసుకోకపోతే దాన్ని నిర్లక్ష్యంగా పరిగణించాల్సి వస్తుందని హెచ్చరించారు.గిరిజన ప్రాంతాల్లోని మారుమూల గ్రామాల్లో జ్వర కేసులపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. జ్వరం వచ్చిన ప్రతి వ్యక్తికి అవసరమైన పరీక్షలు నిర్వహించి, మలేరియా నిర్ధారణ అయితే వెంటనే చికిత్స అందించాలని సూచించారు. మారుమూల ప్రాంతం కావడంతో కేసు ఆలస్యంగా గుర్తించే పరిస్థితి ఉండకూడదని స్పష్టం చేశారు.ఐహెచ్ఐపీ–ఐడీఎస్పీ ద్వారా అందుతున్న సమాచారాన్ని నిరంతరం పరిశీలించి, దాని ఆధారంగా ప్రమాద ప్రాంతా లను వెంటనే గుర్తించాలని ఆదేశించారు. ఏవేర్, ఏడీఎస్ వ్యవస్థలను పూర్తిస్థాయిలో వినియోగించి ముందస్తు నిఘాను మరింత బలోపేతం చేయాలని సూచించారు. మలేరియా కేసుల గుర్తింపులో క్రియాశీల, సాధారణ నిఘా రెండూ బలంగా ఉండాలని కమిషనర్ అన్నారు. కేసులను గుర్తించడంతో పాటు దోమల పరిస్థితిని కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు.మలేరియా కేసులు నమోదైన ప్రాంతాల్లో దోమల నియంత్రణ చర్యలను వెంటనే, యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో ఏఎల్ఓ, ఐఆర్ఎస్, ఐఎస్ఎస్, పొగ పిచికారీ వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. కేసులు పెరిగిన తర్వాత చర్యలు చేపట్టడం కాదు.. కేసులు పెరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందే గుర్తించి నియంత్రణ చర్యలు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.మలేరియా పరిస్థితిని బట్టి మందుల అవసరాన్ని ముందుగానే అంచనా వేసి తగినంత నిల్వలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. కేసు వచ్చిన తర్వాత మందుల కోసం వెతికే పరిస్థితి ఎంతమాత్రం ఉండకూడదని స్పష్టం చేశారు. మలేరియా నివారణ మందుల లభ్యత, నిల్వలపై సమావేశంలో ప్రత్యేకంగా సమీక్ష జరిగింది.కేటాయించిన నిధులను నిర్దిష్ట వ్యవధిలోగా వినియోగించాలని స్పష్టం చేశారు. ముందస్తు ప్రణాళికను సక్రమంగా రూపొందించకపోవడం వల్లే నిధుల వినియోగంలో వెనుకబడుతున్నారని పేర్కొన్నారు.మలేరియా నియంత్రణలో పనిచేస్తున్న సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలని, వారు క్షేత్రస్థాయిలో సక్రమంగా పనిచేస్తున్నారా లేదా అన్నది అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు. కాగితాలపై నివేదికలు కాకుండా.. క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించాలని స్పష్టం చేశారు.మలేరియాతో పాటు కాలాజార్, ఫైలేరియా వ్యాధుల వివరాలను కూడా పక్కాగా నమోదు చేసి ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. సమాచారం, నివేదికల్లో జాప్యం చేయవద్దని, ఏ స్థాయిలోనైనా నిర్లక్ష్యం బయటపడితే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.మలేరియా నియంత్రణలో నిర్లక్ష్యానికి తావులేదని, జాప్యాన్ని సహించేది లేదని కమిషనర్ కె.వి.ఎన్. చక్రధరబాబు స్పష్టం చేశారు. కేసులు పెరిగే వరకు వేచి చూడొద్దని.. ముందే గుర్తించాలి.. వెంటనే స్పందించాలి.. వ్యాధిని అక్కడికక్కడే అడ్డుకోవాలని ఆదేశించారు.ముఖ్యంగా గిరిజన, మారుమూల, అధిక ప్రమాద ప్రాంతాల్లో అధికారులు మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. ఒక్క మలేరియా మరణం కూడా జరగకుండా ప్రతి అధికారి, ప్రతి సిబ్బంది బాధ్యతతో పనిచేయాలని చక్రధరబాబు స్పష్టం చేశారు.సమావేశంలో ప్రజారోగ్య శాఖ అదనపు సంచాలకులు డాక్టర్ వెంకటరమణ, జాయింట్ డైరెక్టర్ అర్జునరావు, డిప్యూటీ డైరెక్టర్ వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.



## విక్కుర్తిని మర్యాదపూర్వకంగా కలసిన తెలుగు యువత

ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ
మోపిదేవి మండలం మోపిదేవిలంక గ్రామానికి చెందిన తెలుగు యువత నాయకులు, కార్యకర్తలు మంగళవారం అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ విక్కుర్తి శ్రీనివాసరావును అవనిగడ్డలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విక్కుర్తిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామంలో పార్టీ కార్యక్రమాలు, యువత భాగస్వామ్యం, స్థానికంగా చేపడుతున్న కార్యక్రమాలపై వారు విక్కుర్తితో చర్చించారు. పార్టీ బలోపేతానికి యువత మరింత చురుగ్గా పనిచేయాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విక్కుర్తి సూచించినట్లు తెలిపారు.మోపిదేవిలంక గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యకలాపాలను మరింత విస్తృతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలతో సమన్వయంతో ముందుకు సాగుతామని తెలుగు యువత ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు మార్జిన్ ఆక్రమించి నిర్మాణం?

### ఇంటి నిర్మాణంపై స్థానికుల అభ్యంతరం



మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి:
మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని 10 వ డివిజన్‌లో ఓ నూతన ఇంటి నిర్మాణంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ రోడ్డు మార్జిన్‌ను ఆక్రమిస్తూ నిర్మాణం చేపడుతున్నట్లు ఆరోపిస్తున్నారు.రెండు రోడ్లు కలిసే మూల ప్రాంతంలో ఈ నిర్మాణం జరుగుతుండటంతో భవిష్యత్తులో వాహనాల రాకపోకలకు, ముఖ్యంగా వాహనాలు మలుపు తిరిగే సమయంలో ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మార్జిన్ తగ్గిపోతే అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు రాకపోకలు సాగించేందుకు కూడా ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉంటుందని పేర్కొంటున్నారు.ఇంటి యజమాని తనకు కేటాయించిన స్థల పరిధిలోనే నిర్మాణం చేపట్టి, మున్సిపల్ రికార్డుల ప్రకారం ఉన్న రోడ్డు మార్జిన్‌ను యథావిధిగా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే నగరపాలక సంస్థ మంజూరు చేసిన నిర్మాణ ప్రణాళిక ప్రకారం అవసరమైన సెట్‌బ్యాక్‌లు వదిలి నిర్మాణం చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.రోడ్డు మార్జిన్ విషయంలో వాస్తవ పరిస్థితిని అధికారులు పరిశీలించి, మున్సిపల్ రికార్డులు, మంజూరైన నిర్మాణ ప్రణాళికను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్నట్లు తేలితే సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు..

# రైతులు సమక్షంలోనే రీసర్వే నిర్వహించాలి

**రీ-సర్వేతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం**
**రాష్ట్ర సర్వే, సెటిల్మెంటు మరియు ల్యాండు రికార్డ్స్ డైరెక్టరు రోణంకి కుర్మనాథ్**

ప్రజాభూమి ప్రతినిధి,మచిలీపట్నం:
భూము ల్లో నిర్వహిస్తున్న రీసర్వేల్లో రైతులను భాగస్వాములను చేసేలా ముందుగా నే సమాచా రం అందించి వారి సమక్షంలోనే రీసర్వే నిర్వ హిం చాలని, ఈ కేవైసీ తప్పనిసరిగా నమోదు చెయ్యాలని రాష్ట్ర సర్వే, సెటిల్మెంటు అండ్ లాండు రికార్డ్స్ డైరెక్టరు రోణంకి కూర్మనాథ్ అన్నారు. మంగళ వారం పమిడిముక్కల మండ లం కపిలేశ్వరపురం గ్రామం, తోట్ల వల్లూరు మండలం సౌత్ వల్లూరు గ్రామాలలో నిర్వహి స్తున్న రీ-సర్వే కార్యక్రమాన్ని జిల్లా రెవిన్యూ, సర్వే అధికారులతో కలిసి ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. రైతులు సమక్షంలో సర్వే జరగడంతో అయన హర్షం వ్యక్తం చేశారు. రీస ర్వేలో తప్పులు పునరావృతం కాకుండా పారదర్శకత ఉండేందుకు రైతులతో కలిసి క్షేత్రస్థాయి లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సర్వే మొదలు పెట్టేరోజున తప్పనిసరిగా సంబంధిత రైతులు లేదా కుటుంబ సభ్యులు క్షేత్ర స్థాయిలో తప్పక ఉండాలని, సర్వే పూర్తయిన తరువాత డాక్యుమెంటు వెరిఫికేషన్ ద్వారా సరిహద్దులు నిర్ణయం రైతు సమక్షంలోనే నిర్వహించాలన్నారు. రైతులు చేతికి సరైన కొలతలతో కూడిన పట్టాదారు పాసుపుస్తకం అందజేసే వరకూ సమాచారం తప్పనిసరిగా అందించేలా చూడాలని జిల్లా సర్వే సహాయ సంచాల కులను పూజారి లక్ష్మణరావును ఆదేశించారు.
అనంతరం ఉయ్యూరు మండల తహసీల్దార్ కార్యాలయాన్ని అక్మికంగా తనిఖీ చేసి ఉయ్యూరు మండలానికి సంబందించిన వీఆర్వో, లాగిన్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కుర్మనాద్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న రీసర్వేలో తప్పులు పునరావృతం కాకూడదనే ఉద్దేశంతో భూ సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు రైతులు సమక్షంలోనే రీసర్వే నిర్వహించే విధంగా రీసర్వే 2.0 నిర్వహిస్తున్నామన్నారు.



రీసర్వే నిర్వహించిన తరువాత నోటీసు రూపంలో రైతులకు చూపించిన భూహద్దులు ప్రకారం భూవివరాలను తెలియజేయడం, డాక్యుమెంట్లతో సరిపోల్చుకుని నిర్ధారణ చేయడం జరుగుతుందన్నారు. ఈ కేవైసీ చేయించడం ద్వారా రైతులు సమక్షంలో సర్వే నిర్వహించడంతో పాటు రైతులకు అన్ని విధాలా సమాచారం అందిస్తూ ఎక్కడా రైతులు ఇబ్బంది పడకుండా చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న రీసర్వేల్లో ఫేజ్-1లో 628, ఫేజ్-2 లో 748, ఫేజ్-3 లో 729, ఫేజ్-4 లో 1645 గ్రామాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2,800 బృందాలతో అత్యాధునిక రోవర్స్ తో సర్వే నిర్వహించడం జరుగుతున్నద న్నారు. క్షేత్ర స్థాయిలో భూవివరాలు, డాక్యుమెంటు పరంగా గల వివరాలను రైతులు సమక్షంలోనే సరిపోల్చుతూ ఇకముందు ఎటువంటి భూ వివాదాలకు తావులేకుండా రైతులు సంతృప్తి చెందే విధంగా రీసర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఫేజ్-5 లో రాష్ట్ర వ్యాప్తంగా 1,343 గ్రామాలలో రైతులతో కలిసిమెలిసి క్షేత్రస్థాయిలో రీసర్వే నిర్వహిస్తున్నామన్నామని, రైతులు కూడా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. క్షేత్రస్థాయిలో సమస్యలెదురైతే తక్షణ పరిష్కారం చేసే విధంగా కార్యాచరణ రూపొందించినట్లు ఆయన వివరించారు. ప్రభుత్వ విధానాలు పరంగా 2027 మార్చి నాటికి భూవివాదాలు లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దేందుకు తమ అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా సర్వే సహాయ సంచాలకులు పూజారి లక్ష్మణరావు, ఉయ్యూరు ఆర్డీఓ ఎస్ కరుణా కుమారి, ఉయ్యూరు, పమిడిముక్కల, తోట్ల వల్లూరు తహశీల్దార్లు, ఉయ్యూరు డివిజన్ సర్వే ఇన్స్పెక్టర్ సురేష్ బాబు, రీసర్వే డిప్యూటీ తహశీల్దారు , మండల సర్వేయరు , రెవెన్యూ, సర్వే సిబ్బంది, గ్రామ నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**క్రమశిక్షణతో కార్యకర్తలు పనిచేయాలి: మాజీ మంత్రి పేర్ని**

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి



రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థి విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమన్వ యంతో, క్రమశిక్షణతో పనిచేయాలని మాజీ మంత్రి, వైసీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకటరామయ్య (నాని) పిలుపునిచ్చారు.మచిలీపట్నంలోని రెవెన్యూ



కల్యాణ మండపంలో మచిలీపట్నం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ భవిష్యత్ కార్యాచరణ, రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా పేర్ని నాని మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు ఐకమ త్యంతో పనిచేస్తూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలని కోరారు.అనంతరం కూటమి ప్రభుత్వ పాలనపై ఆయన విమర్శలు చేశారు. స్థానిక శాసనసభ్యుడు, మంత్రి కొల్లు రవీంద్రపై పలు విమర్శలు చేశారు. ప్రభుత్వ విధానాలు, స్థానికంగా అమలవుతున్న కార్యక్రమాలపై వైసీపీ తరఫున ఆయన తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు.కార్యకర్తలు పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయిలో సమన్వయంతో ముందుకు సాగాలని పేర్ని నాని సూచించారు. సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## నందం రామారావు కుటుంబాన్ని పరామర్శించిన పారిశ్రామికవేత్త





మచిలీపట్నంప్రజాభూమి ప్రతినిధి :
ప్రముఖ సీనియర్ పాత్రికేయులు, కథా, నవలా రచయిత నందం రామారావు కుటుంబాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త విద్యుల్లతారెడ్డి దంపతులు మంగళవారం పరామర్శించారు. నందం రామారావు కుమార్తె నందం పద్మవతి ఇటీవల మృతి చెందడంతో, హౌసింగ్ బోర్డు కాలనీలోని వారి నివాసానికి విద్యుల్లతారెడ్డి దంపతులు వెళ్లారు.ఈ సందర్భంగా నందం రామారావు, అయన కుమారుడు శ్రీనివాస్ దూరదర్శన్ చీఫ్ కెమెరామెన్, అల్లుడు కుమ్మరిగుంట మధు, కుటుంబ సభ్యులను కలిసి పద్మవతి మృతికి సంతాపం తెలిపారు. ఆమె మృతితో కుటుంబ సభ్యులకు కలిగిన విషాదాన్ని తెలుసుకుని, వారి బాధలో తాము కూడా భాగస్వాములమని పేర్కొంటూ ధైర్యం చెప్పారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.విద్యుల్లతారెడ్డి దేశంలోని పలు రాష్ట్రాల్లో వివిధ వ్యాపారాలను నిర్వహిస్తూ పారిశ్రామిక రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆమె, నందం రామారావు కుటుంబాన్ని పరామర్శించి తన ఆత్మీయతను చాటుకున్నారు.

## మచిలీపట్నం–కర్నూలు మధ్య కొత్త ఎక్స్‌ప్రెస్ రైలు

**రైల్వే కనెక్టివిటీ మరింత బలోపేతం: ఎంపీ బాలశౌరి**

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి :



మచిలీపట్నం నుంచి విజయవాడ మీదుగా కర్నూ లు సిటీ వరకు కొత్త త్రైవారపు ఎక్స్‌ప్రెస్ రైలు సేవకు భారతీయ రైల్వే ఆమోదం తెలపడంపై మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి హర్షం వ్యక్తం చేశారు. ఈ కొత్త రైలు సేవతో కోస్తా ఆంధ్రప్రదేశ్‌తో పాటు రాష్ట్రంలోని మధ్య ప్రాంతాల మధ్య రైలు ప్రయాణ సౌకర్యం మరింత మెరుగుపడుతుందని ఆయన పేర్కొ న్నారు. కొత్త రైలు ద్వారా గుడివాడ, విజయ వాడ, నరసరావుపేట, వినుకొండ, మార్కాపురం రోడ్, గిద్దలూరు, నంద్యాల తదితర ప్రాంతాల ప్రయాణికులకు అదనపు రైలు సౌకర్యం అందు బాటులోకి రానుంది. మొత్తం 499 కిలోమీటర్ల దూరం ప్రయాణించే ఈ రైలు మచిలీపట్నం నుంచి సాయంత్రం 4.55 గంటలకు బయలు దేరి మరుసటి రోజు ఉదయం 5.45 గంటలకు కర్నూలు సిటీ చేరుకుంటుంది అన్నారు.తిరుగు ప్రయాణంలో కర్నూలు సిటీ నుంచి ఉదయం 9.30 గంటలకు బయలుదేరి రాత్రి 9.35 గంటలకు మచిలీపట్నం చేరుకుం టుంది. మచిలీపట్నం–కర్నూలు సిటీ రైలు సోమ, బుధ, శనివారాల్లో, కర్నూలు సిటీ–మచిలీపట్నం రైలు మంగళ, గురు, ఆదివారాల్లో నడవనుంది.ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త రైలు సేవకు ఆమోదం తెలిపిన కేంద్ర రైల్వే శాఖతో పాటు సంబంధిత అధికారులకు ఎంపీ బాలశౌరి కృతజ్ఞతలు తెలిపారు. రైల్వే కనెక్టివిటీ విస్తరణతో ప్రజలకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడటంతో పాటు విద్య, వైద్యం, వ్యాపారం, ఉపాధి రంగాల్లో కూడా ప్రయోజనం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలో రైల్వే అభివృద్ధి, ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదలకు తన వంతు కృషి నిరంతరం కొనసాగిస్తానని బాలశౌరి తెలిపారు.

# ప్రజాభూమి

## ఏలూరు, పశ్చిమగోదావరి 4

బుధవారం 30 సెప్టెంబరు 2026


## కాన్వెంట్లకు ధీటుగా అంగన్వాడీ కేంద్రాలు

**-సీడీపీఓ పద్మావతి**

**ఏలూరు**



అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం, ఆటపాటలతో కూడిన విద్య,ఆరోగ్య భద్రత వంటి సేవలను ఉచితంగా అందిస్తున్నామని ఏలూరు అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ పద్మావతి తెలిపా రు.ప్రైవేటు కాన్వెంట్లకు ధీటుగా అంగన్వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.స్థానిక 9వ డివిజన్ ఏడు కాలువల వద్ద 79 నుంచి 85వ అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన అంగన్వాడీ ఉత్సవాలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.అంగన్వాడీ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జ్‌లు,సెక్టార్ సూపర్‌వైజర్ మీనాక్షి, ఏఎన్ఎంలు,ఆశాలు, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణీలు,బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

## పల్లె అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన సంకల్పం: కామినేని శ్రీనివాస్

**ప్రజాభూమి ప్రతినిధి-కైకలూరు**



ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్, కైకలూరు ఎమ్మెల్యే డా.కామినేని శ్రీనివాస్ కలిదిండి మండల కేంద్రంలో పల్లె పండగ-3.0 కార్యక్రమంలో భాగంగా సప్తగిరి గ్రామీణ బ్యాంకు వద్ద నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పల్లెను అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. అనంతరం కలిదిండి మార్కెట్ యార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన రైతు బజార్‌ను ప్రారంభిం చారు.రైతులకు తాగునీరు,నీడ, డిజిటల్ తూకాలు తదితర సౌకర్యాలు కల్పించి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.రైతులు ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసుకుని వినియోగదారులతో స్నేహపూర్వకంగా వ్యాపారం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు,టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొత్తా నాగేంద్ర కుమార్,చీణూ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## భీమడోలు సహకార సంఘం అభివృద్ధికి కృషి

**-ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు**






**ప్రజాభూమి ప్రతినిధి-ఉంగుటూరు**

భీమడోలు రైతుసేవా సహకార సంఘ కార్యాలయంలో మహాజన సభ సమావేశం సంఘ చైర్మన్, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు అధ్యక్షతన జరిగింది.సమావేశంలో త్రిసభ్య కమిటీ సభ్యులు వెజ్జు రాంబాబు,గేదెల శ్రీనివాసు, కరణం పెద్దిరాజు, దూసనపూడి పుల్లయ్య నాయుడు, ఏఎంసీ చైర్మన్ శేషాపు శేషగిరి,నీటి సంఘం అధ్యక్షులు కుక్కల ప్రసాద్,రైతులు,సహకార ఉద్యోగులు,డీసీసీబీ అధికారులు,సొసైటీ సీఈఓ నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ,గత ఏడాది కాలంలో వ్యాపారం ద్వారా రూ.55 లక్షల మిగులు సాధించామని తెలిపారు.డీసీసీబీ బ్రాంచ్‌తో ఉన్న రూ.6.78 కోట్ల వ్యత్యాసాన్ని రూ.3.38 కోట్లకు తగ్గించామని,పీపీసీ కమిషన్ రూపంలో మరో రూ.2 కోట్ల వరకు రావాల్సి ఉందన్నారు.వచ్చే ఏడాదిలో వ్యత్యాసాన్ని పూర్తిగా తగ్గించడంతో పాటు నూతన గోడౌన్, బ్యాంకు కార్యాలయ నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు.

## రాష్ట్ర వైస్సార్ కాంగ్రెస్ పార్టీ సంయుక్త కార్యదర్శి, మాజీ ఎంపీపీ కర్రి వెంకట నారాయణ(వాసురెడ్డి)కి అభినందనల వెల్లువ

**ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు**



రాష్ట్ర వైస్సార్ కాంగ్రెస్ పార్టీ సంయుక్త కార్యదర్శిగా నియమితులైన పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మాజీ ఎంపీపీ కర్రి వెంకటనారాయణ రెడ్డి(వాసురెడ్డి)కి అభినందనలు వెలువెత్తుతాయి.పెనుమంట్ర, ఆచంట నియోజకవర్గం లోని ఆచంట, పెనుగొండ, పోడూరు మండలాల చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున ఆయన కలిసి బొకేలు అందజేసి, సత్కారం చేసి శుభాకాంక్షలు తెలుపుతున్నారు.మంగళవారం నాడు వాసు రెడ్డిని కలిసి చిరుసత్కారం చేసి శుభాకాంక్షలు తెలియజేసిన రాహుల్ సామాజిక సేవా సంస్థ వృద్ధాశ్రమం అదినేత మరియు వైస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షులు జోగాడ ఉమామహేశ్వరరావు.., జిల్లా వైసీపీ చేనేత విభాగం అధ్యక్షులు వీరా మల్లికార్జునుడు. వైసిపి పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా (జాయింట్ సెక్రెటరీ) పదవి పొందిన ,కర్రీ వెంకటనారాయణ రెడ్డి ,(వాసు) కి శుభాకాంక్షలు తెలియజేశా రు.,పెనుమంట్ర మండల ఎస్సి సెల్ అధ్యక్షులు బుర్ర రవికుమార్ , వైసిపి నాయకులు వడ్లమూడి ప్రదీప్, మానుకొండ వెంకటేష్, తాడిపర్తి ప్రసన్నకుమార్ ,వడ్లమూడి రాబర్ట్ ,కోటే భూషణం ,దాయం యేసు రత్నం ,కుసుమే సురేష్ బాబు, పెనుమల శ్రీను, పచ్చిపాల సునీల్ తదితరులు కూడా వాసిరెడ్డిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

## విఆర్ఏలు వంటా వార్పుతో నిరసన

**ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు**

సహాయనిరాకరణ ఉద్యమంలో భాగంగా 14 వ రోజు రోడ్డు పై వంట వార్పు చేస్తూ నిరసన తెలుపుతున్న పాలకొల్లు మండల వి.ఆర్ఏలు మండల అధ్యక్షులు -రాపాక నరేష్ ,ఉప అధ్యక్షులు - దాసరి దుర్గాభవాని, సెక్రటరీ - బూర్గపు రాజు, ట్రెజరర్ - బుడితి కనకరాజు , నిడదవోలు తాతారావు, దాకరపు శివకుమార్, తాడిపర్తి వెంకటేశ్వరావు గారు ఇంకా అనేక మంది వి .ఆ ర్ .ఏ లు పాల్గొన్నారు.



## అంగన్వాడీ సిబ్బంది సేవలు అభినందనీయం

**ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు**



చిన్నారుల ఆరోగ్యం, పౌష్టికాహారం, ప్రాథమిక విద్యతో పాటు గర్భిణులు, బాలింతలు, తల్లుల ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, ఆశా కార్యకర్తలు అందిస్తున్న సేవలు అభినందనీయమని నాయకులు అన్నారు.దేశవ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న "అంగన్ మిలన్ సేవా" కార్యక్రమంలో భాగంగా పాలకొల్లు మున్సిపల్ కార్యాలయం వెనుకనున్న మెప్మా భవనంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ, ఆశా కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియచేశారు, వారి సేవలను గుర్తిస్తూ వారిని సన్మానించారు . చిన్నారుల సమగ్ర అభివృద్ధి, పౌష్టికాహారంపై అవగాహన, తల్లుల ఆరోగ్య పరిరక్షణలో వారు పోషిస్తున్న పాత్రను కొనియాడారు. కార్యక్రమానికి బీజేపీ పట్టణ అధ్యక్షులు కొల్లి కొండ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉన్నమట్ల కబర్ధి,అల్లూరి పద్మవర్మ, జక్కంపూడి కుమార్, వేరుకొండ దుర్గాప్రసాద్,గవర పవన్ నాయుడు, మల్లవోలు సురేష్, చెరుకూరి శ్రీనివాసరావు, నాళం బాబీ,పాటపత్రి గోపాల కృష్ణంరాజు,చందాని లక్ష్మీనారాయణ అంగన్వాడీ అధికారులు ఇందిరా,కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



### ఇంగ్లీషు భాషా పరిజ్ఞానంపై విద్యార్థులకు బేస్‌లైన్ పరీక్షలు.

**ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం**

ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల్లో ఉన్న ఇంగ్లీషు భాషా పరిజ్ఞానంపై మంగళవారం రామచంద్రపురం పట్టణంలోని వైఎస్సార్‌నగర్, రత్నంపేట, రాజకోట మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో బేస్‌లైన్ పరీక్షలు నిర్వహించారు. విభా లీఫ్ ఫార్వార్డ్ సంస్థ మేనేజరు ఎ.విజయకుమార్ నేతృత్వంలో పరీక్షలు నిర్వహించారు. 2వ తరగతి నుంచి 5వ తరగతి వరకు రాత పరీక్ష, ఓరల్ పరీక్ష నిర్వహించి, విద్యార్థుల్లో ఇంగ్లీషులో అభ్యసనా స్థాయిని పరిశీలించారు. కోనసీమ జిల్లాలో 1,032 పాఠశాలలు విభా లీఫ్ ఫార్వార్డ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోగా, జిల్లా వ్యాప్తంగా 11 పాఠశాలల్లో బేస్‌లైన్ నిర్వహిస్తున్నట్లు విజయకుమార్ పేర్కొన్నారు. పరీక్షల్లో విద్యార్థుల స్పందన సంతృప్తినిచ్చిందని విజయకుమార్ తెలిపారు. 2027 మార్చి నెలలో ఎంపిక చేసిన పాఠశాలల్లో ఎండ్‌లైన్ టెస్ట్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. విభా లీఫ్ ఫార్వార్డ్ బేస్‌లైన్ పరీక్షల్లో సమగ్ర శిక్షా ఏఎంఓ పి.రాంబాబు, ఎంఈవోలు ఎం.శ్రీనివాస్, వి.నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## రెండు నెలలుగా విధులకు గైర్హాజరయిన బెండమూరులంక వెల్ఫేర్ అసిస్టెంట్

### పట్టించుకోని జిల్లా సంక్షేమ అధికారి

**ప్రజభూమి ప్రతినిధి-అమలాపురం**




అల్లవరం మండలం బెండమూరులంక గ్రామ సచివాలయానికి చెందిన వెల్ఫేర్ అసిస్టెంట్ కె. సత్యనారాయణ ఆగష్టు 2వ తేదీ నుండి పెన్షన్ల పంపిణీ పూర్తి చెయ్యకుండా విధులకు హాజరు కాకపోవడంపై అల్లవరం ఎంపీడీవో కె. సత్య గౌరి కుమారి ఆగష్టు 3వ తేదీన మెమో జారీ చెయ్యడం జరిగింది. కానీ వెల్ఫేర్ అసిస్టెంట్ ఏవిధమయిన సమాధానం ఇవ్వకపోవడంతో ఆమె సంబంధిత సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అధికారికి తెలియపరచడం జరిగింది.సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ జిల్లా అధికారి వెంకట కృష్ణ ని వివరణ కోరగా ఈ ఆఫీస్ లో పెట్టడం జరిగిందని కలెక్టర్ చర్యలు తీసుకోవాలని తెలియపరిచారు.అల్లవరం మండలం బెండమూరులంక సచివాలయంలో సిబ్బంది కొరత కారణంగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీస్, బి. ఎల్. ఒ., డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్ శాఖలకు సంబంధించిన పనులు ఈమె ఒక్కరే మొత్తం చూస్తున్నారు. ఈ యొక్క సచివాలయం నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడం వలన రైతు సేవా కేద్రంలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ మరుగుదొడ్లు లేక మహిళా సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.

## భూ రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

### కలెక్టర్ :ఆర్. మహేష్ కుమార్

**ప్రజాభూమి ప్రతినిధి-అమలాపురం**



డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో భూ రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, ప్రజలకు భూ సంబంధిత సేవలను పారదర్శకంగా, సకాలంలో అందించాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు.మంగళవారం రాష్ట్ర సచివాలయం నుండి చీఫ్ సెక్రటరీ జి సాయి ప్రసాద్,రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జి . విజయ లక్ష్మి (సీసీఎల్ఏ) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఆర్డీవోలు, రెవెన్యూ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో భూ రీ-సర్వే పురోగతి, రెవెన్యూ సేవలు, పెండింగ్ ఫైళ్ల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రీ-సర్వేలో పెండింగ్‌లో ఉన్న గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి, గ్రామాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. రీ-సర్వే ధ్రువీకరణ పూర్తయిన 24 గంటల్లోగా వెబ్‌ల్యాండ్ పోర్టల్‌లో డేటాను అప్‌లోడ్ చేయాలని, డ్రాఫ్ట్ ఈ-కేవైసీ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. నవంబర్ నెలకు సంబంధించి డీఎల్ఆర్ దశలో ఉన్న గ్రామాల ప్రక్రియను రాబోయే 15 నుంచి 20 రోజుల్లోగా పూర్తి చేసి పోర్టింగ్ దశకు తీసుకురావాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. గ్రామాల్లో డ్రాఫ్ట్ ఈ-కేవైసీ నమోదు ప్రక్రియను 80 శాతానికి పైగా పూర్తి చేయాలని సూచించారు.రీ-సర్వే, రెవెన్యూ సేవల్లో పనితీరు మందకొడిగా ఉన్న మండలాల తహశీల్దార్లు, సంబంధిత ఆర్డీవోలతో కలెక్టర్లు ప్రతిరోజూ ఉదయం లేదా సాయంత్రం 15 నిమిషాల పాటు సమీక్ష నిర్వహించాలని ఉన్నతాధికారులు సూచించారు.మండలాల వారీగా పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని, క్షేత్రస్థాయి అధికారులు బాధ్యతతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.సెక్షన్ 22-ఏకు సంబంధించిన భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. నమోదైన దరఖాస్తులను 45 నుంచి 60 రోజుల కాలపరిమితిలోగా పరిష్కరించాలని సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 22-ఏ కేసులను నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హత ఆధారంగా త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. భూ సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందే అర్జీలను ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శ కాలకు అనుగుణంగా పరిష్కరించాలని ఉన్నతాధికారులు సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ వై. ఖోమ్. నైడియా దేవి, జిల్లా రెవెన్యూ అధికారి వి సుబ్బారావు, జిల్లా పరిపాలన శాఖ అధికారి కే.నాగలక్ష్మమ్మ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### రామచంద్రపురం మున్సిపాలిటీలో

## తేలిన కుల గణన లెక్కలు - రిజర్వేషన్లపై ఉత్కంఠ

- **మొత్తం 35, వేల 728 మంది ఓటర్లు.**
- **పురుషులు 17,వేల 188, మంది ఓటర్లు.**
- **మహిళలు 18,వేల 540 మంది ఓటర్లు.**
- **పురుషులు కంటే వెయ్యి 352 మంది మహిళా ఓటర్లు అధికం.**
- **పురపోరులో మహిళా ఓటర్లు ప్రాబల్యం.**

**ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం**




రామచంద్రపురం మున్సిపాలిటీకి చెందిన ఓటర్ల కులగణనకు సంబంధించిన లెక్కలు తేలడంతో ఆశావాహుల దృష్టి రిజర్వేషన్ల పై మళ్ళి ఆయా వార్డు రిజర్వేషన్ల కోసం ఆశావాహులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.దీంతో ఇక్కడ వార్డుల విభజనపై గతంలో ఉన్న 28 వార్డులకు అదనంగా మరో నాలుగు వార్డులు పెరగడంతో మొత్తం వార్డుల సంఖ్య 32కు చేరింది. తాజా లెక్కల ప్రకారం పురపాలిక సంఘం పరిధిలో మొత్తం 35,728 మంది ఓటర్లు ఉండగా, వారి కోసం 50 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రం పరిధిలో సగటున 715 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకునేలా సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.దీంతో రామచంద్రాపురం పురపాలక సంఘానికి సంబంధించి 32 వార్డుల వారీగా సిద్ధం చేయబడిన ఓటర్ల జాబితాలో ఎస్టీ ఓటర్లు 327, ఎస్సీ 4 వేల 794, బిసి16,వేల 513, ఇతరులు 14వేల 94 మంది ఓటర్లుగా గుర్తించడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ రాజు ఇప్పటికే వెల్లడించారు. రామచంద్రపురం పురపాలక సంఘంలోని 1వ వార్డు నుండి 32వ వార్డుల వరకు కుల గణన ప్రకారం ఓటర్ల గుర్తింపుతో కూడిన ఓటర్ల జాబితాలను నిర్దేశిత ఫారం-1లో సిద్ధం చేసి ప్రజల పరిశీలన కోసం రెవెన్యూ డివిజినల్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం,రామచంద్రపురం పురపాలక సంఘ కార్యాలయల్లో ఉంచడం జరిగింది.

**వార్డుల వారీగా ఓటర్లు వివరాలు:**

రామచంద్రపురం పురపాలక సంఘం పరిధిలో 32 వార్డలవారీ ఓటర్లు సంఖ్య ఇలా ఉంది.తాజా లెక్కల ప్రకారం ఒకటవ వార్డులో 433 మంది పురుషులు 443 మంది స్త్రీలు కాగా మొత్తం 876 మంది ఓటర్లు ఉన్నారు.అలాగే 2వ వార్డులో 334 మంది పురుషులు మంది 351మంది స్త్రీలు మొత్తం 685 మంది,3వ వార్డులో 496 పురుషులు 508 స్త్రీలు మొత్తం ఒక వెయ్యి 4 మంది ఓటర్లు ఉన్నారు.4వ వార్డులో 500 పురుషులు 563 స్త్రీలు మొత్తం ఒక వెయ్యి 63 మంది ఓటర్లు,5వ వార్డులో 470 పురుషులు 524 స్త్రీలు మొత్తం 994 మంది,6వ వార్డులో 502మంది పురుషులు 503 స్త్రీలు మొత్తం ఒక వెయ్యి 5 గురు,7వవార్డులో 561మంది పురుషులు 548 మంది స్త్రీలు మొత్తం ఒక వెయ్యి 109 మంది ఓటర్లు,8వ వార్డులో 551మంది పురుషులు 587 మంది స్త్రీలు మొత్తం 1వెయ్యి 138 మంది ఓటర్లు,9వార్డులో,552 మంది పురుషులు,599 మంది స్త్రీలు మొత్తం వెయ్యి 151మంది ఓటర్లు,10వ వార్డులో 520 మంది పురుషులు,547 మంది స్త్రీలు మొత్తం వెయ్యి 67 మంది ఓటర్లు,11వ వార్డలో 583 మంది పురుషులు, 637 మహిళలు మొత్తంఒక వెయ్యి 220 మంది ఓటర్లు,12వ వార్డలో 574 మంది పురుషులు, 648 స్త్రీలు మొత్తం వెయ్యి 222 మంది ఓటర్లు,13వ వార్డులో 611మంది పురుషులు,697 మంది స్త్రీలు మొత్తం ఒక వెయ్యి 308 మంది ఓటర్లు,14వ వార్డులో 599 మంది పురుషులు,628 స్త్రీలు మొత్తం వెయ్యి 227 మంది స్త్రీలు ఓటర్లు,
15వ వార్డులో 504 మంది పురుషులు,553 మంది స్త్రీలు మొత్తం వెయ్యి 57 మంది ఓటర్లు,16వ వార్డులో 561 మంది పురుషులు,629 మంది స్త్రీలు మొత్తం వెయ్యి 190 మంది ఓటర్లు,17వ వార్డులో572 మంది పురుషులు,635 మంది స్త్రీలు వెయ్యి 207 మంది ఓటర్లు,18వ వార్డులో 631 మంది పురుషులు,694 మంది స్త్రీలు మొత్తం వెయ్యి 325 మంది ఓటర్లు,19వ వార్డులో626 మంది పురుషులు,621మంది స్త్రీలు మొత్తం వెయ్యి 247 మంది ఓటర్లు,20 వి వార్డులో 637మంది పురుషులు 678 స్త్రీలు మొత్తం వెయ్యి 315 మంది ఓటర్లు 21వ వార్డులో 568 మంది పురుషులు 643 మంది స్త్రీలు మొత్తం వెయ్యి 211 మంది ఓటర్లు ఉన్నారు.అలాగే 22వ వార్డులో 470 పురుషులు 511మంది స్త్రీలు మొత్తం 981మంది ఓటర్లు 23వ వార్డులో 583 మంది పురుషులు,612 మంది స్త్రీలు మొత్తం వెయ్యి 195 మంది ఓటర్లు,24వ వార్డులో 512మంది పురుషులు 497 మంది స్త్రీలు మొత్తం వెయ్యి 9 మంచి ఓటర్లు,25 వ వార్డులో 481మంది పురుషులు 529 మంది స్త్రీలు మొత్తం వెయ్యి 10 మంది ఓటర్లు ,26 వార్డులో 454 మంది పురుషులు, 532 మంది స్త్రీలు మొత్తం 986 మంది ఓటర్లు, 27వ వార్డులో 439 మంది పురుషులు,485 మంది పురుషులు, మొత్తం 924 ఓటర్లు,28వ వార్డులో 625 మంది పురుషులు,686మొత్తం వెయ్యి 311 ఓటర్లు,29వ వార్డులో 567 పురుషులు,602 మంది స్త్రీ లు, మొత్తం వెయ్యి169 మంది ఓటర్లు ,30వ వార్డులో 621 మంది పురుషులు,694 మంది స్త్రీలు మొత్తం వెయ్యి 315 మంది ఓటర్లు,31వ వార్డులో 551 మంది పురుషులు,580 మంది స్త్రీలు, మొత్తం వెయ్యి 131 మంది ఓటర్లు కాగా 32వ వార్డలో 500 మంది పురుషులు,576 మంది స్త్రీలు మొత్తం వెయ్యి 76 మంది ఓటర్లు కాగా వీరిలో 17 , 188 మంది పురుష ఓటర్లు,18,వేల 540 మంది మహిళా ఓటర్లు మొత్తం 35,వే 728 మంది ఓటర్లు రానున్న మున్సిపల్ ఎన్నికల్లో తమతమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. అయితే ఇక్కడ అన్ని వార్డుల్లో పురుషులు కంటే మహిళలే 1352 మంది ఓటర్లు అధికంగా ఉండటంతో రానున్న స్థానిక పోరులో ఇక్కడ మహిళా ఓటర్లు ప్రాబల్యం స్పష్టంగా కనిపిస్తోంది.

## రూ.2.20 కోట్లతో పోతునూరు-కేతవరం బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన

**ప్రజాభూమి ప్రతినిధి-దెందులూరు**



పల్లె పండుగ 3.0లో భాగంగా పోతునూరు నుంచి కేతవరం వరకు రూ.2.20 కోట్లతో నిర్మించనున్న నూతన బీటీ రోడ్డు పనులకు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శంకుస్థాపన చేశారు.గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు స్థానిక కూటమి నాయకులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో పల్లె పండుగ 3.0 కింద రూ.24 కోట్లకు పైగా రోడ్ల పనులు మంజూరయ్యాయని తెలిపారు.అలాగే సుమారు 300 గోకులాల షెడ్లు మంజూరు చేసినట్లు చెప్పారు.పోతునూరు-కేతవరం రోడ్డు పనులను వచ్చే సంక్రాంతిలోపు నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ గారపాటి రామసీత టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉప్పలపాటి రాంప్రసాద్, తెలుగు యువత అధ్యక్షుడు మోతుకూరి నాని,పలువురు కూటమి నాయకులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఏలేరు జలాశయంలో చేప పిల్లల విడుదల

- మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుంది
- ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభా రాజా

ప్రజాభూమి ప్రతినిధి–ప్రత్తిపాడు

మత్స్య సంపద అభివృద్ధితో పాటు మత్స్యకారుల జీవనోపాధికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే శ్రీమతి వరుపుల సత్యప్రభా రాజా తెలిపారు. ఏలేశ్వరం మండలం ఏలేశ్వరం టౌన్‌లోని ఏలేరు జలాశయం వద్ద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మత్స్య శాఖ, కాకినాడ జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభా రాజా ముఖ్య అతిథిగా హాజరై ఏలేరు జలాశయంలో చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ



మత్స్యకారుల సంక్షేమం, వారి జీవనోపాధి మెరుగుదలకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. ముఖ్యంగా వేట నిషేధ కాలంలో మత్స్యకార కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తూ వారికి అండగా నిలుస్తామని పేర్కొన్నారు. జలాశయాల్లో చేపల పెంపకాన్ని ప్రోత్సహించడం ద్వారా మత్స్య సంపదను అభివృద్ధి చేయడంతో పాటు మత్స్యకారులకు అదనపు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. మత్స్య సంపద పెరిగితే మత్స్యకారుల ఆదాయం కూడా పెరిగే అవకాశం ఉంటుందని, వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. చేప పిల్లల విడుదల కార్యక్రమం ద్వారా ఏలేరు జలాశయంలో మత్స్య సంపద అభివృద్ధికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని అధికారులు తెలిపారు. మత్స్యకారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ అధికారులు, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ కార్యకర్తలు, మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

## చోదిమెళ్లలో ఘనంగా జయహో మహా భరణి పూజ, కాలభైరవ హోమం



ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు

స్థానిక 27వ డివిజన్ చోదిమెళ్ల గ్రామంలో ఫ్లాష్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జయహో మహా భరణి పూజా కార్యక్రమం, కాలభైరవ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏలూరు జిల్లా తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు,ఏలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) సతీసమేతంగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఏలూరు అగ్రికల్చరల్ మార్కెట్ యార్డ్ చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి,ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, టీడీపీ ప్రధాన కార్యదర్శి రెడ్డి నాగరాజు,ఫ్లాష్ శ్రీనివాస్‌తో పాటు ఫ్లాష్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, స్థానిక నాయకులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్రేయపురం మండలంలో
# ప్రశాంతంగా పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు

ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. మండల పరిధిలోని 41 ప్రాథమిక పాఠశాలలు, 2 ప్రాథమికోన్నత పాఠశాలలు, 9 ఉన్నత పాఠశాలల్లో ఎన్నికలు జరుపగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు మండల విద్యాశాఖాధికారులు పి.వి. ప్రసాద రావు, ఎ. సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ర్యాలి గ్రామంలోని ఆర్.జెడ్.పి. ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల్లో చైర్మన్‌గా కొటారపు నాగేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా



కొక్కిరి నారాయణమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దల సమక్షంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు ఎన్నికల నిబంధనలను పాటిస్తూ పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేశారని అధికారులు తెలిపారు. పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంలో పాఠశాల యాజమాన్య కమిటీలు కీలక పాత్ర పోషించాలని వారు సూచించారు. ఎన్నికల సందర్భంగా పాఠశాలల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు, పోలీసులు తగిన చర్యలు చేపట్టారు. కార్యక్రమాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులతో పాటు మండల తహసీల్దార్ ఆర్. దుర్గా రామచంద్రమూర్తి, రావులపాలెం రూరల్ సీఐ సి.హెచ్. విద్యాసాగర్, ఎస్ఐ రాము తదితరులు పాల్గొన్నారు.

## వెదిరేశ్వరం ఎస్ఎంసీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థుల విజయం

ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట

రావులపాలెం మండల వ్యాప్తంగా పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వెదిరేశ్వరం గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎస్ఎంసీ ఎన్నికలు ఆసక్తికరంగా సాగాయి. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు కూటమి పార్టీలు బలపరిచిన 12 మంది అభ్యర్థులు ఈ ఎన్నికల్లో విజయం సాధించినట్లు స్థానిక నాయకులు తెలిపారు.



అధికార, ప్రతిపక్ష వర్గాల మధ్య పోటీ నెలకొన్నప్పటికీ కూటమి బలపరిచిన అభ్యర్థులు మెజారిటీ స్థానాలను దక్కించుకున్నారు. అనంతరం నిర్వహించిన కమిటీ సమావేశంలో ఎస్ఎంసీ చైర్మన్‌గా పిల్లి నాగరాజు (బీసీ), వైస్‌చైర్మన్‌గా తాళ్ల నీలిమ (ఎస్సీ) ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన ఎస్ఎంసీ చైర్మన్, వైస్‌చైర్మన్, సభ్యులను గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు అభినందించి సత్కరించారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు నూతన కమిటీ సమన్వయంతో పనిచేయాలని వారు ఆకాంక్షించారు

## ఎస్ఎంసీ నూతన చైర్మన్లు, వైస్ చైర్మన్లకు ఎమ్మెల్యే బండారు శుభాకాంక్షలు

ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట

కొత్తపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో పాఠశాలల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు. ఈ ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన ఎన్‌డీఏ కూటమి మద్దతుదారులైన ఎస్ఎంసీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కమిటీ సభ్యులకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పాఠశాలల అభివృద్ధిలో ఎస్ఎంసీల పాత్ర కీలకమన్నారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కమిటీ సభ్యులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ



పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్యా ప్రమాణాల మెరుగుదల, విద్యార్థుల హాజరు శాతం పెంపు వంటి అంశాలపై ఎస్ఎంసీ సభ్యులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. నూతనంగా ఎన్నికైన ఎస్ఎంసీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కమిటీ సభ్యులు పాఠశాలల అభివృద్ధిని తమ ప్రధాన బాధ్యతగా భావించి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆకాంక్షించారు.

## వట్లూరులో జరిగిన జాబ్ మేళాలో 71 మంది ఎంపిక.



ప్రజాభూమి ప్రతినిధి–పెదపాడు

ప్రభుత్వ ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఐ.టీ.ఐ, కాలేజ్ వట్లూరు, ఏలూరు జిల్లా నందు ఆంధ్ర ప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ నిర్వహించిన జాబ్ మేళా లో 117 మంది యువత హాజరు అయి 71 మంది వివిధ కొలువులకు ఎంపిక చేసినట్లు ఏలూరు జిల్లా డీ. ఎస్. డీ. ఓ., ఎన్ జితేంద్ర బాబు తెలిపారు. ఈ జాబ్ మేళా లో ఎన్. జితేంద్రబాబు, డీ.ఎస్.డీ.ఓ, రాజేశ్వరి, ప్లేస్మెంట్ ఆఫీసర్, ఐ.టీ.ఐ 11 కంపెనీల ప్రతి నిధులు పాల్గొనడం జరిగిందని ఆయన తెలిపారు.

## ఏలూరులో టీడీపీ ఆధ్వర్యంలో న్యాయ సలహా కేంద్రం ప్రారంభం

ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు

న్యాయ అవగాహనతోనే చైతన్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని జిల్లా టీడీపీ అధ్యక్షులు,ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ప్రజల న్యాయపరమైన సమస్యలకు ఉచిత సలహాలు,మార్గదర్శకత్వం అందించేందుకు ఏలూరు పవర్‌పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో న్యాయ సలహా కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ కేంద్రంలో ఏడుగురు న్యాయవాదులు ప్రజల సమస్యలను స్వీకరించి తగిన సలహాలు, సూచనలు అందించారు. ఏలూరు



పార్లమెంట్ లీగల్ సెల్ అధ్యక్షులు పి.సాయి రమేష్,కార్యదర్శి ఎం.వి. సురేష్,టీడీపీ లీగల్ సెల్ ప్రతినిధులు పుచ్చల వెంకట్,కె.కన్న బాబు, జేఎంవీవీ ప్రసాద్, సిహెచ్ఎన్ శిరీషాదేవి,ఆర్. కిషోర్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బడేటి చంటి మాట్లాడుతూ ప్రజలు తమ హక్కులు, బాధ్యతలు,చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతి మంగళవారం న్యాయ సలహా కేంద్రం ద్వారా ప్రజలకు సేవలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మీడియా కో–ఆర్డినేటర్ చల్లా వెంకట సత్యవరప్రసాదరావు,నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం,పార్టీ నాయకులు,మాజీ కార్పొరేటర్లు,క్లస్టర్,డివిజన్ ఇంచార్జిలు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్తును ఆకస్మిక తనిఖీలు చేసిన
# జిల్లా కలెక్టరు, జిల్లా పరిషత్తు ప్రత్యేక అధికారి కె.వెట్రి సెల్వి.

ప్రజాభూమి బ్యూరో–ఏలూరు జిల్లా.

ఏలూరు జిల్లా పరిషత్తు కార్యాలయమును మంగళవారం జిల్లా కలెక్టరు మరియు జిల్లా పరిషత్తు ప్రత్యేక అధికారి కె.వెట్రిసెల్వి ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరుకు, జిల్లా పరిషత్తు డిప్యూటీ సిఇవో కె.భీమేశ్వర్, ఇతర అధికారులు పూల మొక్కలను అందజేశారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు పేరుపేరునా పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు, జిల్లా పరిషత్తు ప్రత్యేక అధికారి కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి సబ్జెక్టుపై పూర్తి అవగాహన కలిగి ఉండి, అడిగిన ప్రశ్నలకు



చక్కని సమాధానం ఇచ్చేలా ఉండాలని అన్నారు. బదిలీపై వచ్చిన ఉద్యోగులకు ఇంకా సీట్లు కేటాయించక పోవడంపై అసహనం వ్యక్తం చేశారు. వెనువెంటనే సీట్లు కేటాయించి, విధులు నిర్వర్తించేలా చూడాలని ఆదేశించారు. రాబోయే ఎన్నికలకు అధికారులు, ఉద్యోగులు సంసిద్ధులై ఉండాలని అన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా ఎన్ని ఫిర్యాదులు వచ్చాయని, ఎన్ని పరిష్కారం చూపారని, ఇంకా ఎన్ని పెండింగులో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. విశ్రాంత ఉద్యోగులకు మెడికల్ రియంబర్స్మెంటు, పిఎఫ్ లు, తదితర బకాయిలుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. కార్యాలయంకు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా అధికారులు, సిబ్బంది బాధ్యతా యుతంగా విధులు నిర్వహించాలని అన్నారు. రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించడంతో పాటు, పెండింగు అంశాలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది సమయ పాలన పాటిస్తూ విధులకు హాజరై, తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సిఇవో కె.భీమేశ్వర్, ఏవో కె.వి.విక్టర్ జాన్సన్, అధికారులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యా కమిటీ చైర్మన్గా షేక్ నజీమా.



ప్రజా భూమి ప్రతినిధి–చాట్రాయి.

తుమ్మ గూడెం గ్రామంలోనిఎంపీపీ ఎస్ ఉర్దూ స్కూల్లో ఎస్ఎంసి ఎన్నికలు మంగళవారం జరపగా నూతన విద్యా కమిటీ చైర్మన్గా షేక్ నజీమా ఎన్నిక కావడం జరిగిందనీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంప వెంకట్రావు తెలిపారు. వైస్ చైర్మన్ గా షేక్ అయేషా ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఎల్లవేళలా సహాయ సహకార లు ఇస్తామని తెలియజేసినారు. ఎన్నిక కాబడిన నూతన చైర్మన్ కు ఉపాధ్యాయులు విద్యార్థులు అభినందనలు తెలియజేసినారు. పాత ఎస్ఎంసి చైర్మన్ . హసీనా గకి సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంపా వెంకట్రావు, ఎండీ. ఈసా, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## క్యూఆర్ కోడ్ విధానంపై రేషన్ డీలర్లకు అవగాహన





ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట.

రేషన్ బియ్యం పంపిణీలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ విధానంపై కోనసీమ జిల్లా సివిల్ సప్లైస్ అధికారి (డీఎస్ఓ), ఎంఎస్ఓ ఆధ్వర్యంలో మంగళవారం రావులపాలెం మండల పరిషత్ కార్యాలయంలో కొత్తపేట డివిజన్ పరిధిలోని రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యూఆర్ కోడ్ విధానం అమలు, ఎదురవుతున్న సమస్యలు, తీసుకోవాల్సిన చర్యలపై డీలర్లతో చర్చించారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్లు మాట్లాడుతూ బియ్యం బస్తాలపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసే సమయంలో పలు సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా సకాలంలో క్యూఆర్ కోడ్ స్కాన్ కాకపోవడంతో 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు సమయానికి బియ్యం పంపిణీ చేయలేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై డీఎస్ఓ స్పందిస్తూ క్యూఆర్ కోడ్ స్కానింగ్‌కు సంబంధించిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. క్యూఆర్ కోడ్ స్కానింగ్‌లో ఏవైనా సమస్యలు ఎదురైతే వాటిని కేఎన్ఎస్ఎం వాట్సాప్ గ్రూపులో తెలియజేయాలని డీలర్లకు సూచించారు. అలాగే మీ మార్ట్‌కు సంబంధించి ఆసక్తి, శ్రద్ధ కలిగిన రేషన్ డీలర్లు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతి రేషన్ కార్డుదారుడి మొబైల్ ఫోన్ నంబర్‌ను సంబంధిత రేషన్ కార్డుతో అనుసంధానం చేయాలని డీలర్లకు సూచించారు. రేషన్ పంపిణీ ప్రక్రియలో సాంకేతిక సమస్యలను అధిగమిస్తూ, కార్డుదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు డీలర్లకు సూచించారు.

## మామిడికుదురు హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్‌గా వేగి శ్రీనివాస్

ప్రజాభూమి ప్రతినిధి–మామిడికుదురు



జనసేన పార్టీ తరఫున గ్రామ శాఖ ఇంటి మహేంద్ర సొసైటీ డైరెక్టర్ మట్ట సత్తిబాబు సీనియర్ నాయకులు రుద్ర శ్రీను, కటకంశెట్టి కృష్ణ, ఈతకోట రమణ,కాట్రేనిపాడు నాగేంద్ర, బత్తుల శేఖర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సర్వసభ్య సమావేశానికి హాజరైన సోసైటి చైర్మన్లు.




ప్రజా భూమి ప్రతినిధి–కాజులూరు

కాకినాడలో మంగళవారం జరిగిన డి సి ఎం ఎస్, సర్వసభ్య సమావేశానికి రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరు మండలానికి చెందిన పలువురు సొసైటీ చైర్మన్లు హాజరయ్యారు. ఈ కార్యక్రమం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డి సి ఎం ఎస్ చైర్మన్ పిచ్చేట్టి చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కోలంక సొసైటీ అధ్యక్షులు బొండా వెంకట నరసింహా నాయుడు, కాజులూరు సొసైటీ అధ్యక్షులు యళ్ళ వెంకటరమణ, మంజేరు సొసైటీ అధ్యక్షులు గండి ధనరాజు, అర్యవటం సొసైటీ అధ్యక్షులు కోట తతబ్బాయి, కోరంగి సొసైటీ అధ్యక్షులు బాబీ తదితరులు పాల్గొన్నారు.

## ఆకస్మికంగా వచ్చిన గోదావరి వరదతో నిండా మునిగిన మిర్చి రైతులు.





ప్రజా భూమి ప్రతినిధి–వేలేరుపాడు

వర్షాలు లేవు వరదలు రావు అనే నమ్మకంతో వేలేరుపాడు మండలంలోని రైతాశీగం మిర్చి పంటను వేలాది ఎకరాల్లో నాటారు. ఆకస్మికంగా ఈనెల 26 27 తేదీల్లో ఒక్కసారిగా భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 43 అడుగులకు చేరటం శబరి నది ఉధృతంగా ప్రవహించడంతో, వేలేరుపాడు మండలానికి వరద ముశీప్పు ఎక్కువగానే చూపింది. దీనితో వేలాది ఎకరాల్లో నాటిన మిర్చి, మినుము వంటి పంటలన్నీ గోదావరి వరదకు మునిగిపోయి భారీ నష్టాన్ని చెవి చూడాల్సిన దుస్థితి వేలేరుపాడు మండల రైతాంగానికి జరిగింది.

# కడవకల్లుజెడ్పీటీసీ హైస్కూల్ విద్యా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



ప్రజాభూమి, పుట్లూరు.
కడవకల్లు జెడ్పీటీసీ హైస్కూల్‌లో విద్యా కమిటీ ఎన్నికలు మంగళవారం నిర్వహించడం జరిగినది. ఈ ఎన్నికల్లో విద్యా కమిటీ చైర్మన్‌గా ఎస్. సూరి, వైస్ చైర్మన్‌గా బాల నరసింహులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా మొత్తం 15 మంది సభ్యులతో విద్యా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించేందుకు కమిటీ కృషి చేస్తుందని వారు తెలిపారు.

## నెట్‌జీరో హెల్త్ క్యాంపస్‌గా అంబేద్కర్ గురుకులం

### -ఒకే రోజు 1,625 మొక్కలు నాటిన సిబ్బంది



ప్రజా భూమి నార్పల
మండల పరిధిలోని బివప్పూరు గ్రామపంచాయతీ పరిధిలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలను 2026--27 ఆర్థిక సంవత్సరానికి నెట్‌జీరో హెల్త్ క్యాంపస్ (ఎన్‌జెడ్‌హెచ్‌సీ)లిగా తీర్చిదిద్దేందుకు ఎంపిక చేశారు. ఇందులో భాగంగా మంగళవారం పాఠశాల క్యాంపస్‌లో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. విద్యార్థులకు పరిశుభ్రమైన గాలి, స్వచ్ఛమైన తాగునీరు, పచ్చదనం, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడంతో పాటు క్యాంపస్ నుంచి వెలువడే గ్రీన్‌హౌస్ వాయువులను నికర సున్నా స్థాయికి తీసుకురావడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. క్యాంపస్‌లో మొత్తం 1,625 మొక్కలు నాటారు. ఇందులో 225 టాల్ ప్లాంట్స్‌తో పాటు సుమారు 1,400 ష్రబ్స్, హెర్బ్స్ మొక్కలు ఉన్నాయి. మొక్కల నిర్వహణ, ఇతర అవసరాలకు కలిపి సుమారు రూ.5 లక్షల అంచనా వ్యయం ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు, గ్రీన్‌వాటర్, బ్లాక్‌వాటర్ నిర్వహణకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా క్యాంపస్‌లో కమ్యూనిటీ సోక్‌పిట్‌ను నిర్మించారు. ఈ కార్యక్రమంలో వి.బి.జి. రాంజీ,ఎంపీడీవో, ఏపీడీ అనంతపురం క్లస్టర్ అధికారులు, పాఠశాల సిబ్బంది, మండల నాయకులుఆలం వెంకట నరసానాయుడు, రాష్ట్ర వాల్మీకి బోర్డు డైరెక్టర్ కుల్లాయప్ప, కోఆపరేటివ్ సంఘంఅధ్యక్షుడు ఉమామహేశ్వర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పూలకుంట పాఠశాలల కమిటీ చైర్మన్‌లు ఏకగ్రీవం



ప్రజాభూమి, హిందూపురం టౌన్
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాఠశాలల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పాఠశాలల కమిటీ చైర్మన్ ల ఎన్నికలు హిందూపురం రూరల్ మండల పరిధిలోని పూలకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక ఉన్నత పాఠశాలల కమిటీ చైర్మన్ ల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎన్నికలు నిర్వహించగా చైర్మన్ స్థానానికి కే గంగాధర్ పోటీ చేయగా ఇతరులు ఎవరు బరిలో లేకపోవడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. అలాగే వైస్ చైర్మన్‌గా డి. సల్మా ఎన్నికయ్యారు. ఇకపోతే గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల కమిటీ ఎన్నిక కూడా ఏకగ్రీవంగా జరిగింది. పాఠశాల కమిటీ చైర్మన్ గా సురేష్, వైస్ చైర్మన్ గా ఎస్.సువర్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఆయా పాఠశాలలకు కమిటీ సభ్యులను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు పాఠశాల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం, మౌలిక వసతుల మెరుగుదలతో పాటు ప్రభుత్వం చేపడుతున్న విద్యాభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయడంలో తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేస్తూ, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సూచనలు, ఆదేశాలకు అనుగుణంగా పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూలకుంట మాజీ సర్పంచ్ యన్.మంజునాథ్, నాయకులు శ్రీనివాసులు, గంగాధర్, రమేష్ జబీబుల్లా, సురేష్, గంగాధర్ లతో పాటు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకోవాలి

### –నేటి ధర్నాను విజయవంతం చేయండి
### –కరపత్రాలు పంపిణీ చేసిన సిపిఎం నాయకులు

ప్రజాభూమి, హిందూపురం టౌన్
వర్షాభావ పరిస్థితులతో తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ పట్టణంలోని పలు ప్రాంతాల్లో సిపిఎం నాయకులు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జెడ్పీ శ్రీనివాస్, నాయకులు విఆర్ రాము మాట్లాడుతూ, ప్రభుత్వం తక్షణమే సత్యసాయి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలన్నారు. అలాగే రైతుల కోసం రూ.20వేలు కోట్లు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాలో అతి తక్కువ వర్షపాతం నమోదు కావడంతో రైతులు పంటలు సాగు చేసి నష్టపోవడం జరిగిందన్నారు. వర్షాభావం వల్ల పశువులు, గొర్రెలు, మేకలకు, మేత, నీళ్ల సమస్య తీవ్రంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పాల రైతులు పశుపోషకాలు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. సాగు విస్తీర్ణం తగ్గి వ్యవసాయ పనులు లేక ఉపాధి కూలీలు ఆర్థిక సమస్య ఎదుర్కొంటున్నారని, ఇలాంటి దయనీయ పరిస్థితులలో జిల్లా రైతాంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కరువు పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు ఈనెల 26, 27,28 తేదీలలో జిల్లా వ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో జీపు జాతాలు చేపట్టి బుధవారం పుట్టపర్తి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, చేతివృత్తిదారులు, కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఇందులో భాగంగా పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు, పట్టుగూళ్ల విక్రయ కేంద్రం తదితర ప్రాంతాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



# విజయనగర లా కాలేజ్‌లో నిర్వహించిన “యువత భవితకు భరోసా” కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంపీ అంబిక





ప్రజాభూమి ప్రతినిధి,అనంతపురం
అనంతపురం నగరంలోని హౌసింగ్ బోర్డు వద్ద ఉన్న విజయనగర లా కాలేజ్‌లో నిర్వహించిన “యువత భవితకు భరోసా” కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ పాల్గొని, లా విద్యార్థులతో ముచ్చటించడం ఎంతో ఆనందంగా అనిపించింది. న్యాయ విద్య అనేది కేవలం ఒక వృత్తికి సంబంధించిన విద్య మాత్రమే కాదు. సమాజంలో న్యాయం, ధర్మం, రాజ్యాంగ విలువలను కాపాడే బాధ్యతను ప్రతి న్యాయ విద్యార్థికి అందించే గొప్ప విద్య. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ, విద్యార్థులకు మెరుగైన విద్య, ఆధునిక సౌకర్యాలు, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యార్థులను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేలా సాంకేతిక విద్య, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమలకు అనుసంధానం వంటి అంశాలకు ప్రాధాన్యత లభిస్తోంది. యువతలో ప్రతిభను గుర్తించి, వారికి మెరుగైన అవకాశాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ భారత రాజ్యాంగం, న్యాయ వ్యవస్థపై లోతైన అవగాహన పెంపొందించుకోవాలని, న్యాయ రంగంలో వృత్తిపరంగా ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించాను. న్యాయవాదులు ప్రజలకు న్యాయం అందించడంలో, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తారు. వివిధ కేస్ స్టడీల ద్వారా న్యాయ వ్యవస్థ ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చని, తప్పు చేసిన వారికి చట్ట ప్రకారం శిక్ష పడేలా చేయడంలో న్యాయవాదుల పాత్ర ఎంతో ముఖ్యమని వివరించాను. ఈ కళాశాల నుంచి గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులు ఉండటం అభినందనీయం. జూనియర్ న్యాయవాదులకు అవసరమైన మార్గదర్శకత్వాన్ని అందిస్తూ, విద్యార్థులను న్యాయ రంగంలో ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కళాశాల చేస్తున్న కృషి ప్రశంసనీయం. ఈ కార్యక్రమంలో కళాశాల ఫౌండర్ ఆలూరు రామిరెడ్డి రెడ్డి, కరస్పాండెంట్ శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్ రాఘవేంద్ర చారి, సీనియర్ అడ్వకేట్ నరసింహులు, సీనియర్ లెక్చరర్ శ్రీ హరి, అధ్యాపకులు మరియు లా విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన “వన్ ఫ్యామిలీ

### - వన్ ఎంట్రప్రెన్యూర్” కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంపీ






ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం
అనంతపురం నగరంలోని అలెగ్జాండర్ హోటల్‌లో మంగళవారం జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన “వన్ ఫ్యామిలీ -- వన్ ఎంట్రప్రెన్యూర్” కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ పాల్గొని, స్థానిక శాసనసభ్యులు దగ్గుపాటి ప్రసాద్‌తో కలిసి పారిశ్రామికవేత్తలు, యువత, మహిళలు మరియు ఔత్సాహికులతో ముచ్చటించడం జరిగింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు, ప్రతి కుటుంబం ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేలా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతోంది. “వన్ ఫ్యామిలీ -- వన్ ఎంట్రప్రెన్యూర్” కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబం నుంచి కనీసం ఒకరిని పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడటంతో పాటు, అవకాశాలను సృష్టించే స్థాయికి ఎదగాలి. మన చుట్టూ ఉన్న స్థానిక అవసరాలు, ప్రజల సమస్యలు, మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను గుర్తించి వాటికి అనుగుణంగా వ్యాపారాలను ప్రారంభిస్తే మంచి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. ముఖ్యంగా ఎంఎస్‌ఎంఈ రంగంలో యువతకు, మహిళలకు అనేక అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, పథకాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి, వ్యాపార రంగాల్లో ముందుకు రావాలి. అనంతపురం జిల్లాలో అరటి, టమాటా, వివిధ రకాల పండ్లు వంటి వ్యవసాయ ఉత్పత్తులకు మంచి అవకాశాలు ఉన్నాయి. వీటిని విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి, ప్రాసెసింగ్ మరియు ప్యాకేజింగ్ రంగాల్లో పరిశ్రమలను ఏర్పాటు చేసి, దేశీయ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతులు చేసే స్థాయికి మన యువ పారిశ్రామికవేత్తలు ఎదగాలి. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ మార్కెటింగ్, ఈ-కామర్స్, డిజిటల్ షాపింగ్ వంటి అవకాశాలను ఉపయోగించుకుని మన ఉత్పత్తులను విస్తృత మార్కెట్‌కు తీసుకెళ్లాలి. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త తయారైతే కుటుంబ ఆర్థిక స్థితి మాత్రమే కాదు, స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగి, జిల్లా ఆర్థిక అభివృద్ధికి కూడా దోహదపడుతుంది. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ యాదవ్, ఎంఎస్‌ఎంఈ కోఆర్డినేటర్ నాగకుమారి, ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ వెంకటనారాయణ, ఏపీఐఐసీ డైరెక్టర్ లక్ష్మీ ప్రసాద్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేష్, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కొండయ్య, హాస్పిటల్ కమిటీ సభ్యులు నరసింహులు, డీఆర్‌డీఏ పీడీ శ్రీమతి శైలజ, జిల్లా వ్యాపారవేత్తలు, పారిశ్రామిక అధికారులు, సిబ్బంది, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# 20 సంవత్సరాల సమస్యకు కేవలం 3 నెలల్లోనే శాశ్వత పరిష్కారం

### - : కూటమి ప్రభుత్వంతో గ్రామీణ ప్రాంతాలకు కొత్త వెలుగు..- పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి





ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం
20 ఏళ్ల సమస్యకు కేవలం 3 నెలల్లోనే పరిష్కారం చూపించామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా రుద్రంపేట పంచాయతీ చంద్రబాబునగర్ లోని చైతన్య కాలనీలో మంగళవారం నూతన సిసి రోడ్డుకుఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు. 73.95 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల రూపు రేఖలు మారిపోతున్నాయని.. పల్లెలకు కొత్త వెలుగు వచ్చిందన్నారు. పల్లె పండుగ 3.0 లో భాగంగా అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి మొత్తం రూ.2.35 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. వీటితో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గారి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, శరవేగంగా అడుగులు వేస్తోందన్నారు. మూడు నెలల క్రితం చైతన్య కాలనీకి పింఛన్ల పంపిణీ కార్యక్రమం కోసం వచ్చినప్పుడు, స్థానిక ప్రజలు తమ కాలనీలో రోడ్లు లేక పడుతున్న ఇబ్బందులను మా దృష్టికి తెచ్చారన్నారు. గత 20 ఏళ్లుగా ఇక్కడ రోడ్డు సౌకర్యం లేదని ఆవేదన వ్యక్తం చేశారని.. ఆరోజు ఇచ్చిన మాట ప్రకారం.. కేవలం 3 నెలల స్వల్ప వ్యవధిలోనే నిధులు మంజూరు చేయించి, నేడు ఇక్కడ పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. గతంలో ఈ చైతన్య కాలనీ స్వల్ప వర్షాలకే ముంపునకు గురయ్యేదని, ఇప్పుడు కొత్తగా సీసీ రోడ్లతో పాటు పటిష్టమైన డ్రైనేజీ వ్యవస్థను కూడా నిర్మిస్తున్నందున ఆ ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆయన వివరించారు. ప్రజా సంక్షేమంతో పాటు గ్రామాల మౌలిక వసతుల కల్పనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందంటూ పల్లె పండుగ ప్రాధాన్యతను ఎమ్మెల్యే తెలియజేశారు.

# ఏ.ఆర్.ఎస్ రేకులకుంటలో ఘనంగా అగ్రి ఎక్స్పో కిసాన్ మేళా..



ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం
వ్యవసాయ శాఖ, ఆత్మ అనంతపురం మరియు వ్యవసాయ పరిశోధన స్థానం రేకులకుంట ఆధ్వర్యంలో మంగళవారం ఏ.ఆర్.ఎస్ రేకులకుంటలో అగ్రి ఎక్స్పో కిసాన్ మేళా కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ దలవాయి రమాదేవి, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ బల్ల పల్లవి,




ఇతర ప్రజాప్రతినిధులు మరియు వ్యవసాయ అనుబంధ శాఖల జిల్లా అధికారులు, అనంతపురం జిల్లా వ్యవసాయ శాఖ సిబ్బంది, ఏఆర్ఎస్ రేకులకుంట, కె.వి.కె రెడ్డి పల్లి కె.వి.కె కళ్యాణదుర్గం శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు. పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం మదనపల్లిలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచన మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్టోబర్ 2 తేదీన మదనపల్లిలో పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్షిప్ తో లక్ష కోట్ల రూపాయల కార్పస్ ఫండ్ తో రాయలసీమ ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ హబ్ శంకుస్థాపన కార్యక్రమాన్ని చేస్తున్నామని తెలియజేశారు. కరువు, వెనుకబడిన అనంతపురం జిల్లాను అభివృద్ధి బాటలో పయనించడానికి కేంద్ర ప్రభుత్వం నుండి ప్రధానమంత్రి ధనధాన్య కృషి యోజన కింద నిధులు మంజూరు చేసి జిల్లా అభివృద్ధికి తోడ్పాటు చేస్తామని తెలిపారు. అధిక సంఖ్యలో శీతల గిడ్డంగులు ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు అదేవిధంగా జిల్లాలోని పండ్ల తోటల్లో ఉత్పత్తి నాణ్యతను పెంచి రాయలసీమను గ్లోబల్ హబ్ గా తయారు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని తెలియజేయడం జరిగినది. అగ్రి ఎస్పో కిసాన్ మేళలో భాగంగా వ్యవసాయ అనుబంధ శాఖలు, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రదర్శనశాలలు, యంత్ర పరికారాలు, వివిధ వ్యవసాయ ఉత్పత్తుల కంపెనీల ప్రదర్శనశాలలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సాలు రెడ్డి, ఏపిఎంఐపీ పిడి రఘునాథరెడ్డి, ఆత్మ పిడి విద్యావతి, జిల్లా పశు సంవర్ధక శాఖ జెడి ప్రేమ్చంద్, సిటీడఐఓ లక్ష్మనాయక్, ఆయా శాఖల అధికారులు, వెంకటేశ్వర్ రెడ్డి, శాస్త్రవేత్తలు, రైతులు, పాల్గొన్నారు.

# ప్రభుత్వాసుపత్రిలో మహిళా మృతిపై విచారణ

### -బాధిత కుటుంబ సభ్యులు, వైద్యురాలు, సిబ్బందిని విచారించిన డాక్టర్ల బృందం ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో పాము కాటుకు చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటనపై డాక్టర్ల బృందం విచారణ చేపట్టింది. పరిగి మండలం కాలువపల్లికి చెందిన రామాంజినమ్మ (45) ఈ నెల 25న పాము కాటుకు గురయ్యారు. ఆమెను హిందూపురం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. డాక్టర్లు వెంకటరమణనాయక్, శివప్రసాద్ నాయక్ లను విచారణ అధికారులుగా నియమించారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయా వైద్యులు జిల్లా ప్రభుత్వాసుపత్రిలో విచారణ నిర్వహించారు. తొలుత మృతురాలి కుటుంబ సభ్యులను విచారించారు. అనంతరం వైద్యురాలు, నర్సింగ్ సిబ్బంది, ఇతర ఆసుపత్రిసిబ్బందిని కూడా ఆరోజు జరిగిన పరిణామాలపై ప్రశ్నించి వాంగ్మూలాలను నమోదు చేసుకున్నారు. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే రామాంజినమ్మ మృతి చెందిందని కుటుంబంతో సేకరించిన వివరాల ఆధారంగా నివేదికను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపి తమకు న్యాయం చేయాలని బాధితకుటుంబ సభ్యులు విచారణ అధికారులనుకోరారు. విచారణలో సేకరించిన వివరాల ఆధారంగా నివేదికను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు సమర్పిస్తామని విచారణ అధికారులు తెలిపారు.

# 46 పాఠశాలల్లో 42 చోట్ల ఎస్ ఎమ్ సి పూర్తి

### నాలుగు పాఠశాలల్లో పెండింగ్..
### పోలీసుల పర్యవేక్షణలో ప్రశాంతంగా ప్రక్రియ

ప్రజా భూమి నార్పల
మండల వ్యాప్తంగా పాఠశాల నిర్వహణ కమిటీల (ఎసీజ) ప్రక్రియ కొనసాగింది. మండలంలోని మొత్తం 46 పాఠశాలలకు గాను 42 పాఠశాలల్లో ఎసీజ ప్రక్రియ పూర్తయినట్లు వీజూఎ కృష్ణయ్య తెలిపారు. మరో నాలుగు పాఠశాలల్లో ప్రక్రియ పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడించారు.పెండింగ్‌లో ఉన్న పాఠశాలల్లో కర్ణపుడికిలో ఒకటి, బండ్లపల్లిలో రెండు, దుర్గంలో ఒకటి ఉన్నట్లు వీజూఎ కృష్ణయ్య వివరించారు. ఆయా పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న ప్రక్రియను త్వరలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు.ఎసీజ ప్రక్రియ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎ× సాగర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. పాఠశాలల వద్ద పరిస్థితులను పోలీసులు పర్యవేక్షిస్తూ ప్రశాంత వాతావరణంలో ప్రక్రియ జరిగేలా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. ఎసీజ ప్రక్రియ పూర్తయిన పాఠశాలల్లో కమిటీల ద్వారా విద్యార్థుల విద్యా అభివృద్ధి, పాఠశాల సమస్యల పరిష్కారానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయంతో ముందుకు సాగనున్నట్లు అధికారులు తెలిపారు.

బద్వేల్ నియోజకవర్గం ఇన్చార్జి, డిసిసి బ్యాంక్ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో

# సీఎం సభకు బద్వేల్ నియోజకవర్గం నుండి భారీగా తరలిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

ప్రజాభూమి పోరుమామిళ్ల :
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొనే కార్యక్రమానికి బద్వేల్ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఉదయగిరి తాలూకా వరికుంట్లపాడు ప్రాంతంలో నిర్వహించిన సీఎం కార్యక్రమానికి బద్వేల్ నియోజకవర్గం పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి. కోడూరు, అట్లూరు, గోపవరం నుంచి దాదాపు 5,000 మందికి పైగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వాహనాల్లో బయలుదేరారు. బద్వేల్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, డీసీసీ బ్యాంక్ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఈ భారీ తరలింపు జరిగింది. నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో కార్యక్రమానికి చేరుకున్నారు. సీఎం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే లక్ష్యంతో పార్టీ శ్రేణులు ముందస్తుగా సమన్వయం చేసుకుని పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.

**కార్యకర్తలకు ప్రత్యేక ఏర్పాట్లు**

సీఎం కార్యక్రమానికి తరలివెళ్లిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే కార్యకర్తల కోసం భోజనం, మంచినీరు, రవాణా సౌకర్యాలు ఏర్పాటు చేశారు. భారీ సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ కార్యక్రమం సజావుగా జరిగేలా పార్టీ నాయకులు సమన్వయం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వాహనాల్లో బయలుదేరిన టీడీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో ఒకే చోటకు చేరుకోవడంతో కార్యక్రమ ప్రాంగణం వద్ద పార్టీ కార్యకర్తల సందడి నెలకొంది. పార్టీ జెండాలతో, నినాదాలతో కార్యకర్తలు ఉత్సాహంగా కార్యక్రమానికి తరలివెళ్లారు.






**నాయకుల సమన్వయంతో భారీ తరలింపు**

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి, పోరుమామిళ్ల మాజీ సర్పంచ్ యనమల సుధాకర్ పాటు పలువురు టీడీపీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ సీఎం కార్యక్రమానికి భారీ సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యేలా నాయకులు చర్యలు చేపట్టారు. సీఎం కార్యక్రమానికి బద్వేల్ నియోజకవర్గం నుంచి వేలాది మంది కార్యకర్తలు తరలివెళ్లడం ద్వారా పార్టీ శ్రేణుల్లో నెలకొన్న ఉత్సాహం కనిపించింది. కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ భోజనం, మంచినీరు, రవాణా తదితర సౌకర్యాలు కల్పించడంతో కార్యకర్తలు సంతృప్తి వ్యక్తం చేశారు. సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ భారీ తరలింపులో నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సీఎం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తమ వంతు సహకారం అందించారు.

# టెకూరుపేటలో ఘనంగా అంగన్‌వాడీ ఉత్సవాలు

ప్రజాభూమి పోరుమామిళ్ల :
పోరుమామిళ్ల మండలం టెకూరుపేటలో అంగన్‌వాడీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బద్వేల్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ నారిశెట్టి సుప్రజ హాజరయ్యారు. కార్యక్రమం పోరుమామిళ్ల అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మాధవి అధ్యక్షతన జరిగింది. సిడిపిఓ లక్ష్మి కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించారు. ఈ సందర్భంగా టెకూరుపేట సెక్టార్ పరిధిలోని సుమారు 35 మంది అంగన్‌వాడీ టీచర్లను పోరుమామిళ్ల బీజేపీ అధ్యక్షుడు నాగేంద్ర ఘనంగా సన్మానించారు. అలాగే టెకూరుపేట అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారుల అవసరాల కోసం రూ.5,000 ఆర్థిక సహాయాన్ని నాగేంద్ర అందించారు. అదేవిధంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు హరిప్రియ, మాధవి, రత్నకుమారి, చంద్రకళతో పాటు సిడిపిఓ లక్ష్మిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏఎంసి చైర్‌పర్సన్ నారిశెట్టి సుప్రజ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఎంతో నిస్వార్థంగా సేవలు అందిస్తున్నారని కొనియాడారు. సమాజంలో ప్రతి ఒక్కరూ వారిని గౌరవించాలని అన్నారు. చిన్నారుల విద్యాభ్యాసానికి తొలి అడుగు అంగన్‌వాడీ కేంద్రాల నుంచే ప్రారంభమవుతుందని, పిల్లల పోషణ, ప్రాథమిక విద్య, సమగ్ర అభివృద్ధిలో అంగన్‌వాడీ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఇలాంటి సేవలను అందిస్తున్న అంగన్‌వాడీ వ్యవస్థను ప్రతి ఒక్కరూ గౌరవించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నరోజు రమణ చారి, అసెంబ్లీ కో-కన్వీనర్ పల్లంసెట్టి పండారి, జనరల్ సెక్రటరీ దుల్లా శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షులు చెన్నయ్య, బ్రహ్మయ్య, యువ నాయకుడు భరత్, ఓ బి సి అధ్యక్షుడు శ్రీనివాసులు, మోహన్ రెడ్డి, రాజారెడ్డి, కిసాన్ మోర్చా నాయకుడు తమ్మిశెట్టి రమణ, సురేష్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంగన్‌వాడీ సిబ్బందిని సన్మానించడం, చిన్నారుల అవసరాలకు ఆర్థిక సహాయం అందించడం ద్వారా టెకూరుపేటలో నిర్వహించిన అంగన్‌వాడీ ఉత్సవాలు సేవా స్ఫూర్తిని చాటాయి.





## భూమి సమస్యపై డిప్యూటీ తాసిల్దార్ కు వినతి పత్రం

ప్రజాభూమి పోరుమామిళ్ల :
పోరుమామిళ్ల మండలం రంగసముద్రం పంచాయతీ, గిరి నగర్ కాలనీకి చెందిన చాట కొండు గురయ్య తండ్రి చాటకొండు గురయ్య రంగసముద్రం పంచాయతీకి చెందిన సర్వేనెంబర్ 13 0 6/2 గల 4.96 సెంట్లు భూమికి సంబంధించి 1989 వ సంవత్సరంలో తమ తండ్రి చాట కొండు గురయ్య కు ప్రభుత్వం వారు మంజూరు చేయడం జరిగింది. అప్పటి నుండి ప్రభుత్వం తమకు మంజూరు చేసిన భూమిలో వర్షాధార పంటలను వేసుకుంటూ ఇప్పటివరకు సాగు చేసుకుంటూ వ్యవసాయమే జీవనోపాధిగా జీవనం సాగిస్తున్నామన్నారు. పోరుమామిళ్ల,రెడ్డి నగర్ కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు కల్లూరి రామకృష్ణారెడ్డి 2022లో తమ భూమిని ఆక్రమించుకోవాలని తనపై లేనిపోని ఆరోపణలు సృష్టించి ఇబ్బందులకు గురి చేశారని ఆయన ఆరోపించారు. తాను కోర్టును ఆశ్రయించి ఇంజక్షన్,ఎంజాయ్మెంట్ ఆర్డర్ ను తీసుకొని అన్ని ఉత్తర్వులను పొందినను రాజకీయ, ధన,కుల బలంతో రామకృష్ణారెడ్డి తప్పుడు ధ్రువపత్రాలను సృష్టించి తాలూకా స్థాయి అధికారుల నుండి ఉత్తర్వులు పొందినారని తరువాత తాను జెసి కోర్టుకు వెళ్లి విషయాన్ని తెలియపరిచారన్నారు. జెసి విచారణ చేసి కోర్టు ఇచ్చిన ఉత్తర్వులకు లోబడి ఉంటామని ఉత్తర్వులు ఇచ్చారన్నారు. పోరుమామిళ్ల మండల డిప్యూటీ తాసిల్దారు తాలుకా స్థాయి అధికారులకు తప్పుడు సమాచారాన్ని ఇచ్చి తనకు అన్యాయం చేస్తుందని ఆయన వాపోయారు. తన సమస్యను కలెక్టర్ తనకు న్యాయం చేయాలని ఆయన కోరారు. తదనంతరం డిప్యూటీ తాసిల్దార్ కు వినతి పత్రాన్ని అందజేశారు.



## అభయాంజనేయ స్వామికి విశేష పూజలు

ప్రజాభూమి,పులివెందుల
పులివెందుల పట్టణంలోని ఆర్నపల్లె రోడ్డు సమీపంలో ఉన్న కోతి సమాధి వద్ద గల అభయాంజనేయ స్వామి దేవస్థానము లోమంగళవారం ప్రత్యేక పూజలు ప్రధాన అర్చకుల సిద్దు స్వామి నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి అభిషేకాలు ఆకు పూజలు అనంతరం ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయ స్వామి భక్తులకు దర్శనం ఇవ్వగా మహా మంగళహారతి తో ప్రజలు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాలలో భాగంగానే ఆలయ ప్రాంగణంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఆంజనేయ స్వామికి శుభకరమైన మంగళవారంనిర్వహించే పూజాధికాలతో పాటు తీర్థ ప్రసాద కార్యక్రమాలకు అత్యధిక ప్రాముఖ్యత కలదని ఆలయ అర్చకులు తెలియజేశారు. ఈ రకమైనటువంటి కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందించిన ఉభయదారులందరికీ అభయాంజ నేయ స్వామి ఆశీస్సులు మెండుగా ఉండాలని వారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తజనం తదితరులు పాల్గొన్నారు.



## పల్లె పండుగ 3.0తో గ్రామీణాభివృద్ధికి మహా ముందడుగు

**- కూటమి ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి పెద్దపీట**
**- బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్**

ప్రజాభూమి, వేంపల్లె
పల్లె పండుగ 3.0తో గ్రామీణాభివృద్ధికి మహా ముందడుగు పడుతోందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ తెలిపారు. కూటమి ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేస్తూ ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ఈ కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు, రహదారులు, పారిశుధ్యం, రైతుల జీవనోపాధి, ప్రజా సౌకర్యాలను మెరుగుపరచడమే లక్ష్యమన్నారు. పల్లె పండుగ 3.0 కింద రాష్ట్రవ్యాప్తంగా రూ.11,085 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. సీసీ, బీటీ రోడ్ల నిర్మాణంతో పాటు పాడి రైతులకు మినీ గోకులాలు, ఉద్యాన పంటల అభివృద్ధి, మ్యాజిక్ డ్రెయిన్లు, పంచాయతీ భవనాలు, బస్ షెల్టర్లు వంటి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని గాలి హరిప్రసాద్ అన్నారు



## ప్రపంచ ఆహార భద్రతపై ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు

## ఆహార కల్తీ, కాలుష్యంపై అవగాహన అవసరం

ప్రజాభూమి, పులివెందుల
పట్టణంలోని శ్రీరామ హాల్ రోడ్డు సమీపంలో ఉన్న ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జంతు, రసాయన శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో ప్రపంచ ఆహార భద్రతపై అంతర్జాతీయ సదస్సును మంగళవారం నిర్వహించా రు.ప్రిన్సిపల్ డాక్టర్ బి.శ్రీనివాసులు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఆహార భద్రతకు ఎదురవుతున్న సవాళ్లు, సురక్షిత మైన పోషకాహారం అందరికీ అందుబాటులో ఉండేలా తీసుకోవాల్సిన చర్యలపై ఈ సదస్సు ఉపయోగపడుతుందన్నారు.కన్వీనర్ డాక్టర్ యు.శ్రీనిత మాట్లాడుతూ ఆహారంలో కల్తీ, సూక్ష్మజీవుల ప్రమాదాలు, రసాయన కాలుష్యం, పురుగుమందుల అవశేషాలు, ఆహార వ్యర్థాలు, వాతావరణ మార్పుల ప్రభావం, సరఫరా గొలుసులో భద్రత వంటి అంశాలపై చర్చించామన్నారు. సురక్షిత ఆహారం ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు అని పేర్కొన్నారు.ముఖ్య అతిథులుగా పాల్గొన్న డాక్టర్ జి.దీపిక (వెటర్నరీ మైక్రోబయాలజీ, శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ) మాట్లాడుతూ ప్రపంచంలో 60 శాతం అంటువ్యాధులు జంతువుల నుంచే వస్తున్నాయని, జూనోటిక్ వ్యాధులపై అప్రమత్తత అవసరమ న్నారు. డాక్టర్ మన్నూర్ ఇస్మాయిల్ షేక్ (మలేషియా యూనివర్సిటీ) స్టింగ్ లెస్ తేనె ప్రత్యేకతలు, పోషక విలువలు, పరాగ సంపర్కంలో దాని ప్రాధాన్యతను వివరించారు. డాక్టర్ పి.జయమ్మ (ఫుడ్ టెక్నాలజీ కళాశాల, పులివెందుల) పాలు, మాంస ఉత్పత్తుల్లో కల్తీని గుర్తించడం, పరిశుభ్రమైన ప్రాసెసింగ్ పై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ వినోదమ్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీ శంకరయ్య, అధ్యాపకులు శివరామిరెడ్డి, ఓబుల్ రెడ్డి, సుగుణ, విజయలక్ష్మి, ఇతర కళాశాలల లెక్చరర్లు, పరిశోధకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



## స్వర్ణ వార్డు కార్యాలయాలు, పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన కమిషనర్

**సేవల్లో నిర్లక్ష్యం వద్దు - సిబ్బందికి కమిషనర్ తనూజ ఆదేశం**

ప్రజాభూమి, పులివెందుల
పట్టణంలోని పలు స్వర్ణ వార్డు కార్యాలయాలను మంగళవారం మున్సిపల్ కమిషనర్ తనూజ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు.పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. వార్డు కార్యాలయాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. అనంతరం పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడి ఏర్పాట్లను సమీక్షించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని, ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు.



## జిల్లా స్థాయి ఆటల్లో మెరిసిన బాలికలు

**రగ్బీలో రాష్ట్రస్థాయికి ఎంపికైన జెడ్పీ బాలికల పాఠశాల విద్యార్థులు**

ప్రజాభూమి, పులివెందుల
పులివెందుల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో సత్తా చాటారు.కడపలోని వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి రగ్బీ ఎంపికల్లో రాణించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో టి. గంగా తేజస్విని, అండర్-17 విభాగంలో సి. అక్షయ ఎంపికయ్యారు.ఎంపిక కావడం పట్ల ప్రధానోపాధ్యాయులు ఏ.సి. గంగిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు ఫ్రాన్సిస్ రవికుమార్, రమేష్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు. ఎంపికైన వీరు అక్టోబర్ 12, 13, 14 తేదీల్లో కాకినాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున పాల్గొననున్నట్లు తెలిపారు.



## బొగ్గుడుపల్లి గంగమ్మ ఆలయంలో చోరీ.. అమ్మవారి వెండి కిరీటం మాయం

**క్లూస్ టీం తనిఖీలు.. దర్యాప్తు చేపట్టిన పోలీసులు**

ప్రజాభూమి, పులివెందుల
మున్సిపాలిటీ పరిధిలోని బొగ్గుడుపల్లి గ్రామంలో ఉన్న గంగమ్మ ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది.ఆలయ తలుపుల తాళాలను తొలగించి లోపలికి ప్రవేశించిన దుండగులు గంగమ్మ తల్లి విగ్రహానికి ఉన్న సుమారు 250 గ్రాముల వెండి కిరీటాన్ని అపహరిం చారని గ్రామస్తులు తెలిపారు.మంగళవారం ఉదయం చోరీని గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కడప నుంచి వచ్చిన క్లూస్ టీం ఆలయంలో ఆధారాలు సేకరించింది.గత కొన్ని రోజుల క్రితం గ్రామంలో దొంగతనం జరగడంతో పాటు ఇప్పుడు ఆలయంలోనూ చోరీ జరగడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



## అంగన్వాడీ కేంద్రాల్లో ఉత్సాహంగా అంగన్వాడీ ఉత్సవాలు

ప్రజాభూమి, సిద్ధవటం: కడప అర్బన్ సీడీపీఓ సుగుణ ఆధ్వర్యంలో ఎస్‌కేఆర్ నగర్ మెయిన్, వెంకటేశ్వరపురం అంగన్వాడీ కేంద్రాల్లో మంగళవారం అంగన్వాడీ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ సుగుణ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలు కేవలం పోషకాహారం అందించే కేంద్రాలు మాత్రమే కాకుండా చిన్నారుల ఆరోగ్యం, విద్య, పోషణ, మానసిక వికాసానికి బలమైన పునాదులుగా నిలుస్తున్నాయని తెలిపారు. సూపర్‌వైజర్ శ్రీవిద్య మాట్లాడుతూ ఉత్సవాల ద్వారా పోషణ, మాతృ సంరక్షణ, టీకాల ప్రాధాన్యతపై లబ్ధిదారులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. సూపర్‌వైజర్ దీప మాట్లాడుతూ నవచేతన స్క్రీనింగ్ ద్వారా చిన్నారుల్లో అభివృద్ధి లోపాలను బాల్య దశలోనే గుర్తించి, తగిన జాగ్రత్తలు తీసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు వెంకటసుబ్బమ్మ, శ్రీదేవి, హెల్పర్లు సులోచన, సాయి, తల్లులు పాల్గొన్నారు.



## వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నప్రసాదం

**-సుగవాసి సాయి మిథిల్ జన్మదినాన్ని సేవా కార్యక్రమంతో నిర్వహించిన టీడీపీ నాయకులు**

ప్రజాభూమి, సిద్ధవటం: రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్‌బాబు పెద్ద కుమారుడు సుగవాసి సాయి మిథిల్ జన్మదినాన్ని పురస్కరించుకుని కొత్త మాధవరం పరిధిలోని శ్రీ కాశీనాయన ఆశ్రమంలో వృద్ధులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సిద్ధవటం మండలం భాకరాపేటకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, రాజంపేట పార్లమెంట్ టీడీపీ మాజీ ఉపాధ్యక్షులు పుత్తా రామచంద్రయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆశ్రమంలోని వృద్ధులకు అన్నప్రసాదంతో పాటు పండ్లు, బిస్కెట్లు, జ్యూస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధుల ఆశీర్వాదాలు తీసుకున్నారు. జన్మదిన వేడుకలను కేవలం ఆనందోత్సవాలకే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. అన్నదానం, సేవా కార్యక్రమాల ద్వారా మానవత్వాన్ని చాటుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మన ఊరికోసం సేవా సంస్థ చైర్మన్ అవ్వారు రవిశంకర్, ఆశ్రమ నిర్వాహకులు మేరువ బాలాజీ, మాజీ వార్డు సభ్యులు సామల చెంగయ్య, సిద్ధవటం మాజీ టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి పుత్తా శివానంద, నియోజకవర్గ ఐటీడీపీ మాజీ ఉపాధ్యక్షులు నాగమునయ్య తదితరులు పాల్గొన్నారు.



## మండలంలో ప్రశాంతంగా విద్యా కమిటీ చైర్మన్ ఎన్నికలు



**భాకరాపేటలో చైర్‌పర్సన్‌గా వంకర సౌజన్య, వైస్‌చైర్మన్‌గా సొంటా రామయ్య ఎన్నిక**

ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసుల పర్యవేక్షణలో పాఠశాల విద్యా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఇందులో భాగంగా భాకరాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి ఆవుల అరుణ ఆదేశాల మేరకు ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీకేసమ్మ అధ్యక్షతన ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో వంకర సౌజన్య చైర్‌పర్సన్‌గా, సొంటా రామయ్య వైస్‌చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజంపేట పార్లమెంట్ టీడీపీ మాజీ ఉపాధ్యక్షులు పుత్తా రామచంద్రయ్య, టీడీపీ అధికార ప్రతినిధి కడితం రామమోహన్ నాయుడు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పీడీ రామచంద్ర, తల్లిదండ్రులు, విద్యార్థులు, యువ న్యాయవాది శ్రీరామ్ బాలచంద్ర, మాజీ విద్యాకమిటీ చైర్మన్లు కాడే రెడ్డయ్య, బాలినేని రవికుమార్, టీడీపీ మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వంకర సుబ్బయ్యతో పాటు గ్రామస్థులు, స్థానికులు పాల్గొన్నారు.

## భాకరాపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల పారిశ్రామిక సందర్శన

**- ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ ప్రయోగశాలలపై అవగాహన**

ప్రజాభూమి, సిద్ధవటం: విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు పాఠ్యాంశాలను వాస్తవ అనుభవాలతో అనుసంధానం చేయాలనే ఉద్దేశంతో భాకరాపేట 11వ బెటాలియన్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9, 10 తరగతుల విద్యార్థులకు మంగళవారం పారిశ్రామిక సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులను కడపలోని శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌కు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా విద్యార్థులు కళాశాలలోని ఆటోమొబైల్ విభాగం, ఎలక్ట్రానిక్స్ ప్రయోగశాలలు, కంప్యూటర్ ప్రయోగశాలలను సందర్శించారు. ఆయా విభాగాల్లో అందుబాటులో ఉన్న వివిధ పరికరాలు, వాటి పనితీరు, సాంకేతిక వినియోగం, ఆధునిక పరిశ్రమల్లో వాటి ప్రాధాన్యత గురించి కళాశాల సిబ్బంది విద్యార్థులకు వివరించారు. ఆటోమొబైల్ సాంకేతికతకు సంబంధించిన అంశాలను విద్యార్థులు ఎంతో ఆసక్తిగా పరిశీలించారు. ఎలక్ట్రానిక్ పరికరాల పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. కంప్యూటర్ ప్రయోగశాలలో ఆధునిక కంప్యూటర్ సాంకేతికత, దాని వినియోగాలపై అవగాహన పొందారు. ఇలాంటి పారిశ్రామిక సందర్శనల ద్వారా పుస్తకాల్లో నేర్చుకున్న అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశం విద్యార్థులకు లభిస్తుందని ఉపాధ్యాయులు తెలిపారు. తద్వారా శాస్త్రీయ ఆలోచనా విధానం, పరిశీలనా నైపుణ్యాలు, సాంకేతిక మరియు వృత్తి విద్యపై ఆసక్తి పెంపొందుతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో సాంకేతిక, వృత్తి విద్యా రంగాల్లో తమకు ఆసక్తి ఉన్న విభాగాలను ఎంచుకోవడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆటోమొబైల్ వృత్తి విద్యా ఉపాధ్యాయులు షేక్ మౌలాలి, ఉపాధ్యాయులు సమీర్ బాషా (జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు), నరసింహులు, శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ అసోసియేట్ ప్రొఫెసర్ బి. రవిశేఖర్, రికార్డు అసిస్టెంట్ శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పారిశ్రామిక సందర్శనలో పాల్గొని వివిధ సాంకేతిక అంశాలపై విలువైన అవగాహన పొందారు.



# స్మశాన భూమికీ మట్టి మాఫియా కన్ను!

- ఎండి పుత్తూరు లో 3.90 ఎకరాల స్మశాన భూమి ఏమైంది?
- శవాన్ని పూడ్చేందుకు స్థలం లేని దుస్థితి.. ఆక్రమణలపై అధికారుల మౌనం ఎందుకు?

ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.
శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండలం ఎండి పుత్తూరు మిట్టిండ్లు గ్రామంలో స్మశాన భూమి పరిస్థితి ఆందోళనకరంగా మారింది. గ్రామస్తుల సమాచారం ప్రకారం గతంలో ప్రభుత్వం స్మశానవాటిక కోసం సుమారు 3 ఎకరాల 90 సెంట్ల భూమిని కేటాయించి నప్పటికీ, ప్రస్తుతం ఆ భూమిలో అధిక భాగం ఆక్రమణలకు గురైందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్మశాన భూమిలో కొందరు అనధికారంగా మోటార్లు ఏర్పాటు చేసుకుని పంటలు సాగు చేస్తున్నారని, మరికొంత ప్రాంతంలో మట్టి తరలింపు జరుగుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్లాట్ల కోసం మట్టి తరలిస్తున్న దృశ్యాలు సైతం వెలుగులోకి రావడంతో స్మశాన భూమి భద్రతపై తీవ్ర ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**స్మశాన భూమి ఎక్కడ?**

గతంలో 3.90 ఎకరాలు ఉన్నట్లు గ్రామస్తులు చెబుతున్న స్మశాన భూమిలో ప్రస్తుతం అత్యల్ప విస్తీర్ణం మాత్రమే గ్రామ ప్రజలకు అందుబాటులో ఉందని వారు వాపోతున్నారు. మిగిలిన భూమి ఎవరి ఆధీనంలో ఉంది? ఏ ప్రాతిపదికన అక్కడ సాగు జరుగుతోంది? మట్టి తవ్వకాలు, తరలింపులకు అనుమతులు ఉన్నాయా? అన్నది అధికారుల సమగ్ర విచారణలో తేలాల్సి ఉంది. ఒకరు మృతి చెందితే అంత్యక్రియలకు స్థలం కోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పూడ్చిన ప్రదేశాల వద్దనే మళ్లీ అంత్యక్రియలు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొందని వారు చెబుతున్నారు.



**ఎంఆర్ఓ రాజశేఖర్ స్పందించి సర్వే చేయించాలి**

ఈ సమస్యపై ఏర్పేడు మండల రెవెన్యూ అధికారి (ఎంఆర్ఓ) పి. రాజశేఖర్ ప్రత్యేకంగా దృష్టి సారించి స్మశాన భూమిపై సమగ్ర విచారణ జరిపి, రెవెన్యూ రికార్డులను పరిశీలించి, సర్వే చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. 3 ఎకరాల 90 సెంట్లుగా చెబుతున్న స్మశాన భూమికి హద్దులు నిర్ధారించి, ప్రస్తుతం ఎంత భూమి అందుబాటులో ఉంది? మిగిలిన భూమి ఎవరి ఆధీనంలో ఉంది? ఆక్రమణలు జరిగాయా? అనే విషయాలను అధికారులు తేల్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు. సర్వే అనంతరం ఆక్రమణలు ఉన్నట్లు నిర్ధారణ అయితే వాటిని తొలగించి మొత్తం స్మశాన భూమిని గ్రామ ప్రజల ఆధీనంలోకి తీసుకువచ్చి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**అధికారుల విచారణ ఎప్పుడు?**

ప్రభుత్వ రికార్డుల్లో స్మశాన భూమి విస్తీర్ణం ఎంత? ప్రస్తుతం భౌతికంగా ఎంత భూమి ఉంది? మిగిలిన భూమి ఎవరి ఆధీనంలో ఉంది? అన్న అంశాలపై రెవెన్యూ అధికారులు సమగ్ర సర్వే నిర్వహించి వాస్తవాలను ప్రజల ముందుంచాల్సిన అవసరం ఉంది. జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, ఎం ఆర్ ఓ రాజశేఖర్ ఈ వ్యవహారంపై వెంటనే స్పందించి స్మశాన భూమిని కాపాడేందుకు చర్యలు తీసుకుంటారా? లేక ఆక్రమణలు, మట్టి తరలింపులు కొనసాగుతూనే ఉంటాయా? అన్నది గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ప్రజలకు అవసరమైన స్మశాన స్థలాన్నే కాపాడుకోలేని పరిస్థితి ఉంటే గ్రామంలోని చిన్నచిన్న సమస్యలకు పరిష్కారం ఎప్పుడు లభిస్తుందన్న ప్రశ్నలు గ్రామస్తుల్లో వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల సమయంలో ప్రజలను ఓట్లు అడిగే ప్రజాప్రతినిధులు, ప్రస్తుతం తమ గ్రామంలో ఎదురవుతున్న ఇలాంటి ప్రాథమిక సమస్యలపై స్పందించాలని వారు కోరుతున్నారు. ఎండి పుత్తూరు మిట్టిండ్లు స్మశాన భూమిపై సమగ్ర సర్వే, రికార్డుల పరిశీలన, ఆక్రమణల నిర్ధారణ చేపట్టి, స్మశాన భూమిని పూర్తిగా గ్రామ ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చి సమస్యకు పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## రేణిగుంట విమానాశ్రయంలో ఆం.ప్ర రాష్ట్ర విద్యా శాఖ మంత్రికి వీడ్కోలు



ప్రజాభూమి ప్రతినిధి రేణిగుంట.
రెండు రోజుల తిరుపతి జిల్లా పర్యటన అనంతరం మంగళవారం మద్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం నుండి తిరుగు ప్రయాణం అయిన ఆం.ప్ర. రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ కు సాదర వీడ్కోలు లభించింది. విమానాశ్రయంలో జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు, శ్రీ కాళహస్తి, నగరి, పూతలపట్టు, చంద్రగిరి ఎం ఎల్ ఏ లు బొజ్జల సుధీర్ రెడ్డి, గాలి భాను ప్రకాష్, కె. మురళి మోహన్, పులివర్తి నాని, తుడా ఛైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, ఆర్ డి ఓ లు, 5తహశీల్దార్ లు, తదితరులు రాష్ట్ర విద్యా శాఖ మంత్రికి ఘనంగా వీడ్కోలు పలికారు.

## రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న. ఆం.ప్ర రాష్ట్ర ఉప ముఖ్యమంత్రికి ఘన స్వాగతం.



ప్రజాభూమి ప్రతినిధి రేణిగుంట.
నెల్లూరు జిల్లా పర్యటన నిమిత్తం మంగళవారం మద్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న . ఆం.ప్ర. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కి పార్టీ నాయకులుఘన స్వాగతం పలికారు. విమానాశ్రయం చేరుకున్న ఉప ముఖ్యమంత్రికి జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు, శ్రీకాళహస్తి ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ పుట్టాసాయి, శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, ఆర్డిఓ లు, తహశీల్దార్లు, ప్రజాప్రతినిధులు, తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి నెల్లూరు జిల్లా, వరికుంటపాడు మండలం, రామాపురం గ్రామంలో నిర్వహించే పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో పాల్గొనేందుకు హెలికాప్టర్ లో బయల్దేరి వెళ్లారు.

## నాగంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా పోషణ మాసం వేడుకలు...



ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.
మండల పరిధిలోని నాగంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ మాసం కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శిశు అభివృద్ధి ప్రాజెక్ట్రాధికారి కృష్ణవేణి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు మరియు చిన్నారులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. పోషకాహార లోపం నివారణకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే పిల్లల వయస్సుకు తగిన ఎత్తు, బరువుల పరిశీలనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాగంపల్లి అంగన్‌వాడీ కార్యకర్త కె.లక్ష్మి, నాచేనేరి అంగన్‌వాడీ కార్యకర్త పి.ధనమ్మ, స్థానిక తల్లులు, అంగన్‌వాడీ సహాయకులు మరియు ఇతర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాంతరం చిన్నారులు, తల్లులకు పౌష్టికాహార పదార్థాలను అందజేశారు.

## ఏకగ్రీవంగా ఎన్నికైనటువంటి విద్యార్థి తల్లిదండ్రులకు సన్మానం



ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.
ఈరోజు ఉదయం గంటలకు పాపా నాయుడు పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు అభివృద్ధి కమిటీ సభ్యుల ఎన్నికలు మన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాలు మేరకు మన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సూచన తో శాంతియుతంగా నిర్వహించిన హెడ్మాస్టర్ మారయ్య మరియు ఉపాధ్యాయ బృందం. చైర్మన్ గా తిరుత్తణి రోశయ్య , వైస్ చైర్మన్ గా షామిలి మరియు ఎక్స్ ఆఫిసియో మెంబర్ గా అంబేద్కర్ స్టార్ కృష్ణయ్య ఏకగ్రీవం గా ఎన్నికైనారు. వీరిని శాలువాతో సత్కరించిన కృష్ణప్ప మొదలి రిటైర్డ్ హెడ్మాస్టర్ కృష్ణయ్య,అర్జున్ బాబు, రవి కుమార్, వరదయ్య, వంశీ,దొరకృష్ణ, తంబా మురుగప్ప, డిల్లీ తదితరులు.

## రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి:



ప్రజాభూమి ప్రతినిధి రేణిగుంట.
రేణిగుంట -- తిరుచనూరు ఆర్ఎస్ఎస్‌ల మధ్య అప్ లైన్ రైలు పట్టాలపై ప్రమాదవశాత్తు గుర్తుతెలియని రైలు నుంచి జారిపడి సుమారు 37 సంవత్సరాల వయసు గల గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు రేణిగుంట రైల్వే(జి ఆర్ పి) పోలీసులు తెలిపారు. ఈ సంఘటన మంగళవారం ఉదయం 8:20 గంటలకు ప్రమాదం చోటు చేసుకుంది. మృతుని వివరాలు: వయస్సు: సుమారు 37 సంవత్సరాలు. దుస్తులు: నారింజ (ఆరెంజ్) రంగు షార్ట్, తెలుపు రంగు టీ-షర్ట్ గుర్తులు: మృతుని కుడి చేతిపై హిందీ భాషలో "జై శ్రీరామ్" అని పచ్చబొట్టు (టాటూ) వేసి ఉంది. మృతునికి సంబంధించిన పేరు, చిరునామా తదితర వివరాలు ఇంకా తెలియరాలేదు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పై వివరాల ఆధారంగా మృతుని ఆచూకీ తెలిసిన వారు లేదా బంధువులు వెంటనే రేణిగుంట జీఆర్పీ ఎస్ఐ మధుసూదన్ రెడ్డి 9247575621 నంబరులో సంప్రదించాలని రైల్వే పోలీసులు కోరారు.

## పాకాల మండల ప్రత్యేక అధికారిగా పశువర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వి.శ్రీధర్ బాధ్యతలు..!



ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:
తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం, పాకాల మండలం, పాకాల మండల ప్రత్యేక అధికారిగా పశువర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వి.శ్రీధర్ మంగళవారం పాకాల ఎంపీడీఓ కార్యాలయంలోని ప్రత్యేక అధికారి ఛాంబర్ లో బాధ్యతలు చేపట్టారు.వీరికి పాకాల ఎంపీడీఓ వాసుదేవరావు,సిబ్బంది కలిసి స్వాగతం పలికి,శ్యాలువా కప్పి సన్మానించారు.సెప్టెంబర్ 22 తేదీకి మండల ప్రజా పరిషత్ పాలకవర్గం పదవి కాలం పూర్తి కావడంతో పాకాల మండలంలో పశువర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గా పనిచేసే వి.శ్రీధర్ ను మండల ప్రత్యేక అధికారిగా నియమించారు.మండలంలోని ప్రజా సమస్యల పై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరిస్తామని,అలాగే మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శశిరేఖ,ఏఓ శాంతి,సీనియర్ అసిస్టెంట్ రేణుక,జూనియర్ అసిస్టెంట్ ప్రమీల,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మహిళలు, చిన్నారుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట...

**అంగన్‌వాడీ సిబ్బంది సేవలు అభినందనీయం - బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి.**

ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట
తిరుపతి జిల్లా నాయుడుపేటలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్ లో భాగంగా నాయుడుపేట బీజేపీ నగరి కమిటీ ఆధ్వర్యంలో ఎల్.ఏ. సాగరం, బీడీ కాలనీ, మునిరత్నం నగర్ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ సన్నారెడ్డి దయాకర్ రెడ్డి అంగన్‌వాడీ టీచర్ లను, మరియు సహాయకులను సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులకు పౌష్టికాహారం, ప్రీ-స్కూల్ విద్య, పోషణ--ఆరోగ్య అవగాహనతో పాటు ఆరోగ్య పరీక్షలు, టీకాలు, అవసరమైనప్పుడు వైద్య సేవలకు రిఫరల్ వంటి ముఖ్యమైన సేవలను అందిస్తున్నాయని తెలిపారు. గర్భిణీలు, బాలింతలకు కూడా పోషకాహార సహాయం అందిస్తూ తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం మహిళలు, చిన్నారుల పోషణ, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ మిషన్ సాక్షం అంగన్‌వాడీ--పోషణ్ 2.0 ద్వారా సేవలను మరింత బలోపేతం చేస్తోందని తెలిపారు. అలాగే ప్రధాన్ మంత్రి మాతృ వందన యోజన (పీఎంఎంవీవై) ద్వారా అర్హులైన మహిళలకు మొదటి బిడ్డకు ?5,000, రెండో బిడ్డ ఆడపిల్ల అయితే ?6,000 వరకు నగదు ప్రయోజనం నేరుగా ఖాతాకు అందుతుందని తెలిపారు. ఈ పథకం గర్భిణీలు, బాలింతల ఆరోగ్యం, పోషణను మెరుగుపరచడంతో పాటు ప్రసూతి సమయంలో వేతన నష్టానికి కొంత పరిహారం అందించడాన్ని లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు. 25 ఏళ్ల ప్రజా సేవ స్ఫూర్తితో సమాజంలోని వివిధ వర్గాలకు సేవ చేయడం, సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు అండగా నిలవడం సేవా సంకల్ప అభియాన్ లక్ష్యమని, అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న సేవలను గుర్తించి వారిని సన్మానించడం ఈ కార్యక్రమం ఉద్దేశమని శ్రీ సన్నారెడ్డి దయాకర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట పట్టణ అధ్యక్షులు పాపిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, తిరుపతి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు శ్రీమతి ప్రజ్ఞాశ్రీ, నగర ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, యువ మోర్చా అధ్యక్షులు భాను ప్రకాష్, మాజీ కౌన్సిలర్ శ్రీమతి మౌనిక, బీజేపీ కార్యకర్తలు సుందర్‌రావు, సాయి ప్రవీణ్ మరియు జూనా ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.




## చంద్రగిరి మండలంలో తొండవాడలో మండల్ మోడల్ ప్రైమరీ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక చైర్మన్‌గా కె. హరికృష్ణ యాదవ్.. వైస్ చైర్మన్‌గా కె. సుశీల



ప్రజా భూమి ప్రతినిధి చంద్రగిరి.
చంద్రగిరి మండలం తొండవాడ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూర్యనారాయణ అధ్యక్షతన ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ కొనసాగింది.ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొని కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. తొండవాడకు చెందిన కే.హరికృష్ణ యాదవ్‌ను విద్యా కమిటీ చైర్మన్‌గా, కె. సుశీలను వైస్ చైర్మన్‌గా, మరో 10 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం నిర్వహించారు.నూతనంగా ఎన్నికైన చైర్మన్ కె. హరికృష్ణ యాదవ్, వైస్ చైర్మన్ కె. సుశీలను చంద్రగిరి జనసేన పార్టీ సీనియర్ నాయకులు తపసి మురళి రెడ్డి దుశ్శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించి పాఠశాలలో నెలకొన్న సమస్యలు, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు తదితర అంశాలపై చర్చించారు. సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిటీ నిర్ణయించింది.పాఠశాల అభివృద్ధికి నూతన కమిటీ సమష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా పలువురు విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు ఆకాంక్షించారు.

## భూ పరిపాలనపై సిఎస్, సిసిఎల్ఏ సమీక్ష

**- 22-ఏ, వెబ్‌ల్యాండ్, రీ-సర్వేపై ప్రత్యేక దృష్టి**
**- రికార్డుల డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి**

ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి
భూ పరిపాలన, రెవెన్యూ శాఖకు సంబంధించిన వివిధ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) జి. సాయి ప్రసాద్, సీసీఎల్ఏ, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. జయలక్ష్మి మంగళవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అమరావతి సచివాలయం లోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి నిర్వహించిన ఈ సమావేశంలో తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పాల్గొన్నారు. 22-ఏ, వెబ్‌ల్యాండ్, పట్టాదారు పాస్‌బుక్‌ల పంపిణీ, రీ-సర్వే, మాన్యువల్ రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్, ఐవీఆర్ఎస్ తదితర అంశాలపై సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. భూ రికార్డుల నిర్వహణ, డిజిటలైజేషన్ ప్రక్రియలను వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు రెవెన్యూ సేవలు సులభంగా అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, డీఆర్వో జి. నరసింహులు, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి ఆర్డీవోలు దేవేందర్ రెడ్డి, భాను ప్రకాష్ రెడ్డి, ల్యాండ్ అండ్ సర్వే అధికారి రాంప్రసాద్, సెక్షన్ సూపరింటెండెంట్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



## మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ ముఖ్య సమావేశం

**అభ్యర్థుల ఎంపికపై బీజేపీ అత్యవసర సమావేశం**



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి
బీజేపీ రాష్ట్ర కమిటీ సూచనలు మేరకు శ్రీకాళహస్తి మున్సిపల్ కౌన్సిలర్ల అభ్యర్థులు ఎంపికపైన రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ ఆధ్వర్యంలో బీజేపీ కార్యకర్తల అత్యవసర సమావేశాన్ని పార్టీ కార్యాలయంలో నిర్వహించడం జరిగినది. త్వరలో జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో కూటమి పార్టీలతో సీట్లు సర్దుబాటు చేసుకొని గెలుపే లక్ష్యంగా ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా బీజేపీ తీసుకోడమైనది. వివిధ వార్డులలో పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్న ఆశావహులు, అభ్యర్థుల బలాబలాలు మరియు ఏయే వార్డుల్లో పార్టీకి పట్టుంది.. అనే విషయాలపై ముఖ్య నేతలతో కోలా ఆనంద్ సమీక్షించారు. టీడీపీ, జనసేన, బీజేపీ సంయుక్తంగా క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహించి శ్రీకాళహస్తి మున్సిపాలిటీని కూటమి ఘన విజయం సాధించేలా వ్యూహాత్మకంగా ముందుకు సాగుతుందని కోలా ఆనంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, కార్యవర్గ సభ్యురాలు కండ్రిగ ఉమా, జిల్లా మాజీ అధ్యక్షులు చంద్రప్ప, జిల్లా ఉపాధ్యక్షులు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, పట్టణ అధ్యక్షులు రాఘవనాయుడుకుప్పం హరీష్ రెడ్డి ముఖ్య నేతలు కునాటి నాగరాజు, చాగాణం శైలజ, రామ్ ఉమాసింగ్, కోనేటి అయ్యప్ప, చిలకా రంగయ్య, గరిపాటి రమేష్, ఇరబోయిన లోకేష్, జీవీ అమర్నాథ్, సొట్ట సుకుమార్, కన్నా వెంకటేశ్వర్లు, మద్దు వాసుయాదవ్, పుణ్యం ఢిల్లీ కుమార్ రెడ్డి, లింగాబత్తిన గోపాల్, నాగలాపురం గోవర్ధన్, తానికొండ్ల భరత్, గదిపాకుల యతీష్, పసుపులేటి నాగశేషు, వీరాస్వామి అచ్చారి, చెందు, ఫ్లెక్సీ కృష్ణారెడ్డి, యస్వంత్, హుకీమ్ సింగ్, చోటు, కైవూరి తులసి, ధనుష్, సజ్జ హరీష్, హరి, రాజా తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల కొరకు చేపట్టిన భూ సేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయండి

**: జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్**



ప్రజా భూమి ప్రతినిధిలితిరుపతి,
రైల్వే ప్రాజెక్ట్, భూసేకరణ, జాతీయ రహదారులు పనులు సంబంధించి పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులను ప్రణాళికబద్దంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని మిని సమావేశ మందిరంలో జిల్లాలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి భూసేకరణ పనులపై జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, డి ఆర్ ఓజి. నరసింహులు లతో కలసి జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి టూరిజం ఆర్ డి రమణ ప్రసాద్, డిస్ట్రిక్ట్ టూరిజం ఆఫీసర్ జనార్ధన్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భరత్ నాయక్, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, తహశీల్దార్లు, శ్రీ సిటీ గోవర్ధన్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రేణిగుంట-గూడూరు వైజాగ్ చెన్నై కారిడార్ పైప్ లైన్ పనులు, రైల్వే ప్రాజెక్ట్ పనులు, తిరుపతి-కాట్పాడి రైల్వే లైన్ డబ్లింగ్ పనులు జాతీయ రహదారులు, ఏపిఐఐసి సూళ్ళూరుపేట, సత్యవేడు, ఫేజ్ -2 నాయుడుపేట, అపోలో టైర్ లు, దుగ్గరాజు పట్నం పోర్ట్ పనులు, కాళహస్తి గుంట టిటిడి పనులు, శ్రీకాళహస్తికి సంబంధించి జాతీయ రహదారి పనులు, వరదయ్యపాలెం రోడ్డు పనులు పై చర్చించి భూ సేకరణ వేగవంతం చేసి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. భూ సేకరణ అనంతరం భూ పరిహారాలను త్వరితగతిన పంపిణీ చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీఓలను ఆదేశించారు.

# స్విమ్స్ వార్డుబాయ్‌ల వేతనాలు పెంచాలి

## -ఈఓ ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలి -టీటీడీ జేఈవో ప్రభల గోపీనాథ్‌కు సీఐటీయూ వినతి

ప్రజా భూమి ప్రతినిధితిరుపతి

శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (స్విమ్స్) ఆసుపత్రిలో పనిచేస్తున్న వార్డుబాయ్‌లు, ఇతర కార్మికులకు వేతనా లు పెంచాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వారి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు టీటీడీ అధికారు లను కోరారు. ఈ మేరకు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి, సీఐటీ యూ జిల్లా కార్యదర్శి కె. వేణుగోపాల్, స్విమ్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రవి, నాయకులు జనార్ధన్, గోపి, వెంకటేశ్ తదితరులతో కూడిన ప్రతినిధి బృందం మంగళవారం ఉదయం టీటీడీ పరిపాలనా భవనంలో జేఈవో ప్రభల గోపీనాథ్ ను కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా స్విమ్స్ కార్మికుల సమస్యల పరిష్కారానికి టీటీడీ కార్యనిర్వహణాధికారి ముద్దాడ రవిచంద్ర గతంలో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని ప్రతినిధి బృందం కోరింది. స్విమ్స్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం గతంలో 85 రోజుల పాటు నిర్వహించిన పోరాటం, అప్పటి జేఈవో శరత్ కార్మికులు,



యూనియన్ నాయకులతో జరిపిన చర్చలు, ఆ సందర్భంగా కుదిరిన ఒప్పందాలు, రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను జేఈవో దృష్టికి తీసుకు వచ్చారు. కార్మికుల సమస్యలను మూడు నెలల్లో పరిష్కరిస్తామని గతంలో హామీ ఇచ్చారని, ఆ గడువు పూర్తవుతున్నప్పటికీ సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో కార్మికుల్లో తీవ్ర ఆందోళన నెలకొందని నాయకులు వివరించారు. ముఖ్యంగా వార్డుబాయ్ ల వేతనాల పెంపుతో పాటు పెండింగ్‌లో ఉన్న ఇతర సమస్యలను కూడా వెంటనే పరిష్కరించేందుకు టీటీడీ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి స్పందించిన టీటీడీ జేఈవో ప్రభల గోపీనాథ్, బ్రహ్మోత్సవాల కారణంగా సమస్య పరిష్కారంలో కొంత ఆలస్యం జరిగిందని తెలిపారు. స్విమ్స్ కార్మికుల సమస్యల పరిష్కారం విషయంలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్రతో పాటు ఉన్నతాధికారులు సానుకూలంగాను, పట్టుదలతో ఉన్నారని చెప్పారు. మరికొద్ది కాలంలోనే సమస్యను సంపూర్ణంగా పరిష్కరించి, కార్మికులకు సాధ్యమైనంత గరిష్ట ప్రయోజనం కలిగేలా నిర్ణయాలు తీసుకునేందుకు చర్చలు కొనసాగుతున్నాయని హామీ ఇచ్చారు. కార్మికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జేఈవో తెలిపినట్లు నాయకులు పేర్కొన్నారు.

# నిజాన్ని నిగ్గు తేల్చాలని కోరుకుంటున్న వైసీపీ నాయకులు

## పొరపాటు జరిగి ఉంటే ఉపేక్షించేది లేదు అంటున్న కూటమి నాయకులు

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి.



శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానానికి అనుబంధమైన సుబ్రహ్మణ్యస్వామి వారి కొండ ఆక్రమణ విషయంలో వైసీపీ నాయకులు చేసిన విమర్శలకు బదులిచ్చిన జనసేన నాయకులు. సుబ్రహ్మణ్యస్వామి కొండ ఆక్రమణ విషయమై గత 4 రోజులుగా జరుగుతున్న పరిణామాలపై ఈ రోజు శ్రీకాళహస్తి జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన నాయకులు వివరణ ఇవ్వడం జరిగింది. సంబంధం లేకపోయినా ఈ విషయంలోకి డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని లాగి వెటకారంగా మాట్లాడిన వైసీపీ నాయకుల వైఖరిపై జనసేన నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. సుబ్రహ్మణ్యస్వామి కొండ మాత్రమే కాదు శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానానికి సంబంధించిన భూమి ఒక్క అంగుళం కూడా ఆక్రమణకు గురవ్వకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలియజేశారు. ఇక మీదట అయినా వైసీపీ నాయకులు ప్రతిదానికీ రాజకీయరంగు పులమడంమాని సమస్యలపై పోరాటం చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు జయ ప్రకాష్,కుమార్, మహేష్, చిరంజీవి,డిల్లీ బాబు,రఘు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తతే రక్షణ

## -విద్యార్థులు డిజిటల్ భద్రతపై అవగాహన పెంపొందించుకోవాలి

ప్రజాభూమి ప్రతినిధి చిత్తూరు

విద్యార్థుల్లో సైబర్ భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలన, యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కల్పించేందుకు మంగళవారం చిత్తూరులోని విజయం డిగ్రీ కళాశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిజిటల్ యుగంలో రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియా మరియు ఆన్‌లైన్ లావాదేవీలను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు, సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ నిత్యబాబు, ఎస్.బి. ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకోవాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింక్‌లు మరియు సోషల్ మీడియా సందేశాలను నమ్మవద్దని తెలిపారు. ఎస్.బి. ఇన్స్పెక్టర్ ప్రవీణ్




మాట్లాడుతూ, విద్యార్థులు సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. ఆన్‌లైన్ మోసాలకు గురైనప్పుడు భయపడకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, డ్రగ్స్ వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక మరియు చట్టపరమైన పరిణామాలను వివరించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని సూచించారు. సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ నిత్యబాబు మాట్లాడుతూ, ఓటిపి, పిన్, సివివి బ్యాంక్ ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు వంటి కీలక సమాచారాన్ని ఎవరికీ వెల్లడించకూడదని సూచించారు. డిజిటల్ అరెస్ట్, ఫేక్ జాబ్ ఆఫర్లు, ఆన్‌లైన్ పెట్టుబడి మోసాలు, ఫిషింగ్ లింకులు తదితర సైబర్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అదేవిధంగా, యాంటీ ర్యాగింగ్‌పై కూడా విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ, కళాశాలలో ర్యాగింగ్‌కు పాల్పడటం చట్టపరంగా నేరమని, సీనియర్ విద్యార్థులు జూనియర్లను వేధించకుండా స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. ర్యాగింగ్‌కు గురైన విద్యార్థులు భయపడకుండా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. అనంతరం మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యార్థులు అత్యవసర పరిస్థితుల్లో 112కు డయల్ చేయాలని, సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అనుమానాస్పద కార్యకలాపాలు లేదా ఇతర పోలీసు సంబంధిత సమాచారాన్ని చిత్తూరు పోలీస్ వాట్సాప్ నంబర్ 9440900005కు తెలియజేయవచ్చని తెలిపారు. అదేవిధంగా, డ్రగ్స్ పై ఈగిల్ టోల్‌ఫ్రీ నంబర్ 1972 కు లేదా ఎస్.బి. ఇన్స్పెక్టర్ నెంబర్ 9490617896 కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వెదురుకుప్పం ఉన్నత పాఠశాలలో పోటాపోటీగా విద్య కమిటీ ఎన్నికలు

## ఎన్నికల్లో గెలుపొందిన మోహన మురళి అనుచరులు



ప్రజా భూమి ప్రతినిధి వెదురుకుప్పం

వెదురుకుప్పం జడ్పీ హైస్కూల్ నందు మంగళవారం జరిగిన స్కూల్ విద్యా కమిటీ ఎన్నికలను ఎన్నికల అబ్జర్వర్ గా విచ్చేసిన సమగ్ర శిక్ష చిత్తూరు ఏ.సి.ఎం.ఓ మరియు ఎ.ఎల్.ఎస్.సి.ఓ ఆధ్వర్యంలో విద్యా కమిటీ చైర్మన్ గా వెదురుకుప్పం టిడిపి నేత మోహన మురళి అనుచరుడు కె.చిన్నదొర ను స్కూల్ కమిటీ చైర్మన్గా ఎలక్షన్లో గెలుపొందారు మరియు వైస్ చైర్మన్ గా పి.దుర్గా గారిని పోటాపోటీ ఎన్నికలలో గెలవడం జరిగింది అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వెదురుకుప్పం టిడిపి నేత మోహన్ మురళి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కి ఎమ్మెల్యే డా.వి.యం.దామస్ చొరవతో అభివృద్ధి చేయడానికి ముందుకు వెళ్తామని ధీమా వ్యక్తం చేశారు మంచి వ్యక్తిని ఎలక్షన్లలో పోటీ చేసి గెలిపించినందుకు తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శివ శంకరయ్య మరియు ఉపాధ్యాయులు మరియు మండల టిడిపి కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొనడం జరిగింది

# చిరు వ్యాపారుల అభ్యున్నతికే 'పీఎం స్వానిధి 2.0'..!

## 'లోక కల్యాణ మేళా'లో మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ, ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్ మల్లికార్జున్ వెల్లడి

ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట.

రోజువారీ శ్రమపై ఆధారపడి జీవించే వీధి వర్తకులు, చిరు వ్యాపారులు ఆర్థిక స్వావలంబన సాధించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'పీఎం స్వానిధి 2.0' పథకాన్ని అందుబాటులోకి తెచ్చిందని నాయుడుపేట మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఫీల్డ్ ఆఫీసర్ మల్లికార్జున్ స్పష్టం చేశారు. స్థానిక మున్సిపల్ మెప్మా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'లోక కల్యాణ మేళా' అవగాహన సదస్సులో వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ మాట్లాడుతూ.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చిన్నపాటి దుకాణాలు, తోపుడు బండ్లు, వీధి వ్యాపారాలు చేసుకునేవారు. పెట్టుబడి కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అధిక వడ్డీలు చెల్లించలేక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారికి అండగా నిలవడానికే పీఎం స్వానిధి పథకం ప్రవేశపెట్టబడిందని తెలిపారు. ఈ పథకం ద్వారా అర్హులైన చిరు వ్యాపారులకు తొలి విడతగా రూ. 15,000 రుణ సదుపాయం కల్పిస్తారని చెప్పారు. తీసుకున్న రుణాన్ని నిర్ణీత వ్యవధిలో సక్రమంగా తిరిగి చెల్లించిన లబ్ధిదారులకు క్రమశిక్షణ ఆధారంగా రెండో విడతలో రూ. 25,000, అనంతరం మూడో విడతలో ఏకంగా రూ. 50,000 వరకు వ్యాపార విస్తరణ రుణాలు అందుతాయని వివరించారు. మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన వీధి వర్తకులందరూ మెప్మా సిబ్బందిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని, ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా





నేరుగా బ్యాంకు ఖాతాల్లోకే నిధులు జమ అవుతాయని ఆమె పేర్కొన్నారు. అనంతరం ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్ మల్లికార్జున్ మాట్లాడుతూ.. బ్యాంకుల ద్వారా లభించే ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని చిరు వ్యాపారులు తమ జీవనోపాధిని విస్తరించుకోవాలని సూచించారు. రెండో విడత రుణం పొంది సకాలంలో చెల్లించిన వారికి అదనపు ప్రోత్సాహకంగా బ్యాంక్ తరఫున రూ. 10,000 ప్రాథమిక పరిమితితో (క్రెడిట్ లిమిట్) కూడిన ప్రత్యేక క్రెడిట్ కార్డును అందజేయనున్నట్లు వెల్లడించారు. దీనివల్ల నిత్య అవసరాల కోసం నగదు కొరత లేకుండా వ్యాపారం కొనసాగించవచ్చన్నారు. దీంతో పాటు పీఎం స్వానిధి కింద నమోదు చేసుకున్న ప్రతి లబ్ధిదారుడికి కేంద్ర ప్రభుత్వ సామాజిక భద్రతా ప్రమాణాల ప్రకారం 8 రకాల సంక్షేమ బీమా పథకాలు వర్తిస్తాయని స్పష్టం చేశారు. ఏదైనా అనుకోని ప్రమాదం లేదా ఆపద సంభవించినప్పుడు లబ్ధిదారుల కుటుంబాలకు ఈ బీమా రక్షణ కవచంలా నిలుస్తుందని తెలిపారు. అలాగే డిజిటల్ లావాదేవీలు నిర్వహించే వారికి ప్రత్యేక క్యాష్‌బ్యాక్ ప్రోత్సాహకాలు కూడా లభిస్తాయని ఆయన వివరించారు. ఈ సందర్భంగా రుణ ప్రక్రియ, అవసరమైన పత్రాల వివరాలపై లబ్ధిదారులకు అధికారులు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు (సీవోలు) నారాయణమ్మ, లత, రిసోర్స్ పర్సన్లు, స్వయం సహాయక సంఘ సభ్యులు, పట్టణ పరిధిలోని చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

# లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పై శిక్షణ నిర్వహించిన ఎంపీడీవో వాసుదేవరావు..!




ప్రజా భూమి ప్రతినిధి, పాకాల :(చంద్రగిరి)

తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం, పాకాల మండలం, పాకాల ఎంపీడీవో కార్యాలయంలో ఇంజనీర్ అసిస్టెంట్లకు,పంచాయతీ కార్యదర్శులకు లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పై మంగళవారం పాకాల ఎంపీడీఓ వాసుదేవరావు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.



ఈ కార్యక్రమంలోడిప్యూటీ ఎంపీడీఓ శశిరేఖ,ఏపీఓ ఆషారాణి సమావేశం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ లో భాగంగా ఇంటింటి నుంచి తడి,పొడి చెత్తను వేరుగా తీసుకోవాలని చెప్పారు. తడి చెత్తను తీసుకొచ్చి డంపింగ్ యార్డ్ లో వర్మీ కంపోస్ట్ తయారు చేయాలని,పొడి చెత్తను పంచాయతీకి వచ్చే స్వచ్ఛరథముకు ఇవ్వాలని,స్వచ్ఛరథంకు 20 రకాల పొడి చెత్త ఇవ్వచ్చని చెప్పారు. లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ లో గ్రే వాటర్ మరియు బ్లాక్ వాటర్ మేనేజ్మెంట్ ఉంటుందని అన్నారు. గ్రే వాటర్ ను మళ్లీ రీ సైకిలింగ్ చేసి వ్యవసాయానికి వాడుకునేలా చేసుకోవచ్చు అని చెప్పారు. డంపింగ్ యార్డులో ఫెన్సింగ్ కొరకు బయో ప్లాంటేషన్ గురించి తెలియజేశారు. విబిజి రామ్ జి గురించి వివరించారు. అక్టోబర్ 2వ తేదీ జరిగే గ్రామ సభలలో విబిజి రామ్ జీ లో నూతన పనుల గురించి చర్చించాలని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మోహన్ శర్మ,రజినీకాంత్, ఆదెమ్మ,టి.శ్రీలేఖ, పవిత్ర,అభిద్ భాష,పద్మనాభం రాజు,పావని,సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాల సమగ్ర వికాసం కొరకు కృషిచేద్దాం-నూతన చైర్మన్ ఉట్ల.సుధాకర్ పిలుపు

ప్రజా భూమి ప్రతినిధి తొట్టంబేడు

ఆదర్శ ప్రాథమిక పాఠశాల, చియ్యవరం నందు జరిగిన నూతన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలలో (సఎంసీ ) చైర్మన్‌గా ఉట్ల.సుధాకర్ ని, లివైస్ చైర్మన్‌గా డి.కుమారి ని ఏకగ్రీవంగా నూతన సఎంసీ కమిటీ సభ్యులు ఎన్నుకున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవేంద్ర పెరిమిడి తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సఎంసీ ప్రథమ సమావేశంలో నూతన చైర్మన్ సుధాకర్ మాట్లాడుతూ చైర్మన్ గా ఏకగ్రీవంగా నన్ను ఎన్నుకున్నందుకు తల్లిదండ్రులందరికీ మరియు విద్యా కమిటీకి నా ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను అనీ ఇదొక పదవిగా కాకుండా, మన పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే ఒక గొప్ప బాధ్యతగా నేను భావిస్తున్నాను మరియు ప్రభుత్వం విడుదల చేసిన నూతన సఎంసీ మార్గదర్శకాల ప్రకారం, మన కమిటీ ముఖ్య ఉద్దేశం పాఠశాల సమగ్ర వికాసం మరియు ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడం. ఈ లక్ష్యాలను సాధించడానికి మీ అందరి సహకారం మరియు తల్లిదండ్రుల భాగస్వామ్యం




అందించాలని కోరారు. సఎంసీ వైస్ చైర్మన్ డి. కుమారి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కేవలం ఉపాధ్యాయుల వల్లే సాధ్యం కాదు. మన నూతన నియమాల్లో చెప్పినట్లుగా 75% భాగస్వామ్యం తల్లిదండ్రులదే. అందుకే ప్రతి నెలా జరిగే సఎంసీ సమావేశాలకు ప్రతి ఒక్కరూ హాజరై మీ అమూల్యమైన సలహాలు అందించాలని కోరారు. సఎంసీ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గుర్రమ్మ మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పన,విద్యా ప్రమాణాల పెంపు, పారదర్శకత – సమష్టి నిర్ణయాలు తదితర తీర్మాన అంశాల గూర్చి చర్చించారు. కమిటీ సభ్యులందరి అంగీకారంతో, హెడ్‌మాస్టర్ సమక్షంలోనే ప్రతి నిర్ణయం తీసుకుంటాం అనీ మన బడి – మన పిల్లల భవిష్యత్తు".మనమంతా ఒక కుటుంబంలా కలిసికట్టుగా పనిచేసి, మన ఆదర్శ ప్రాథమిక పాఠశాల, చియ్యవరం పాఠశాలను తొట్టంబేడు మండలంలోనే కాకుండా తిరుపతి జిల్లాలోనే ఒక ఉత్తమ ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దుకుందాం అని నూతన సఎంసీ కమిటీ సభ్యులు ముక్త కంఠంతో పిలునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పి.సుహాసిని బి.గంగారావు ఆర్.రాజేంద్ర ప్రసాద్ బి.సుబ్రహ్మణ్యం తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# లేపాక్షి పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు నమోదు -ముగ్గురు అరెస్ట్

## -వివరాలు వెల్లడించిన అడిషనల్ ఎస్పీ

ప్రజాభూమి, హిందూపురం టౌన్



లేపాక్షి పోలీస్ స్టేషన్‌లో నమోదైన రెండు కేసుల వివరాలను హిందూపురం డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో అడిషనల్ ఎస్పీ కేవీ మహేష్ వెల్లడించారు. సీఐలు జనార్ధన్, కరీం, లేపాక్షి ఎస్ఐ నరేంద్రతో కలిసి ఆయన కేసుల వివరాలను వివరించారు. సెప్టెంబర్ 24న లేపాక్షి పోలీస్ స్టేషన్‌లో నమోదైన మహిళ అదృశ్యం కేసు విషయంలో సెప్టెంబర్ 25న అదృశ్యమైన యువతి షాహినా, వద్దే శీన పోలీస్ స్టేషన్‌కు హాజరయ్యేందుకు వెళ్తుండగా, యువతి బంధువులు జీషాన్, అరిఫ్, అబ్రార్, ఇస్మాయిల్ రెండు ద్విచక్ర వాహనాలపై వచ్చి వారి వాహనాన్ని అడ్డుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో వద్దే శీన ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఆయన కుడి కాలికి రక్త గాయం అయినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై లేపాక్షి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, నిందితులు అరిఫ్, అబ్రార్, ఇస్మాయిల్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు అడిషనల్ ఎస్పీ తెలిపారు. మరో ఘటనలో మహిళ కావడానికి బీజేవైఎం మండల అధ్యక్షులు ఈశ్వర్ ప్రసాద్ కారణమని ఆరోపిస్తూ, సెప్టెంబర్ 25న మధ్యాహ్నం సుమారు 1:30 గంటల సమయంలో అదృశ్యమైన యువతి తండ్రి అక్బర్ బాషా, బంధువు ఇస్మాయిల్ కలిసి ఈశ్వర్ ప్రసాద్ ద్విచక్ర వాహనాన్ని అడ్డుకుని దాడి చేసినట్లు ఫిర్యాదు అందిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై లేపాక్షి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏదైనా సమస్య లేదా వివాదం తలెత్తినప్పుడు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని అడిషనల్ ఎస్పీ కేవీ మహేష్ సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో లేపాక్షి ఎస్ఐ నరేంద్రతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నాయుడుపేటలో ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు

## -ఎల్‌ఏ సాగరం ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్‌గా నెలవల చంద్రశేఖర్

ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట

నాయుడుపేట మండల పరిధిలోని 74 పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎస్ఎంసీ ఎన్నికలు మంగళవారం ప్రశాంత వాతావరణంలో ముగిశాయని తిరుపతి జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ భరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తల్లిదండ్రుల సమక్షంలో నిర్వహించిన ఎన్నికల్లో చైర్మన్, వైస్ చైర్మన్, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. మండలంలోని మూడు గురుకుల పాఠశాలలు, తొమ్మిది ఉన్నత పాఠశాలలు, 62 ప్రాథమిక పాఠశాలల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తయిందన్నారు. ఎల్ఏ సాగరం ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్‌గా నెలవల చంద్రశేఖర్, వైస్ చైర్మన్‌గా ఓ.స్వర్ణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వెల్లడించారు. ఎల్ఏ సాగరం ఉన్నత పాఠశాలలో జరిగిన ఎన్నికల ప్రక్రియను భరత్‌కుమార్‌రెడ్డి నేరుగా పరిశీలించారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల ప్రగతిలో నూతన కమిటీ సభ్యులు చురుకైన భాగస్వామ్యం వహించాలని సూచించారు. ఎన్నికల అనంతరం నూతన చైర్మన్ నెలవల చంద్రశేఖర్, వైస్ చైర్మన్ ఓ.స్వర్ణలను అధికారులు శాలువాలతో సత్కరించి అభినందించారు.



పాఠశాల మౌలిక వసతుల మెరుగుదల, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కమిటీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని భరత్‌కుమార్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో ఏ.ఎం.ఓ ఆర్.వి.రమణ, నాయుడుపేట మండల విద్యాశాఖ అధికారి 2 బి.మునిరత్నం, ఎల్ఏ సాగరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ కట్టిన సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు గడదాస్ వెంకటేశ్వర్లు, జి.వి.నాయుడు, ఆనంద్, సుధాకర్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది హాజరై నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా పూర్తవడంపై విద్యాశాఖ అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

# ఫిజికల్ స్టాకింగ్ కంటే సైబర్ స్టాకింగ్ ఎక్కువైంది

- మహిళలు అప్రమత్తంగా ఉండాలి.. వేధింపులు ఎదురైతే వెంటనే ఫిర్యాదు చేయాలి
- మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజ






ప్రజా భూమి ప్రతినిధితిరుపతి,
ఒకప్పుడు ఫిజికల్ స్టాకింగ్ ఎక్కువగా ఉండేదని, ప్రస్తుతం సాంకేతికత వినియోగం పెరగడంతో సైబర్ స్టాకింగ్ ఎక్కువవుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజ అన్నారు. సోషల్ మీడియా, ఫోన్‌లు, మెసేజ్‌ల ద్వారా మహిళలను నిరంతరం సంప్రదించడం, వెంటపడటం, వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేయడం వంటి వాటిపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) సహకారంతో రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో మంగళవారం తిరుపతిలోని ఎస్వీ విశ్వవిద్యాలయం సెనేట్ హాల్‌లో 'స్టాకింగ్ నివారణ'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ.. ఒక నంబర్‌ను బ్లాక్ చేసినా మరో నంబర్ నుంచి పదేపదే కాల్స్, మెసేజ్‌లు చేయడం కూడా స్టాకింగ్‌లో భాగమేనన్నారు. అనుమతి లేకుండా గిఫ్ట్‌లు, బొకేలు పంపడం, మహిళల డీపీలు, ఫొటోలతో నకిలీ సోషల్ మీడియా ఖాతాలు సృష్టించడం, వ్యక్తిగత ఫొటోలు, సమాచారాన్ని దుర్వినియోగం చేసి వేధించడం వంటి చర్యల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా పరిచయం పెంచుకుని నిరంతరం సంప్రదించడం, వెంటపడటం వంటి ఘటనలను తొలిదశలోనే గుర్తించాలని సూచించారు.

**మానసిక బలం కూడా అవసరం**

మహిళల భద్రతకు చట్టాలు, పోలీసు వ్యవస్థతో పాటు మానసిక బలం కూడా అవసరమని శైలజ అన్నారు. వేధింపులు ఎదురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు చెప్పాలని సూచించారు. 'సమాజం ఏమనుకుంటుంది.. బంధువులు ఏమంటారు' అనే ఆలోచనతో సమస్యను దాచిపెట్టకూడదన్నారు. సమస్యను ముందుగానే గుర్తించి ఫిర్యాదు చేస్తే మరింత తీవ్రం కాకుండా అడ్డుకోవచ్చని తెలిపారు.

**హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన**

మహిళలు అత్యవసర సమయంలో 181 మహిళా హెల్ప్‌లైన్, 112 అత్యవసర సేవలు, 1930 సైబర్ నేరాల హెల్ప్‌లైన్ నంబర్లను గుర్తుంచుకోవాలని సూచించారు. మహిళల భద్రత కోసం శక్తి యాప్‌ను వినియోగించుకోవాలని తెలిపారు. జీరో ఎఫ్ఐఆర్‌పై కూడా మహిళలకు అవగాహన అవసరమన్నారు. ఫిర్యాదు సమయంలో అవసరమైతే మహిళా పోలీసు అధికారిని కోరే హక్కు ఉందని చెప్పారు. ఈవ్‌టీజింగ్, లైంగిక వేధింపులు, స్టాకింగ్ వంటి ఘటనలను సాధారణంగా తీసుకోరాదని శైలజ అన్నారు. ఆత్మహత్య ఏ సమస్యకూ పరిష్కారం కాదని, క్లిష్ట పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు, పోలీసులు, సహాయ వ్యవస్థల అండ తీసుకోవాలని సూచించారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించి, అనుచిత ప్రవర్తన ఎదురైతే తల్లిదండ్రులకు చెప్పేలా ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతి అదనపు ఎస్పీ శ్రీమతి శ్రీలత, ఎస్ఐ ఏ. జయస్వాములు, న్యాయ నిపుణురాలు డా. కె. శ్రావణి, ఎస్వీ విశ్వవిద్యాలయం సైకాలజీ విభాగం సైకాలజిస్ట్, కౌన్సిలర్ డా. ఎస్. విశ్వనాథ్‌రెడ్డి, మహిళా కమిషన్ సలహాదారు ఆర్. సూయజ్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలి

- మురుగుకాల్వలను శుభ్రం చేయాలని వినతి



ప్రజాభూమి, వేంపల్లె
స్థానిక పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ధ్రువకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో మురుగుకాల్వలు చెత్తాచెదారంతో నిండిపోయి మురుగునీరు రోడ్లపైకి వస్తోందని వారు తెలిపారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దోమలు, పందులు, వీధికుక్కల సంచారం పెరిగిందని పేర్కొన్నారు. మలేరియా, కలరా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. దసరా పండుగను దృష్టిలో ఉంచుకుని గ్రామంలో పారిశుధ్య పనులను వెంటనే చేపట్టి, మురుగుకాల్వలను శుభ్రం చేయాలని అధికారులను కోరారు. సమస్యను పరిశీలించిన అధికారులు జేసీబీలతో మురుగుకాల్వలను శుభ్రం చేయిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, మండల అధ్యక్షుడు బీగల రామకృష్ణ, వేమయ్య, రవీంద్రనాథ్ రెడ్డి, బద్రీనాథ్, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

## పల్లె పండుగ సరే.. సూపర్ సిక్స్ హామీల మాటేమిటి?

- మిగిలిన హామీలను వెంటనే అమలు చేయాలి
- ఏపీసీసీ మీడియా చైర్మన్ డా. ఎన్. తులసి రెడ్డి



ప్రజాభూమి, వేంపల్లె
పల్లె పండుగ సరే.. సూపర్ సిక్స్ హామీల్లో మిగిలిన హామీల మాటేమిటని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డా. నర్రెడ్డి తులసిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం స్థానిక పట్టణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో తులసి రెడ్డి మాట్లాడుతూ.. గత సార్వత్రిక ఎన్నికల్లో సూపర్ సిక్స్ హామీలను నమ్మి ప్రజలు కూటమి పార్టీలకు ఓట్లు వేసి అధికారాన్ని అప్పగించారన్నారు. అధికారంలోకి వచ్చి 27 నెలలు పూర్తయినా ప్రధాన హామీలు అమలు కాలేదని తులసి రెడ్డి అన్నారు. ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి, 19 నుంచి 59 ఏళ్ల మధ్య వయసున్న ప్రతి మహిళకు నెలకు రూ.1,500 చొప్పున ఆర్థిక సాయం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే సామాజిక పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు అమలు కాలేదన్నారు. ఇప్పటికే చాలా ఆలస్యమైందని, ఇకనైనా సూపర్ సిక్స్‌లో మిగిలిన హామీలను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తులసి రెడ్డి కోరారు. హామీల అమలులో జాప్యం చేయడం సరికాదన్నారు.

## డంపింగ్ యార్డ్ లో ఇసుక మాయం

ఇసుక రవాణా మీడియా కథనాలొస్తేనే చర్యలా

ఉల్లికల్లు వద్ద ఇసుక రవాణాపై మండల వ్యాప్తంగా ఆరోపణలు.. చర్యలు కొనసాగించాలని ప్రజల డిమాండ్



ప్రజా భూమి శింగనమల
మండల పరిధిలోని ఉల్లికల్లు సమీపంలోని చిత్రావతి నది నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారనే ఆరోపణలు మండల వ్యాప్తంగా వినిపిస్తున్నాయి. ప్రతిరోజూ టిప్పర్ల ద్వారా ఇసుక రవాణా జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు,విమర్శిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాపై మీడియా కథనాలు వెలువడిన సందర్భాల్లో అధికారులు స్పందించి అప్పుడప్పుడు వాహనాలను తనిఖీ చేయడం, కేసులు నమోదు చేయడం వంటి చర్యలు చేపడుతున్నారని, అనంతరం పరిస్థితి మళ్లీ యథావిధిగా మారుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో అక్రమ రవాణాపై నిరంతర నిఘా, క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాల్సిన అవసరం ఉందనివారు కోరుతున్నారు. అనుమతులకు విరుద్ధంగా ఇసుక తరలింపు జరుగుతోందన్న ఆరోపణలు నిజమైతే ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగడంతో పాటు నదీ పరివాహక ప్రాంతంపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన,వ్యక్తం,చేస్తున్నారు ఇదిలా ఉండగా, ఇసుక రవాణాకు అడ్డుగా నిలిచే వారిని కొందరు బెదిరిస్తున్నారనే,ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలపై అధికారులు విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తేవాలని ప్రజలు,కోరుతున్నారు. మీడియా కథనాల కోసం ఎదురు చూడకుండా నిరంతర తనిఖీలు చేపట్టి, అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ఎస్.ఎన్. పురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్

మౌలిక సదుపాయాల అభివృద్ధికి హామీ

ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు :
ఎస్.ఎన్. పురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం సందర్శించి, ఆసుపత్రిలోని వైద్య సేవలు, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డా. జి. దయాసాగర్ ఆసుపత్రి అభివృద్ధి కోసం అవసరమైన అదనపు భవన నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆసుపత్రిలోని వివిధ రికార్డులు, వైద్య పరీక్షల నివేదికలు, ప్రయోగశాల (ల్యాబ్), ఫార్మసీ, అలాగే సంజీవని (నూూూ ణఱఅచీజ) బృందం నిర్వహిస్తున్న సేవలను పరిశీలించారు. ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించి మెడికల్ ఆఫీసర్ ప్రతిపాదించిన అన్ని అవసరాలను వీలైనంత త్వరగా మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ గారు హామీ ఇచ్చారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.




## గరికపాటి నరసింహారావుకు ఘన స్వాగతం

-ప్రత్యేక పూజలు..

-పురంలో "బసవయ్య లేచి రావయ్యా" ప్రవచనాలు




ప్రజాభూమి, హిందూపురం టౌన్
ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు మంగళవారం లేపాక్షి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు పరిగి వేణుగోపాలరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో గరికపాటి నరసింహారావు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శులు డాక్టర్ సురేంద్ర, వీరయ్య, బాలాజీతో పాటు టీడీపీ మండల అధ్యక్షులు అభిలాష్ తదితరులు గరికపాటి నరసింహారావుతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ విశిష్టత, చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత గురించి ఆయన తెలుసుకున్నారు. గరికపాటి నరసింహారావు పర్యటన సందర్భంగా లేపాక్షిలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. భక్తులు, స్థానిక నాయకులు ఆయనను కలుసుకుని అభినందించారు. అనంతరం సాయంత్రం హిందూపురం పట్టణంలోని వాసవీ ధర్మశాలలో నిర్వహించిన బసవయ్య లేచి రావయ్యా ప్రవచన కార్యక్రమంలో గరికపాటి నరసింహారావు పాల్గొని ఆధ్యాత్మిక సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమానికి మాజీ మున్సిపల్ చైర్మన్ డిఇ రమేష్ కుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షులు వెంకటేష్, నాయకులు మంగేష్, రాఘవేంద్ర తదితరులు హాజరయ్యారు.

## పాఠశాల ఎస్ఎంసీకి నూతన కమిటీ

## చైర్మన్‌గా వెంకట ప్రసాద్ ఏకగ్రీవ ఎన్నిక




ప్రజాభూమి, వేంపల్లె
మండలంలోని చింతలమడుగు పల్లిలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నికను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి. మహాలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. కమిటీ చైర్మన్‌గా యార్ల వెంకట ప్రసాద్, వైస్ చైర్మన్‌గా ఎస్. యాస్మిన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ లక్ష్మీ వృషభాచలేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ పి.వి. రమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి నూతన కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని, విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన చైర్మన్ యార్ల వెంకట ప్రసాద్, వైస్ చైర్మన్ ఎస్. యాస్మిన్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చావలి నాగశేఖర్, ఎన్. రామాంజనేయులు, ఎన్. రామస్వామి, ఏ. గిరిధర్ రెడ్డి, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## తారిమెల జెడ్పీహెచ్ఎస్‌లో చైర్మన్ ఎన్నికల పూర్తి

ఏకగ్రీవంగా ఎన్నికైన చైర్మన్ వైస్ చైర్మన్

చైర్మన్ డి.షాషావలి, వైస్ చైర్మన్ సౌందర్య



ప్రజా భూమి శింగనమల
శింగనమల మండలం తారిమెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2026 సంవత్సరానికి, సంబంధించిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు సోమవారం పూర్తయ్యాయి.ఎన్నికల్లో ఎస్ఎంసీ చైర్మన్‌గా 7వ తరగతి విద్యార్థి డి.అఫ్రీన్ తండ్రి,డి.షాషావలి,ఎన్నికయ్యారువైస్ చైర్మన్‌గా 10వ తరగతి విద్యార్థి ఎం.ఎస్.హర్షవర్ధన్ తల్లి సౌందర్య ఎన్నికయ్యారు. పాఠశాల,ప్రధానోపాధ్యాయురాలు వై.వరలక్ష్మి ఆధ్వర్యంలో ఎస్ఎంసీ ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం,కల్పించేందుకు కమిటీ సభ్యులు కృషి చేయాలని ఈ సందర్భంగా సూచించారు.

## యానాదుల, దళితుల భూముల జోలికొస్తే ఖబర్దార్ - సిపిఐ



ప్రజాభూమి ప్రతినిధి
శ్రీకాళహస్తి రూరల్
మండలంలోని ఎల్లంపల్లి లో గిరిజనుల దళితుల భూములను సిపిఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య, మండల కార్యదర్శి మించల శివకుమార్ దళితుల గిరిజనుల భూములను పరిశీలించారు సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం ఇచ్చిన డీకేటి భూములపై కొంతమంది అగ్ర కులస్తులు కన్ను పడడంతో హరిజనుల మధ్యలో వారికి వారికే చిచ్చులు పెడుతూ వారి భూములను అగ్రవర్ణాల వారు కొట్టేసే ప్రయత్నం చేయడం తగదు అన్నారు ప్రభుత్వ భూములు అమ్మకూడదు కొనకూడదు అనే నిబంధనలు ఉన్నప్పటికీ ఆ నిబంధనలకు తుంగలో తొక్కుతున్న అగ్రవర్ణాలపై చర్యలు తీసుకోవాలన్నారు ఈ గ్రామంలో అగ్రవర్ణాల ఒక్కరైతు కుటుంబానికి ప్రభుత్వ భూమి 15 ఎకరాలు ఏవిధంగా వస్తుందన్నారు ఎల్లంపల్లి గ్రామ రెవెన్యూలో ఉన్నటువంటి ప్రభుత్వ భూములను రి సర్వే జరిపిరి గిరిజనులకు, దళితులకు రెవెన్యూ అధికారులు న్యాయం చేయాలన్నారు ఎవరైతే అగ్రవర్ణాల వారు ఈ ప్రభుత్వ భూములను కొనుగోలు చేస్తున్నారో వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఇప్పటికైనా స్థానిక ఆర్టీవో గారు ఈ భూమల పైన దృష్టి పెట్టి రి సర్వే చేసి యానాదులకు, దళితులకు న్యాయం చేయాలని కోరారు.

## అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తే ఉపేక్షించేది లేదు

-కొట్నూరులో అనధికారిక నిర్మాణం తొలగింపు

-మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున



ప్రజాభూమి, హిందూపురం టౌన్
హిందూపురం పురపాలక సంఘం పరిధిలో అనుమతులు తీసుకోకుండా నిర్మాణాలు చేపడితే సహించే ప్రసక్తే లేదని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్పష్టం చేశారు. నిర్మాణాలు చేసే వ్యక్తులు తప్పనిసరిగా మున్సిపాలిటీకి తగిన రుసుం చెల్లించి అనుమతి పొందాలన్నారు. మున్సిపల్ పరిధిలోని కొట్నూరు సర్వే నం.259-1జలోని స్థలంలో పురపాలక సంఘం నుండి చట్టబద్ధమైన భవన నిర్మాణ అనుమతి పొందకుండా పనులు చేపట్టిన నిర్మాణాలను కూల్చివేసినట్లు తెలిపారు. పునాది స్థాయి వరకు నిర్మాణం చేసినట్లు పురపాలక సంఘం అధికారుల పరిశీలనలో గుర్తించడం జరిగిందన్నారు. సంబంధిత నిర్మాణానికి అవసరమైన భవన నిర్మాణ అనుమతి, ఆమోదం లేకుండా నిర్మాణ పనులు కొనసాగించడంతో సదరు అనధికారిక నిర్మాణాన్ని తొలగించినట్లు తెలిపారు. హిందూపురం పురపాలక సంఘం పరిధిలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం, ప్రభుత్వ/పురపాలక సంస్థకు సంబంధించిన భూములను ఆక్రమించడం లేదా ప్రజా ప్రయోజనానికి విరుద్ధంగా నిర్మాణాలు చేయడం వంటి అంశాలపై చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజలు భవన నిర్మాణం ప్రారంభించే ముందు తప్పనిసరిగా హిందూపురం పురపాలక సంఘం నుండి చట్టబద్ధమైన భవన నిర్మాణ అనుమతి పొందాలని, అనుమతి లేకుండా ఎటువంటి నిర్మాణ పనులు చేపట్టరాదని కమిషనర్ సూచించారు. నిబంధనలను ఉల్లంఘించి చేపట్టే నిర్మాణాలపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

## స్వచ్ఛత కార్యక్రమాలపై డీడీఓ సమీక్ష

**అక్టోబర్ 2న అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని ఆదేశం**



ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు
వాకాడు మండలంలో స్వచ్ఛత కార్యక్రమాలు, పంచాయతీల పరిపాలనా వ్యవహారాలపై గౌరవ సూళ్లూరుపేట డీడీఓ మంగళవారం సమీక్ష నిర్వహించారు.ముందుగా కాశీపురం గ్రామంలో స్వచ్ఛ రథాన్ని పరిశీలించారు.అనంతరం వాకాడు-2 సచివాలయాన్ని సందర్శించి అక్కడి రికార్డులను పరిశీలించారు.రికార్డుల నిర్వహణ, నమోదు విధానం తదితర అంశాలపై సచివా లయ సిబ్బందికి అవగాహన కల్పించారు. తదుపరి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండలంలోని 19మంది పంచాయతీ అభివృద్ధి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛరథం, స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణ ఆంధ్ర--స్వచ్ఛ పథం, స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల అమలుపై సమీక్షించారు.అక్టోబర్ 2వ తేదీన అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించాలని పంచాయతీ అభివృద్ధి అధికారులకు సూచించారు. గ్రామసభల ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని పెంచి స్వచ్ఛత కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని, పంచాయతీల్లో ఇంటి పన్నుల వసూళ్లను సకాలంలో పూర్తి చేసి, నిర్ణీత గడువులో 100 శాతం వసూలు చేసేలాచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయతీల పరిపాలన, రికార్డుల నిర్వహణ, పారిశుధ్య కార్యక్రమాల అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో, కార్యాలయ ఏఓ తదితరులు పాల్గొన్నారు.

## ముచ్చివోలు పాఠశాల అభివృద్ధికి కొత్త కమిటీ

- చైర్మన్‌గా ముచ్చెలి నాగరాజు.. వైస్ చైర్మన్‌గా దండి రజని ఏకగ్రీవ ఎన్నిక
- వచ్చదనం.. పరిశుభ్రత.. నాణ్యమైన విద్యకు ప్రాధాన్యత: దండి నరేంద్ర



ప్రజాభూమి ప్రతినిధి శ్రీకాళహస్తి రూరల్
మండలంలోని , ముచ్చివోలు గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన పాఠశాల అభివృద్ధి మరియు నిర్వహణ కమిటీ ( ఎస్ డి ఎం సి ) ఎన్నికల్లో పాల్గొనే అవకాశం లభించడం ఆనందంగా ఉంది. తల్లిదండ్రుల సహకారంతో మొత్తం 15 మంది సభ్యులు ఎన్నిక కాగా,వారి సమక్షంలో శ్రీ ముచ్చెలి నాగరాజు చైర్మన్‌గా,దండి రాజని వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులతో పాటు చైర్మన్, వైస్ చైర్మన్‌కు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ,రాబోయే రెండేళ్ల కాలంలో పాఠశాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన ముఖ్య అంశాలపై సూచనలు చేయడం జరిగింది.పాఠశాల పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్యానికి ప్రత్యేక ప్రాధాన్యత విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతను క్రమం తప్పకుండా పర్యవేక్షించడం పెండింగ్‌లో ఉన్న ప్రహరీ గోడనిర్మాణాన్ని పూర్తిచేయడం పాఠశాల ఆవరణలో 100% పచ్చదనం పెంపొందించేలా మొక్కలు నాటడం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠశాలను జూనియర్ కళాశాల స్థాయికి అప్‌గ్రేడ్ చేయడానికి కృషిచేయడం "విద్యార్థులకు మెరుగైన వాతావరణం- నాణ్యమైన విద్య- ఉజ్వలమైన భవిష్యత్తు" అనే లక్ష్యంతో నూతన కమిటీ సమర్థవంతంగా పనిచేస్తుందని ఆశిస్తున్నాను.
నూతన కమిటీకి శుభాకాంక్షలు-ముచ్చివోలు పాఠశాల అభివృద్ధికి నా పూర్తి సహకారం ఉంటుంది.

## ప్రశాంతంగా పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు



ప్రజా భూమి తొండూరు: స్థానిక మండల కేంద్రమైన తొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌గా తొండూరు గ్రామానికి చెందిన బి. లోకేశ్వర్ రెడ్డి, వైస్ చైర్మన్‌గా ఎం. సుహాసిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే మరో 13 మంది సభ్యుల ఎన్నిక ప్రక్రియ కూడా సజావుగా, ప్రశాంతంగా, ఏకగ్రీవంగా జరిగినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేవీ సుబ్బారెడ్డి తెలిపారు.అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధిలో కమిటీ సభ్యులు కీలకపాత్ర పోషించాలని ప్రధానోపాధ్యాయుడు కోరారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వెంకటరమణ, లక్ష్మీనారాయణ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.




# తుఫాన్‌తో నష్టపోయిన భూములకు పరిహారం ఇవ్వాలి

## సీపీఎం నాయకుల డిమాండ్

ప్రజాభూమి ప్రతినిధి కూనవరం :-

మండలంలోని తుఫాన్, భారీ వర్షాల కారణంగా పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం లో తహసీల్దార్ ధర్మేంద్ర కు వినతిపత్రం అందజేశారు.నష్టపోయిన భూములు, పంటలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్రంగా అంచనా వేయాలని కోరారు.మిరప, మినుములు, పెసర, నువ్వులు వేసిన రైతులు భారీగా తూఫాన్ వల్ల నష్టపోయారని అన్నారుతుఫాన్ ప్రభావంతో పలు ప్రాంతాల్లో వ్యవసాయ భూముల్లో పంటలు నీటమునిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. రైతులు పెట్టుబడులు కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వం ఎకరాకు తగిన నష్టపరిహారం అందించాలని కోరారు. పంటల బీమా ఉన్నా లేకపోయినా నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అధికారులు వెంటనే గ్రామాల్లో పర్యటించి పంట నష్టం, భూముల నష్టాన్ని నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని, పరిహారం చెల్లింపులను త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఎం నాయకులు కోరారు.ఈ కార్యక్రమం లో జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు,సీపీఎం పార్టీ మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, జిల్లా కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య, తెల్లం తమ్మయ్య, వేణు, జగన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నమట్టపల్లిలో ఘనంగా పోషణ మాసోత్సవాలు కార్యక్రమం నిర్వహణ

ప్రజాభూమి, ప్రతినిధి,
వి.ఆర్.పురం



మండలంలోని చిన్నమట్టపల్లి గ్రామం లోనీ అంగన్వాడి కేంద్రంలో ఘనం గా జరిగిన పోషణ మాసోత్సవాలు కార్యక్రమాల్లో ఐసిడిఎస్ ప్రాజె క్టు ఆఫీసర్ వి. మల్లిక, సూపర్‌వైజర్ జి. పద్మా వతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు ఆఫీసర్ వి. మల్లిక మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు సరైన పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఐరన్, విటమిన్లు కలిగిన స్థానిక కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు మరియు పౌష్టికాహారాన్ని తమ దైనందిన ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోషకాహార లోపాన్ని నివారించడమే ఈ మాసోత్సవాల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆయా పాత్రదారులు, గ్రామస్తులు, గర్భిణులు, బాలింతలు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# రైతులకు అవగాహన కల్పించేందుకు కిసాన్ మేళా

## పథకాలు, రాయితీలు, ఆధునిక సాగు విధానాలపై అవగాహన

ప్రజా భూమి ప్రతినిధి అడ్డతీగల

రైతులకు ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ అనుబంధ రంగాల సేవలపై అవగాహన కల్పించేందుకు అడ్డతీగలలో మంగళవారం కిసాన్ మేళా నిర్వహించారు. ఆత్మ సౌజన్యంతో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా వ్యవసాయాధికారి రామ్మోహన్‌రావు అధ్యక్షత వహించారు.మేళాలో వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, మత్స్య, బ్యాంకింగ్, డ్రిప్ ఇరిగేషన్ తదితర శాఖల స్టాళ్లను ఏర్పాటు చేశారు. పథకాలు, రాయితీలు, ఆధునిక సాగు పద్ధతులను అధికారులు రైతులకు వివరించారు. ఆత్మ పీడీ కంభం రాబర్ట్‌పాల్ మాట్లాడుతూ ఆత్మ పథకం ద్వారా పది రకాల పంటలపై ప్రదర్శన క్షేత్రాలు, డెమో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా, రాష్ట్ర స్థాయి రైతు విజ్ఞాన యాత్రలకు రైతులను ప్రోత్సహిస్తున్నామన్నారు.జిల్లా ఉద్యానశాఖ అధికారి నరేంద్రకుమార్ మాట్లాడుతూ జిల్లాలో పామాయిల్, జీడిమామిడి సాగుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. పామాయిల్ సాగుకు 90 శాతం రాయితీపై మొక్కలు, డ్రిప్ ఇరిగేషన్ సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఏపీ ఎంఐపీ జిల్లా అధికారి దేవానంద్ సూక్ష్మ సేద్యంలో అందుతున్న సబ్సిడీ వివరాలను వెల్లడించారు.లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీధర్ మాట్లాడుతూ రైతులు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సకాలంలో రుణాలు చెల్లించే వారికి పావలా వడ్డీ వంటి ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్త మాడికొండ శ్రీనివాస్ తక్కువ కాలంలో, తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఉద్యానశాఖ అధికారి మమత మేలైన జీడిమామిడి, మామిడి వంగడాలను రైతులు వినియోగించుకోవాలని కోరారు. ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి మాట్లాడుతూ కిసాన్ మేళాల ద్వారా రైతులకు పథకాలు, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలుగుతుందన్నారు. దళారుల వద్ద అధిక వడ్డీలకు రుణాలు తీసుకోకుండా బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, భవిష్యత్‌లో ప్రభుత్వ పథకాలు ఫార్మర్ ఐడీ ఆధారంగా అందే అవకాశం ఉన్నందున నమోదు పూర్తి చేసుకోవాలని తెలిపారు. గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై వరి, మినుములు, పెసలు, నువ్వుల విత్తనాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ లోత లక్ష్మణ్‌రావు, సొసైటీ అధ్యక్షులు హరిబాబు, సూరిబాబు, ఉప్పెన కేశవ, రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి కనిగిరి రాంబాబు, బీజేపీ మహిళా కన్వీనర్ స్వప్నకుమారి, 12 మండలాల వ్యవసాయ అధికారులు, అడ్డతీగల సబ్‌డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకురాలు సావిత్రి, ప్రకృతి వ్యవసాయం డీపీఎంలు రాబిన్, రఘు, అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. ఉత్తమ రైతులకు మెమెంటోలు అందజేసి సన్మానించారు.

# సున్నంవారిగూడెం ఆశ్రమ పాఠశాలలో విజయవంతం గా (ఎస్ ఎమ్ సి )ఎన్నికలు

ప్రజాభూమి, ప్రతినిధి,
వి.ఆర్.పురం



మండలంలోనీ సున్నంవారిగూడెం ఆశ్రమ పాఠశాలలో మంగళవారం పాఠశాల నిర్వహణలో భాగంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలు విజయవంతంగా నిర్వహించారు. పాఠశాల ఎస్ ఎమ్ సి చైర్మన్ గా కారం రమణ, వైస్ చైర్మన్ గా మొసలి ప్రశాంత్ ఎన్నిక జరిగిందని ప్రధానోపాధ్యాయులు పైదా కన్నారావు తెలిపారు.



పాఠశాల ప్రధానోపాధ్యాయులు పైదా కన్నారావు నూతనం గా ఎన్నికైన చైర్మన్ కారం రమణ, వైస్ చైర్మన్ మొసలి ప్రశాంత్, కమిటీ సభ్యులను పుష్ప గుచ్ఛాలతో, శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం, పాఠశాలలో మౌలిక వసతుల అభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వ యంతో పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమం అనంతరం తల్లి దండ్రులుకు వార్డెన్ బొగ్గ వీరభద్రయ్య భోజనాలు ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధానోపాధ్యాయులు రవ్వ సుబ్బారావు, సీనియర్ ఉపాధ్యాయులు బొర్రా రమేష్, తుర్రం వెంకటయ్య, జల్లి బాబురావు, కుంజా నాగార్జున, పులి ఈశ్వర్, చిక్క ప్రసాద్, చిచ్చడిఅప్పారావు, సోడే లక్ష్మణ్, పూనెం రాజయ్య, సోడే వీర్రాజు, సి ఎచ్ గోపాలరావు, తుర్రం సత్తిబాబు, ఎమ్ భీష్మ రావు, జగన్, బాబురావు, ఎమ్.నాగబాబు, సునీల్, శరత్, బొగ్గా వెంకట్, తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## గత 24 గంటల్లో 8.30 గంటల వరకు స్వల్ప వర్షపాతం

ప్రజాభూమి, రంపచోడవరం

పోలవరం జిల్లాలో గత 24 గంటల్లో మంగళవారం ఉదయం 8.30 గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాల ప్రకారం జిల్లాలోని పలు మండలాల్లో వర్షపాతం నమోదు కాలేదు. రంపచోడవరం మండలంలో అత్యధికంగా 11.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా.. రంపచోడవరం 11.4 మి.మీ., గంగవరం 1.6 మి.మీ., అడ్డతీగల 1.2 మి.మీ., రాజవొమ్మంగి 1.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. మారేడుమిల్లి, చింతూరు, కూనవరం, దేవీపట్నం, వై.రామవరం, వీఆర్.పురం, గుర్తేడు, యటపాక మండలాల్లో వర్షపాతం నమోదు కాలేదు.



# ఐ సి డి ఎస్ ప్రాజెక్ట్, ఆధ్వర్యంలో 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమం లో మల్లికా సిడిపిఓ

ప్రజాభూమి ప్రతినిధి కూనవరం

మండలంలోని ప్రాజెక్ట్ అధికారిణి వి మల్లిక ఆధ్వర్యంలో "9 వ జాతీయ పోషణ మాసం-2026 "మరియు "అంగన్వాడీ ఉత్సవ్ " కార్యక్రమం లు జరుగుచున్నవి.ఈ కార్యక్రమం లో భాగంగా ఈరోజు ది. 29-9-2026 న మండలంలోని టేకులు బోరు -2అంగన్వాడీ కేంద్రం లలో అంగన్వాడీ ఉత్సవ్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం లో సీ డీ పీ ఓ వి మల్లిక పిల్లలు -ఆరోగ్యం పోషణ సమగ్రాభివృద్ధి కేంద్రం ప్రభుత్వం పథకాలు పి యం యం వి వై మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి, సా క్షం (అంగన్వాడీ ల అదునీకరణ), పోషణ 2.0, కమ్యూనిటీ ఈవెంట్స్ మొదలగు అంశాల గురించి అవగాహన కల్పించినారు.గర్భిణీ స్త్రీ లకు సీమంతం నిర్వహించినారు. ఈ కార్యక్రమం కు సెక్టార్ సూపర్‌వైజర్ నయోమి రాణి, తల్లులు, కిశోరి బాలికలు, గ్రామస్తులు, గ్రామ పెద్దలు యూత్ కమిటీ సభ్యులు సెక్టార్ లోని అంగన్వాడీ కార్యకర్తలు హాజరు అయినారు.అనంతరం ర్యాలీ నిర్వహించడం జరిగింది



# సోములగూడెం పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్‌ఎంసి) ఎన్నికల నిర్వహణ

ప్రజాభూమి ప్రతినిధి, వి.ఆర్.పురం



మండలంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికొన్నత పాఠశాల సోములగూడెం నందు నేడు పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్‌ఎంసి) ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా, పారదర్శకంగా నిర్వహించారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా ప్రధానోపాధ్యాయులు పి వి మురళి మనోహ ర్రావు, తల్లి దండ్రుల సమక్షంలో నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధా నోపాధ్యాయులు మాట్లాడుతూ, పాఠశాల అభివృద్ధిలో ఎస్‌ఎంసి పాత్ర చాలా కీలక మని, తల్లిదం డ్రులు, ఉపాధ్యాయులు కలిసి పనిచేస్తేనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ఎన్నికైన సభ్యులు 1. చైర్మన్ కారం రమాదేవి, 2. వైస్ చైర్మన్ బంధం రాజు.ఈ కార్యక్ర మంలో గ్రామ పెద్దలు, ఆసు లక్ష్మయ్య, మాజీ చైర్మన్ పాండ్రు బాలరాజు, వైస్ చైర్మన్ కూర కమలమ్మ, తల్లిదండ్రులు, మాడి ముత్యలరావు, సుబ్బారావు, కమల, అంజలి, రమాదేవి ఉపాధ్యాయులు సునీత లక్ష్మీ, వీర్రాజు, లక్ష్మయ్య స్వర్ణలత కమల నీలవేణి, నీలమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతం

ప్రజాభూమి ప్రతినిధి కూనవరం

మండలంలోని చినార్కూరు పంచాయతీ పరిధి లోని యం. పి. పి. ఎస్. జిన్నెలగూడెం పాఠశాల లో టి. నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన పాఠ శాల యాజమాన్యం కమిటీ ఎన్నికలు అటువంటి సమస్యలు /ఇబ్బందులు, సంఘటనలు లేకుండా ఏకగ్రీవంగా చేతులెత్తే విధానంతో ప్రశాంతంగా నిర్వహించడం జరిగింది అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. కన్నారావు ఒక ప్రకటన లో తెలిపారు. పాఠశాల యాజమాన్యం నూతన కమిటీ సభ్యులు గా చైర్మన్ తుష్టి. నాగరాజు, వైస్ చైర్మన్ తుష్టి. సుబ్బలక్ష్మి, సభ్యులు గా కుంజా. అశోక్, కట్టం. కమల, కూర. సింగరాజు, పా యం. లక్ష్మి, సంధ్య, పూసం. ఆనంద్, కుంజా. లక్ష్మి, చిచ్చడి. వినోద్,దర్ముల. వెంకమ్మ, పొడియం. కన్నారావు, భద్రమ్మ అంగన్వాడీ, ఎ ఎన్ యం దుర్గ, విషయ నిపుణులు కుంజా. అనిల్ ఎన్నికైనారు. ఈ యాజమాన్యం ఎన్నికల్లో పాయం. చెన్నకేశవ



రావు, దర్ముల. రాంబాబు, భద్రమ్మ, ఇరకం. బాలు, చిచ్చడి. కన్నారావు, ఇరకం. రమాదేవి, సీత, లక్ష్మి, సంధ్య, పాఠశాల సిబ్బంది పి. కుమారి తదితరులు పాల్గొన్నారు.

# సీతపల్లి జంక్షన్ వద్ద భారీ కొండచిలువ కలకలం

## సురక్షితంగా పట్టుకుని తపస్వికొండ రిజర్వ్ ఫారెస్టులో విడిచిపెట్టిన అటవీశాఖ అధికారులు



ప్రజాభూమి ప్రతినిధి అడ్డతీగల

అడ్డతీగల మండలం సీతపల్లి జంక్షన్ సమీపంలోని కల్వర్టు వద్ద మంగళవారం భారీ కొండచిలువ ప్రత్యక్షం కావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందు కున్న అటవీశాఖ డీఆర్వో యోగేంద్ర వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని రాజమండ్రికి చెందిన స్నేక్ క్యాచర్ ఈశ్వర్‌కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న ఈశ్వర్ చాకచక్యంగా కొండచిలువను సురక్షితంగా పట్టుకున్నారు. అనంతరం అటవీశాఖ అధికారులు దానిని తపస్వి కొండ రిజర్వ్ ఫారెస్టులో విడిచిపెట్టారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.అడవుల నరికివేతతో జనావాసాల్లోకి వన్యప్రాణులు?ఒకవైపు జాతీయ రహదారి నిర్మాణం, మరోవైపు అడవుల నరికివేత, అటవీ ప్రాంతాల్లో మంటలు వంటి కారణాలతో వన్యప్రాణుల సహజ ఆవాసాలు దెబ్బతింటున్నాయని కొందరు స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలోనే కొండచిలువలు, ఇతర వన్యప్రాణులు అటవీ ప్రాంతాలను వీడి జనసంచారం ఉన్న ప్రాంతాల్లోకి వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వన్యప్రాణుల సంరక్షణతోపాటు ప్రజల భద్రతకు అటవీశాఖ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# 125 రోజుల పనిదినాలపై దృష్టి

## బొడ్లంకలో బౌండరీ ట్రెంచ్ పనులు పరిశీలించిన డీడబ్ల్యూఎంఏ పీడీ




ప్రజాభూమి ప్రతినిధి అడ్డతీగల

మండలంలోని బొడ్లంక గ్రామపంచాయతీలో జరుగుతున్న బౌండరీ ట్రెంచ్ పనులను డీడబ్ల్యూఎంఏ పీడీ బి. రాంప్రసాద్ మంగళవారం పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని పరిశీలించడంతోపాటు కూలీల మస్టర్ రోల్‌ను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద నమోదైన ప్రతి జాబ్‌కార్డుదారుడికి 125 రోజుల పనిదినాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలో కనీసం 5 వేల పనిదినాల లక్ష్యాన్ని సాధించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు.పనుల నాణ్యత, కూలీల హాజరు, మస్టర్ నిర్వహణలో నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గిరిజన గురుకుల పాఠశాలలో నూతన ఎస్ఎంసీ కమిటీ ఎన్నిక

## చైర్మన్‌గా వంతల సత్తిబాబు, వైస్ చైర్‌పర్సన్‌గా పల్లాల సీతమ్మ

## పాఠశాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి: జర్తా వెంకటరమణారెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి అడ్డతీగల

అడ్డతీగల ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాలలో మంగళవారం పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు విజయవంతంగా ముగిశాయి. ప్రిన్సిపాల్ సీహెచ్ ప్రభాకరరావు పర్యవేక్షణలో నిర్వహించిన ఎన్నికల్లో తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొత్తం 472 మంది ఓటర్లలో సుమారు 250 మంది ఎన్నికల ప్రక్రియలో పాల్గొని తమ ప్రతినిధులను ఎన్నుకున్నారు. తొలుత 15 మందితో కమిటీని ఏర్పాటు చేయగా, సభ్యులంతా ఏకగ్రీవంగా దాకోడు గ్రామానికి చెందిన వంతల సత్తిబాబును చైర్మన్‌గా, పల్లాల సీతమ్మను వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు.

**విద్యార్థుల భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి**

నూతన కమిటీ ఎన్నిక అనంతరం మధ్యాహ్నం 1.30 గంటలకు నిర్వహించిన తొలి సమావేశంలో జర్తా వెంకటరమణారెడ్డి మాట్లాడారు. పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, నిర్వహణ కమిటీ సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంద న్నారు. కమిటీ సభ్యులు కేవలం పదవులకే పరిమితం కాకుండా విద్యార్థుల హాజరు శాతం పెంపు, క్రమశిక్షణ, విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పాఠశాల పురోగ తిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు.




**మాజీ చైర్మన్ సేవలకు గుర్తింపు**

గతంలో పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా సేవలందించిన బచ్చల రాధాకృష్ణమూర్తితోపాటు క్రియాశీల సభ్యుడు అడపా లోవరాజును ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి వారు అందించిన సేవలను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ ప్రభాకరరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాభూమి
జనరల్
బుధవారం, సెప్టెంబర్ 30, 2026




## రహదారి మంజూరు చేసిన ఎమ్మెల్యేకు సన్మానం

ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ

నూతన తారు రోడ్డు నిర్మాణంతో తమ గ్రామ రహదారి సమస్య పరిష్కారం కానుందని పీఏసీఎస్ చైర్మన్ పరుచూరి వెంకటేశ్వరరావు అన్నారు. చల్లపల్లి మండలం మంగళాపురం గ్రామానికి మూడు కిలోమీటర్లు నూతన తారు రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సహకారంతో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రత్యేక శ్రద్ధతో పల్లె పండుగ-3.0 కార్యక్రమం పురస్కరించుకొని వీబీజీ-రాంజీ నిధులు రూ.కోటీ 45 లక్షలు మంజూరు చేసిన సందర్భంగా మంగళవారం అవనిగడ్డలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ను గ్రామ ప్రముఖులు, గ్రామస్థులు కలిసి ఘనంగా సత్కరించారు. తమ గ్రామ ప్రజలకు నూతన రహదారి మంజూరు చేయటం పట్ల పీఏసీఎస్ చైర్మన్ పరుచూరి వెంకటేశ్వరరావు ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు చంద్ర పిచ్చియ్య, కొర్రపాటి కోటేశ్వరరావు, చంద్ర వెంకటేశ్వర రావు, మాజీ సర్పంచ్ గొరిపర్తి వెంకటేశ్వరరావు, ముక్కు వెంకటేశ్వరరావు, కొల్లూరు శ్రీనివాసరావు, ఉప్పల బుజ్జి, డొక్కు నాగబాబు పాల్గొన్నారు.

## ఉల్లిపాలెం పంచాయతీలో అంగనవాడిలో సేవా సంకల్ప అభియాన్

ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ



కోడూరు మండలం ఉల్లిపాలెం పంచాయతీలో అంగనవాడిలో సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమం ఘనంగా జరిగినది. ప్రధాన మంత్రి 25 ఏళ్ల పరిపాలనైన పురస్కరించుకొని అంగనవాడి ఉత్సవాలు ప్రారంభించారు కోడూరు మండలం ఉల్లిపాలెం పరిధిలో అంగన్వాడీ టీచర్స్ ఆయాలు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ప్రభుత్వం స్త్రీలకు చిన్నపిల్లలకు పోషక ఆహారం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ ఇ .వాణి అంగన్వాడి సూపర్వైజర్ కె. వి.ధనలక్ష్మి అంగన్వాడి కార్యకర్తలు సువర్ణ కుమారి సీతా మహాలక్ష్మి లక్ష్మి సుజాత సహాయకులు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వం నుంచి అంగన్వాడీ కేంద్రాలు కు అందించే పోషక ఆహారాలు కనుల విందుగా చూపించారు.

## అక్టోబర్ 1న ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

❖ ఉదయం 6.30 గంటల నుంచే పంపిణీ ❖ జిల్లాలో 46,360 మంది లబ్ధిదారులకు రూ.19.41 కోట్ల విడుదల ❖ జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్



ప్రజాభూమి, రంపచోడవరం

పోలవరం జిల్లాలో ఎన్‌టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను అక్టోబర్ 1వ తేదీన ఉదయం 6.30 గంటల నుంచి లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.పోలవరం జిల్లాలోని 12 మండలాల్లో మొత్తం 46,360 మంది పింఛను లబ్ధిదారులకు రూ.19,41,25,000 పింఛను మొత్తాన్ని అక్టోబర్ 1న పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రంపచోడవరం డివిజన్‌లోని 8 మండలాల్లో 28,432 మంది లబ్ధిదారులకు రూ.11,80,28,000, చింతూరు డివిజన్‌లోని 4 మండలాల్లో 17,928 మంది లబ్ధిదారులకు రూ.7,60,97,000 లను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా విడుదల చేశారన్నారు. బ్యాంకు సమ్మె విరమణతో యథావిధిగా పంపిణీ బ్యాంకు సమ్మె విరమించడంతో పింఛన్ల పంపిణీ ప్రక్రియ యథావిధిగా అక్టోబర్ 1వ తేదీన కొనసాగుతుందని జేసీ తెలిపారు. పింఛన్ల పంపిణీకి అవసరమైన నగదును సెప్టెంబర్ 30వ తేదీన ఉపసంహరించుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. నగదు కొరత లేకుండా అన్ని బ్యాంకు శాఖల్లో తగినంత నగదు అందుబాటులో ఉంచాలని బ్యాంకు అధికారులకు సూచనలు జారీ అయ్యాయని తెలిపారు.బ్యాంకులతో సమన్వయం చేసుకోవాలిస్థానిక బ్యాంకు కంట్రోలర్లు, లీడ్ బ్యాంకు మేనేజర్లతో సమన్వయం చేసుకుని సెప్టెంబర్ 30న నూటికి నూరు శాతం నగదు ఉపసంహరణ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నగదు అవసరాలను సంబంధిత బ్యాంకు శాఖలకు ముందుగానే తెలియజేయాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, స్వర్ణ గ్రామం-స్వర్ణ వార్డు సిబ్బందికి సూచించారు.పింఛన్ల పంపిణీలో లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జేసీ ప్రశాంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలాల వారీగా పింఛన్ల వివరాలు అడ్డతీగల మండలంలో 5,114 మంది లబ్ధిదారులకు రూ.2,12,52,000, దేవీపట్నంలో 4,105 మందికి రూ.1,70,41,500, గూర్తేడులో 1,323 మందికి రూ.54,12,000, గంగవరంలో 3,736 మందికి రూ.1,57,17,500, మారేడుమిల్లిలో 1,855 మందికి రూ.77,08,000, రాజవొమ్మంగిలో 6,180 మందికి రూ.2,55,38,000, రంపచోడవరంలో 4,334 మందికి రూ.1,81,38,000, వై.రామవరంలో 1,785 మందికి రూ.72,21,000 పింఛను మొత్తాలు విడుదలయ్యాయి. చింతూరు మండలంలో 4,829 మందికి రూ.2,03,69,000, కూనవరంలో 3,752 మందికి రూ.1,60,51,500, వీఆర్ పురంలో 3,355 మందికి రూ.1,43,15,500, యటపాకలో 5,992 మందికి రూ.2,53,61,000.

# సమష్టి కృషితోనే సాగరతీర మహా గణపతి ఉత్సవాల విజయం

## ప్రపంచ స్థాయిలో మచిలీపట్నం ఖ్యాతిని చాటిన వేడుకలు– మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి:

మంగినపూడి సాగరతీరంలో 63 అడుగుల భారీ మహా గణపతి ఉత్సవాలను విజయవంతం చేయడంలో అన్ని శాఖలు, ఉత్సవ కమిటీ, ప్రజలు, యు వత సమష్టిగా చేసిన కృషి అభినందనీయమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఈ ఉత్సవాలు మచిలీపట్నానికి పూర్వ వైభవాన్ని తీసుకురావడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో నగర ఖ్యాతిని చాటాయని పేర్కొన్నారు.మహా గణపతి ఉత్సవాల విజయోత్సవం సందర్భంగా సోమవారం రాత్రి మచిలీపట్నంలోని సువర్ణ కళ్యాణ మండపంలో నిర్వహించిన ఆత్మీయ అభినందన సభలో మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఏఎస్పీ వి.వి.నాయుడు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, ఉత్సవ కమిటీ చైర్మన్ చలమలశెట్టి నరసింహారావు, బందరు ఆర్డీవో కే.సాంబశివ రావు, వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పోలీసు, మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్, ఆర్అండ్‌బీ, ఆర్టీసీ, దేవాదాయ, పంచాయతీరాజ్, వైద్య, అగ్నిమాపక, తాగునీటి సరఫరా తదితర శాఖలు సమన్వయంతో పనిచేయడం వల్లే ఉత్సవాలు విజయవంతమయ్యాయని తెలిపారు. పారిశుద్ధ్య సిబ్బంది నిరంతరం సేవలందిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచారని, పోలీసులు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణలో ప్రత్యేక శ్రద్ధ చూపా రని అభినందించారు.భక్తులకు రవాణా సౌకర్యాలు కల్పించిన ఆర్టీసీ, ప్రసాదాల పంపిణీ చేపట్టిన దేవాదాయ శాఖ, నిరంతర విద్యుత్ సరఫరా అందించిన విద్యుత్ శాఖతో పాటు ఇతర శాఖల అధికారులు, సిబ్బంది అందించిన సేవలను మంత్రి ప్రశంసించారు. విద్యార్థులను ఉత్సవాలకు తీసుకురావడం ద్వారా వారిలో ఆనందాన్ని నింపారని, యువత, సోషల్ మీడియా బృందాలు ఉత్సవాల విశేషాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాయని అన్నారు. మీడియా ప్రతినిధులు అందించిన ప్రచారానికి కృతజ్ఞతలు తెలిపారు.సాగరతీర మహా గణపతి ఉత్సవాలకు ఇంటర్నేషనల్ అచీవర్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించడం సంతోషకరమని మంత్రి పేర్కొన్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ చలమలశెట్టి నరసింహారావు, కమిటీ సభ్యులు, వివిధ బృందాలు మట్టి సేకరణ నుంచి విగ్రహ తయారీ, అలంకరణలు, లైటింగ్, ప్రసాదాల తయారీ వరకు ప్రతి అంశాన్ని సమన్వయంతో నిర్వహించారని తెలిపారు.లడ్డు పాట, ప్రత్యేక కార్యక్రమాలు, వినూత్న లైటింగ్ ఏర్పాట్లు, భక్తులకు కల్పించిన సౌకర్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయని మంత్రి అన్నారు. ఉత్సవాల నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ మచిలీపట్నం ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో మచిలీపట్నం ప్రత్యేకతను ప్రపంచానికి చాటే మరిన్ని కార్యక్రమాలను నిర్వహించాలని ఆకాంక్షించారు.

**మంగినపూడిని ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం– కలెక్టర్ డీకే బాలాజి**

మంగినపూడి బీచ్‌ను ప్రముఖ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసి, దేశ, విదేశాల నుంచి పర్యాటకులు, సందర్శకులు అధికంగా వచ్చేలా చేయాలనే లక్ష్యంతో మంత్రి కొల్లు రవీంద్ర వివిధ కార్యక్రమాలను చేపడుతున్నారని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అన్నారు.బీచ్‌కు మరింత ప్రాచుర్యం కల్పించాలనే ఆలోచనల్లో భాగంగానే ఈ ఏడాది 63 అడుగుల మహా గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. మట్టి ద్వారా భారీ గణపతి విగ్రహాన్ని రూపొందించడం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనివ్వడం అభినందనీయమన్నారు. ప్రకృతి పరిరక్షణతో పాటు పర్యాటక అభివృద్ధిని సమన్వయం చేయడం ద్వారా ఉత్సవాలకు ప్రత్యేకత వచ్చిందని పేర్కొన్నారు.ఉత్సవాల నిర్వహణకు డీఆర్‌డీఏ పీడీ హరిహరినాథ్‌ను సమన్వయ అధికారిగా నియమించడం ద్వారా వివిధ శాఖల మధ్య సమర్థవంతమైన సమన్వయం సాధ్యమైందన్నారు. ప్రతి శాఖతో నిరంతరం సంప్రదిస్తూ ఏర్పాట్లను పర్యవేక్షించారని, అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారని తెలిపారు."ఈ కార్యక్రమంతో మంత్రి సంతోషించారు, ప్రజలు సంతోషించారు, మీడియా సంతో షించింది. చివరగా భగవంతుడు కూడా సంతోషించి ఆశీస్సులు అందిం చాడు" అని కలెక్టర్ పేర్కొ న్నారు. ఉత్సవాలను విజయవంతం చేసిన అధికారులు, సిబ్బంది, ఉత్సవ కమిటీ సభ్యులు, పారిశుద్ధ్య కార్మికులు, పోలీసులు, యువత, మీడియా ప్రతినిధులను కలెక్టర్ అభినందించారు. భవిష్యత్‌లో మంగినపూడి బీచ్‌ను మరింత అభివృద్ధి చేసి ప్రపంచ పర్యాటక పటంలో మచిలీపట్నానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడానికి సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు.

# రైతన్నలు సాంకేతికను అందిపుచ్చుకోవాలి

❖ రైతన్నల మోముల్లో సంక్షేమాభివృద్దే ప్రభుత్వ ధ్యేయం ❖ కిషాన్ మేళాలతో రైతులకు అధిక ప్రయోజనాలు ❖ రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి





ప్రజాభూమి ప్రతినిధి, రంపచోడవరం

మన దేశానికి రైతే వెన్ను ముకని, రైతన్నలు పొలంలో చెమట చిందిస్తేనే ప్రతి ఇంట్లో అన్నం పుడుతుందని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. అడ్డతీగల మండలం కేంద్రంలోని శ్రీ సాయి సన్నిధి కళ్యాణ మండపంలో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారి SJV రామ్మోహనరావు అధ్యక్షతన కిషాన్ మేళా-2026 సమావేశం నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి, వందేమాతరం గీతాలపంతో సమావేశాన్ని ప్రారంభించారు. సమావేశానికి హాజరైన ఆమెకు వ్యవసాయ శాఖ సిబ్బంది సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతు సంక్షేమం అంటే కేవలం రైతు కుటుంబం సంక్షేమం కాదని అది సమాజం, రాష్ట్రం, దేశం సంక్షేమంగా భావించాల న్నారు. రైతు అభివృద్ధి చెందాలంటే వ్యవసాయం కూడా ఆధుని కంగా మారాలన్నారు. వ్యవసాయ ఆధునీకరణ, సాంకేతికను రైతన్నలు అందిపుచ్చు కోవాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందించే అన్నదాత సుఖీభవ, PM కిషన్ పథకం ద్వారా వేలాది మంది రైతులకు సుమారు 28 కోట్ల రూపాయలు అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రస్తు త తరుణంలో వ్యవసాయంలో సాంకేతికత ఎంతో కీలకంగా మారిందన్నారు. డ్రిప్ ఇరిగేషన్, ఆధునిక వ్యవసాయ యంత్రాలు, మట్టి పరీక్షలు, నాణ్యమైన విత్తనాలు, శాస్త్రీయ పద్ధతుల్లో ఎరువుల వినియో గం వంటి అంశాలను రైతులు అందిపుచ్చుకో వాలన్నారు. అదేవిధంగా నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నీరు ఉంటేనే వ్యవసాయం ఉంటుందన్నారు. వర్షపు నీటిని సంరక్షించడం, సూక్ష్మ నీటిపారుదల పద్ధతులను ఉపయోగించడం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ దిగుబడిని సాధించవచ్చని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వం ద్వారా అందించే పలు రకాల రాయితీలపై గణాంకాలతో సహా క్షుణ్ణంగా వివరించారు.

**మిశ్రమ,బహుళార్థ పంట ల సాగుపై దృష్టి పెట్టాలి..** రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా పంటల వైవిధ్యీకరణపై దృష్టి పెట్టాలన్నారు.చిరు ధాన్యాలు, పప్పుధాన్యాలు, ఉద్యాన పంటలు, వాణిజ్య పంటలు, విలువ ఆధారిత వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా అదనపు ఆదాయాన్ని పొందే అవకాశాలను క్షుణ్ణంగా వివరించారు.రైతులు పండించిన పంటకు సరైన ధర రావడం కూడా అంతే ముఖ్యమన్నారు. ఉత్పత్తి పెంచడం మాత్రమే కాదు. మార్కెట్ ను కూడా రైతు దృష్టిలో పెట్టుకో వాలని సూచించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, మార్కెటింగ్ వ్యవస్థలు, నిల్వ సదు పాయాలు, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాలను రైతులు ఉపయోగించు కోవాలని సూచించారు.

**పంటల భీమాపై రైతులు ప్రత్యేక దృష్టి కేటాయించాలి...** ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావం, వరదలు, తెగుళ్లు వంటి కారణాలతో రైతులు నష్టపోయే పరిస్థితులు ఉన్ననందున ప్రతీ రైతూ పంటల భీమాపై పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలన్నారు. రైతుల కోసం కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, పంటల బీమా, ప్రభుత్వ సహాయం, వ్యవసాయ శాఖ అందించే సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యాన వన, వ్యవసాయశాఖ, పశు సంవర్ధకశాఖ, డ్రిప్ ఇరిగేషన్, ప్రకృతి వ్యవసాయం శాఖల వారు ఏర్పాటు చేసిన స్టాల్స్ పరిశీలించిన ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు.

**సేంద్రియ వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి..** ప్రస్తుతం నవీనకాలంలో రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించాలని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగం పెంచుకోవాల న్నారు. సేంద్రియ పంటలకు మార్కె ట్లో విపరీతమైన గిరాకీ ఉందన్నారు. తద్వారా రైతులకు అధిక ఆర్థికాభి వృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. దీనిని ముఖ్యంగా యువత ఒక చిన్నపాటి పరిశ్రమలుగా మార్చుకోవాలని సూచించారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుంటూ వ్యవసాయాన్ని ఒక మంచి వ్యాపార వనరుగా మార్చు కోవాల న్నారు. వ్యవసా యంతో పాటు పశుపోషణ, ఉద్యానవనం, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి అనుబంధ రంగాలపై మరియు మత్స్య సంపదపై కూడా దృష్టి పెట్టాలన్నారు. రైతులకు బ్యాంకుల ద్వారా అందించే రాయితీ రుణాలపై చైతన్యం చేశారు. సోలార్ పెన్సింగ్ కోసం కూడా ప్రవేశపెట్టే రాయితీలపై వివరించారు. బ్యాంక్, సొసైటీల ద్వారా కూడా రైతులకు రుణాలు సకాలంలో అందేలా కృషి చేస్తామని భరోసా కల్పించారు. రైతులు రిజిస్ట్రేషన్ పై రైతులు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వం ద్వారా అందే ప్రతీ రాయితీలు పొందాలంటే రిజిస్ట్రేషన్ ముఖ్యమన్నారు. దీనిపై అధికార యంత్రాంగం రైతులను చైతన్యం చేయాలన్నారు. అధికార యంత్రాంగం సక్రమంగా పనిచేయక పోతే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్నారు. కాబట్టి యంత్రాంగం రైతుల బాగోగుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా పనిచేయాలన్నారు.

రైతులు కూడా ఏదై నా సహాయం కావాలంటే ముందుగా గ్రామ స్థాయిలో ఉండే సిబ్బందితో సంప్రదించి తద్వా రా పరిష్కారం కాకపోతే ఉన్నతాధికారుల దృష్టి లో పెట్టాలన్నారు. అక్కడ కూడా పరిష్కారం కాకపోతే నేరుగా తన దృష్టిలో పెడితే పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. రైతుల కోసం పలు రకాల పంటల పై చైతన్యం అవగాహన కోసం వ్యవ సాయ శాఖ అధికారులే రైతులను ఆయా కేంద్రాలకు తరలించి మంచి అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశించారు.

**కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తల కృషి అమోఘం..** కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రవేత్తల పరిశోధనలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా గత సంవత్సరంలో సాధించిన పరిశోధనలపై క్షుణ్ణంగా వివరించారు. ఆయా కేంద్రం ద్వారా సాధించిన పరిశీలన ఫలితాలపై అవగాహన కల్పించారు, ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల రీత్యా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పై అవగాహన కల్పించారు. అలాగే రైతన్నల అడిగిన పలు సందేహాలకు సలహాలు, సూచనలు అందించారు. అలాగే పలు శాఖలకు చెందిన ప్రతినిధులు కార్యక్రమాన్ని ఉద్దేశించి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం అందించే రాయితీలపై వివరించి రైతులు సద్వినియోగ పరచుకోవాలని కోరారు. శాస్త్ర వేత్తలు సైతం గిరిజన ప్రాంతంలో ఆయా ప్రాంతాలను బట్టి అక్కడ అవసరమైన సాగులపై దృష్టి సారించాలని కోరారు. ఆయా పంటల సాగుకు రైతులను ప్రోత్సాహం అందించాలని కోరారు.

**ఉత్తమ రైతులకు సన్మాన పత్రాలు జ్ఞాపికలు అందజేత...** రైతులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఆకాంక్షించారు. కిసాన్ మేళా -2026 సదస్సులో జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన రైతులను ఆమె సన్మానించారు.

రైతులకు పలు రకాల విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో AMC చైర్మన్ లోతా లక్ష్మణరావు, మండల పార్టీ అధ్యక్షులు జర్తా వెంకట రమణ రెడ్డి, పల్లాల వెంకటరెడ్డి, రాష్ట్ర రైతు విభాగం ప్రతినిధి కనిగిరి రాంబాబు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఈరోజు స్వప్న కుమారి, PACS అధ్యక్షులు బి.హరిబాబు, పాము అర్జున్, ముప్పన కేశవ్, మాజీ ఎంపీపీలు గొర్లె శ్రీకాంత్, తీగల ప్రభ, జిల్లా వ్యవసాయ అధికారి SJV రామ్మోహన రావు, అడ్డతీగల వ్యవసాయశాఖ ADA సావిత్రి, ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి రాబిన్ సుదర్శన్, ఆత్మ PD కంభం రాబర్ట్ పాల్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు గోవర్ధన్ రావు, శ్రీనివాస్ , జిల్లా ఉద్యానశాఖ అధికారి , జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవి, నరేంద్ర కుమార్, డ్రిప్ ఇరిగేషన్ ప్రతినిధి APMIP, DMIO దేవదానం , జి.సత్తిబాబు రంప చోడవరం డివిజన్ గల వ్యవసాయ అధికారులు శ్రీనివాస్, HRS శాస్త్రవేత్త ఉషకుమారి, మమత, వ్యవసాయ అధికారులు కింటుకూరి లక్ష్మణరావు, బ్యాంక్ విభాగం మేనేజర్ ప్రదీప్, జనసేన మండల నాయకులు జయరాం, అరకు పార్లమెంట్ మహిళ విభాగం నాయకులు యెర్రంశెట్టి రత్నకుమారి, క్లస్టర్ ఇంచార్జి యేసుబాబు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు ఎడ్ల శ్రీనివాస్, అడారి నాగబాబు, మాజీ ఎంపీటీసీ ఆదిలక్ష్మి, బుల్లియమ్మ, తెదేపా నాయకులు గణజాల తాతారావు, బూత్ ఇంచార్జిలు అన్నం అబ్బాయి రెడ్డి, దాని శివకుమార్ స్వర్ణలత, చెక్క అప్పారావు, సత్యవేణి , మద్దాల మధన్ మోహన్, బాపనమ్మ, AMC డైరెక్టర్లు గీతాదేవి , జనసేన మహిళా నాయకులు పాతర సీతామహాలక్ష్మి , కూటమి నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.



## సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించిన ఎస్ఐ బొడ్డు రామకృష్ణ

ప్రజాభూమి ప్రతినిధి కూనవరం

మండలంలోని జగ్గవరం పంచాయతీ పరిధిలో జగ్గవరం గ్రామంలో ప్రజలకు సైబర్ నేరాలపై ఎస్ఐ బొడ్డు రామకృష్ణ అవగాహన కల్పించడం జరిగింది వివరాల్లోకి వెళితే దేశంలో సైబర్ నేరాలు అధికమవుతున్నాయని కావున సైబర్ నేరాలపై మీరు జాగ్రత్తగా ఉండాలని మీకు ఎవరైనా ఫోన్ ద్వారా మీ పిల్లలకి యాక్సిడెంట్ అయింది లేదా మీ కుటుంబ సభ్యులు ప్రమాదంలో ఉన్నారు అంటూ మీ వివరాలు సేకరించి మీ నెంబర్ కు ఓటిపి వచ్చింది చెప్పండి అని మిమ్మల్ని అడుగుతూ ఉంటారు అలాంటివారికి ఓటీపీ వివరాలు చెప్పకండి అలాగే మీకు కొన్ని బహుమతులు పంపిస్తున్నాము అంటూ మీకు లింకు ద్వారా మీ ఫోన్ కి పంపిస్తారు అవి ఓపెన్ చేయకండి అలాగే ఇంటింటికి తిరుగుతూ మీ వద్ద ఆధార్ కార్డు సేకరణ చేస్తూ మీ ఫోన్ నెంబర్ ద్వారా లింకును సేకరిస్తూ ఉంటారు అవి కూడా ఎవరికీ కూడా ఆధార్ కార్డులు ఇవ్వకండి అలాగే బ్యాంకు నెంబర్లు చెప్పకండి అలాగే మీ పిల్లలకి ఫోన్లు ఇచ్చే ముందు జాగ్రత్తగా ఉండండి పిల్లలు ఆటలో పడి సైబర్ నేరగాళ్ల వలలు పడతారు కావున పిల్లలకి ఫోన్లు దూరంగా ఉంచండి అలాగే పిల్లలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి పిల్లలకు పెద్దలు తెలియజేయాలి ఎవరైనా సరే



ఆడపిల్లలను ఎక్కడ ముట్టుకోవాలి ఎక్కడ ముట్టుకుంటే అది తప్పు అని పిల్లలకు తల్లిదండ్రులు అవగాహన కల్పించాలి ఆ అవగాహనలో పిల్లలు నేటి నుండే గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి తెలుసుకుంటారు అని ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

Printed by MOHANEESWAR PUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at West Godavari and published at D. No.11-12-124, Nawabpetcolony,3rd Division, Eluru editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1219.cell:9502116677.

# ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ప్రాధాన్యత అంశాలుపై అధికారులు దృష్టి సారించాలి

**జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి.**




ప్రజా భూమి బ్యూరో–ఏలూరు జిల్లా

ఏలూరు, జిల్లా కలెక్టరేటు గౌతమీ సమావేశమందిరంలో మంగళవారం బుధ వారం నిర్వహించబోయే జిల్లా సమీక్షా కమిటీ (డి ఆర్ సి) సమావేశం సందర్భంగా వివిధ శాఖలు అధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రి సెల్వి అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా కలెక్టరు తో పాటు జిల్లా జాయింటు కలెక్టరు డా.యం. జె.అభిషేక్ గౌడ లు పాల్గొన్నారు. అధికారులు పరస్పరం సమన్వయంతో పనిచేసి జిల్లా సమీక్షా కమిటీ సమావేశాన్ని విజయవంతం చెయ్యాలని ఆదేశించారు. ఎజెండా లో నిర్దేశించిన అంశాలపై నివేదికలను వేంటనే అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గత జిల్లా సమీక్షా కమిటీ యాక్షన్ టేకెన్ రిపోర్టు (కేటీఆర్) సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ రేపు జరగబోవు జిల్లా సమీక్షా కమిటీ ?సమావేశంలో గౌరవ జిల్లా ఇంచార్జి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, రాజ్యసభ సభ్యులు, పార్లమెంటు సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసనస భ్యులు పాల్గొంటారని అన్నారు. అభివృద్ధి, సంక్షేమతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత పలు అంశాలుపై విస్తృతంగా సమీక్షించను న్నారని తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయ అనుబంధ శాఖలు ప్రకృతి వ్యవసాయం ఉద్యానవన పంటలు, జిల్లాలో ప్రకృతి సేద్యం విస్తరణ, రైతులకు అందుతున్న ప్రోత్సాహకా లు, ఎదురవుతున్న ఇబ్బందులను, ఉద్యాన పంటలు సాగువిస్తీర్ణం ఀ దిగుబడులు. పీ–4 కార్యక్రమం పేదరిక నిర్మూలన దిశగా ప్రణాళిక అమలు తీరు, లబ్ధిదారులు ఎంపిక, ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన, ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటులో సాధించిన పురోగతి, ధరఖాస్తులు పరిష్కారం, ?రైతు సేవాకేంద్రాలు (ఆర్.ఎస్.కె) ద్వారా రైతులకు అందుతున్న ఎరువులు, విత్తనాలు పంపిణీ, ఈ–క్రాప్ నమోదు మరియు ఆర్బీకేలు పనితీరు, తదితర కీలక అంశాలుపై సంబంధిత శాఖలు ప్రగతిని జిల్లా ఇన్చార్జి మంత్రి సమీక్షిస్తారని వివరించారు. సమావేశంలో మంత్రివర్యులు లేదా ప్రజా ప్రతినిధులు అడిగే ప్రతి ప్రశ్నకు శాఖలు వారీగా ఖచ్చితమైన గణాంకాలు, నివేదికలతో స్పష్టమైన సమాధానాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి అలసత్వానికి తావులేకుండా, పూర్తి వివరాలతో కూడిన రికార్డులను వెంట తీసుకురావాలని జిల్లా కలెక్టరు స్పష్టం చేశారు. ప్రధానమంత్రి సూర్యఘర్ ప్రగతిపై స్టాల్స్ ఏర్పాటు చెయ్యాలని విద్యుత్తు శాఖ యస్ఇ ఆదేశించారు. ఇంచార్చ్ మంత్రి దగ్గరలో చూస్తాను అంటే సేంద్రియ వ్యవసాయంతో వ్యవసాయ, ఉద్యానవన శాఖ పంటలు చూసేలా గ్రామాన్ని ఎంపిక చేసుకుని సిద్ధం చేసుకోవాలని అన్నారు.ఈ సన్నాహక సమావేశంలో ఆర్‌డబి శాఖ యస్ఇ కె.విజయరత్నం, విద్యుత్తు శాఖ యస్ఇ అంబేద్కర్, సిపివో కె.శ్రీనివాసరావు, ఎపి యంఐపి పిడి యస్.రామ్మోహన్, నగర పాలక సంస్థ కమీషనరు ఏ.భానుప్రతాప్, వివిధ శాఖలు అధికారులు పాల్గొన్నారు.

## భారతీయ జ్ఞాన పరంపరపై పరిశోధనలకు ప్రాధాన్యం



ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి

భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖకు చెందిన భారతీయ జ్ఞాన పరంపర విభాగం జాతీయ సమన్వయకర్త, ఐఐటీ ఇండోర్ ప్రొఫెసర్ గంటి ఎస్. మూర్తి మంగళవారం ఎన్‌ఆర్‌ఐ యూనివర్సిటీని సందర్శించారు. ఈ సందర్భంగా అధ్యాపకులను ఉద్దేశించి 'భారతీయ జ్ఞాన పరంపరలో పరిశోధన–– అవకాశాలు' అంశంపై అవగాహన కల్పించారు. భారత ప్రాచీన జ్ఞాన సంపదను ఆధునిక శాస్త్ర, సాంకేతిక రంగాలతో అనుసంధానిస్తూ అంతరశాఖా పరిశోధనలు చేపట్టాలని సూచించారు. ఐకేఎస్ కేంద్రాలు, ఫెలోషిప్‌లు, ఇంటర్న్‌షిప్‌లు, పరిశోధనా గ్రాంట్లు, పాఠ్యాంశాల్లో ఐకేఎస్ అనుసంధానం, పాఠ్యపుస్తకాల రూపకల్పన, ధారా సిరీస్ సదస్సుల వంటి కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐ గ్రూప్ చైర్మన్ ఆర్. వెంకటరావు, వైస్ ఛాన్సలర్ కె.ఆర్.ఎస్. సంబశివరావు, ప్రో వైస్ ఛాన్సలర్లు నాగభాస్కర్, జి. సంబశివరావు, డీన్–అకాడమిక్స్ కె. సుబ్రహ్మణ్యం, డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం విశ్వవిద్యాలయ యాజమాన్యం తరఫున గంటి ఎస్. మూర్తిని సత్కరించారు.

## ఆర్జీయుకేటి నూజివీడు సంగీత విభాగ కార్యశాల మరియు వీణ కచేరీ

ప్రజాభూమి ప్రతినిధి–నూజివీడు

ఆర్జీయుకేటి నూజివీడు లలిత కళల విభాగం ఆధ్వర్యంలో "ఇంటర్ డిస్పనరి వర్క్ షాప్ మరియు వీణకచేరి" ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా విశాఖపట్నానికి చెందిన ప్రఖ్యాత ఆకాశవాణి (ఆలిండియా రేడియో) "ఏ" గ్రేడ్ (ఉన్నత శ్రేణి) వైణిక విద్వాంసులు , మరియు ఎం.డి (రేడియాల జీ), ప్రొఫెసర్ ఀ హెడ్ దయాగ్నోసిస్ డా. భమిడిపాటి కనకదుర్గా ప్రసాద్ చే మొదటి సెషన్లో మధ్యాహ్నము 3:30 గంటల నుండి 5 గంటల వరకు – సంగీతంలో (హ్యూమన్ రెసంబులెన్స్ టు వీణ యూజింగ్ సీటీ స్కాన్ ఇమేజింగ్ (హ్యూమన్ రీసెంబెలెన్స్ టూ వీణ ఉసింగ్ సీట్ స్కాన్ ఇమగెంగ్ ) అనే అంశంపై సంగీత ఉపన్యాసం చేశారు. అనంతరం



రెండవ సెషన్లో వీణా వాదన కచేరి చేస్తూ కచేరి పద్ధతిపై సోదాహరణ ప్రసంగం చేశారు. ఆర్జీయుకేటి నూజివీడు ప్రాంగణ మృదంగ అధ్యాపకులు శ్రీధర్ మంగళగిరి మరియు ఆల్ ఇండియా రేడియో ఏ గ్రేడ్ విద్వాంసులు అద్భుతమైన సహకారం మరియు తన్యావర్తనం అందించారు. పి. కార్తీక్ తాళ సహకారం అందించారు. ఈ సంగీత కచేరీకి ఆంధ్రదేశంలో వీణ తయారీకి పేరు గాంచిన మన నూజివీడు నుండి షేక్ మహబూబ్ మాబు తయారు చేసినటువంటి సరికొత్త వీణను ఉపయోగించారు. ఈ కార్యక్రమం సంగీత విభాగం శాఖాధిపతి మరియు విభాగపు ఇతర అధ్యాపకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆర్జీయుకేటి ఇంచార్జ్ కులపతి మరియు ఉప కులపతి ఆచార్య మద్దాలి లక్ష్మీనారాయణ రావు, పరిపాలనాధికారి ఏవో డా. లక్ష్మణరావు, అకడమిక్ డీన్ డా. చిరంజీవి, మెకానికల్ ఇంజనీరింగ్ అధ్యాపకులు డా.పావని ఈ కార్యక్రమంలో పాల్గొని, ఆద్యంతం వీక్షించి రసాస్వాదన పొందారు. సంగీత విభాగపు అధ్యాపక, విద్యార్థి బృందాన్నిఅభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పట్టణంలో అభివృద్ధి పనులకు మంత్రి సుభాష్ శంకుస్థాపనలు

ప్రజాభూమి ప్రతినిధి–రామచంద్రపురం.

రామచంద్రపురం పట్టణంలోని పలు వార్డుల్లో రూ.26.73 లక్షల అంచనాతో చేపట్టనున్న సీసీ డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణ పనులకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శంకుస్థాపనలు చేశారు. ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్. ఆర్. రాజు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ గడిచిన రెండేళ్లలో రామచంద్రపురం పట్టణంలో సుమారు రూ.70 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. మంగళవారం పట్టణం, రూరల్ మండలంలో కలిపి



రూ.1.53 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని చెప్పారు.పట్టణంలో డ్రైనేజీ, రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలకు అవసరమైన పనులను దశలవారీగా చేపడుతున్నామని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సహకారంతో మరిన్ని నిధులు తీసుకొచ్చి రామచంద్రపురం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.రామచంద్రపురం మున్సిపాలిటీలో ఇటీవల కూడా రుడా గ్రాంట్ కింద వివిధ డ్రైనేజీ పనులకు టెండర్లు నమోదయ్యాయని మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు ఉండవెల్లి శివ ,కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అడ్డతీగల మండలంలో ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు

- **91 పాఠశాలలకు గాను 90 పాఠశాలల్లో కమిటీల ఎన్నిక**
- **కోరం లేక ఎల్లవరం ఉన్నత పాఠశాలలో ఎన్నిక వాయిదా**
- **ఎన్నికైన సభ్యులతో ప్రతిజ్ఞ చేయించిన ప్రధానోపాధ్యాయులు**

ప్రజా భూమి ప్రతినిధి–అడ్డతీగల

అడ్డతీగల మండలంలో మంగళవారం పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. మండలంలోని మొత్తం 91 పాఠశాలలకు గాను 90 పాఠశాలల్లో ఎన్నికలు విజయవంతంగా నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారి–2 పి.శ్రీనివాసరావు తెలిపారు. ప్రతి పాఠశాలలో చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు 13 మంది సభ్యులతో కూడిన 15 మంది కమిటీని



ఎన్నుకున్నారు.

**కోరం లేక ఎల్లవరంలో ఎన్నిక వాయిదా**

ఎల్లవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొత్తం 227 మంది విద్యార్థుల తల్లిదండ్రులకు గాను 76 మంది మాత్రమే ఎన్నికలకు హాజరయ్యారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన 50 శాతం కోరం లేకపోవడంతో ప్రధానోపాధ్యాయులు ఎన్నికను వాయిదా వేశారు. మిగిలిన పాఠశాలల్లో తల్లిదండ్రుల భాగస్వామ్యంతో కమిటీల ఎన్నికలు పూర్తయ్యాయి.

**నూతన కమిటీ సభ్యులతో ప్రతిజ్ఞ**

ఎన్నికల అనంతరం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నూతనంగా ఎన్నికైన ఎస్ఎంసీ సభ్యులతో సమావేశాలు నిర్వహించారు. పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాల మెరుగుదల, మౌలిక సదుపాయాల కల్పనలో కమిటీల పాత్రను వివరించారు. సభ్యులకు వారి విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు.

**అడ్డతీగల ఉన్నత పాఠశాల చైర్‌పర్సన్‌గా నక్క లోవకుమారి**

అడ్డతీగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్‌పర్సన్‌గా నక్క లోవకుమారి, వైస్ చైర్మన్‌గా కామన కృష్ణమూర్తి ఎన్నికయ్యారు. మండల విద్యాశాఖ అధికారి పి.శ్రీనివాసరావు అడ్డతీగల బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి ఎన్నికల నిర్వహణను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలవ్యాప్తంగా ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను అభినందించారు. ఎన్నికైన కమిటీ సభ్యులు పాఠశాలల అభివృద్ధికి బాధ్యతాయుతంగా కృషి చేయాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు, నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు.

## పల్లె పండగతోనే పల్లెల అభివృద్ధి = ఎమ్మెల్యే పులివర్తి నాని

**24 అభివృద్ధి పనులకు రూ. 3.39 కోట్లు మంజూరు.**



ప్రజా భూమి ప్రతినిధి–రామచంద్రాపురం

రాష్ట్రంలోని పల్లెల అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా పల్లె పండుగ 3.0 కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. మంగళవారం కమ్మపల్లి సమీపంలోని సిద్దేశ్వర ఎస్టి కాలనీ వద్ద అధికారులు, కూటమి నాయకులతో కలిసి సిసి రోడ్డు, బిటి రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పల్లెలోనూ మౌలిక వసతులు కల్పించడమే పల్లె పండుగ ముఖ్య ఉద్దేశం అన్నారు. కూటమి ప్రభుత్వం వేలకోట్ల నిధులతో పల్లెల అభివృద్ధికి శ్రీకారం చుట్టిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం హయం లోని గ్రామీణాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. మండలంలో 24 అభివృద్ధి పనులకు గాను రూ.3.39 కోట్లు నిధులు మంజూరైనట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి ఎం ఎస్ ఎం ఈ డైరెక్టర్ చినబాబు, నాయకులు ఆరి లీలామోహన్ నాయుడు నీలకంఠ చౌదరి, కేశవుల నాయుడు, సురేష్, ముని చంద్ర నాయుడు, పూజారి సుబ్రహ్మణ్యం, కే మధుసూదన్ రెడ్డి, చేకూరు వెంకట ప్రసాద్, ప్రత్యేక అధికారిణి గంగాభవాని, డ్వామా పిడి మద్దిలేటి, డి ఈ మురళి, ఎంపీడీవో పులిరాం సింగ్, తాహశీల్దార్ మధుసూదన్ రావు, డిప్యూటీ ఎంపీడీవోలు తేజోవతి, శ్రీనివాసులు, ఏపీవో సుజాత, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి

ఈదులగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు మంగళవారం ప్రధానోపాధ్యాయులు తాడి ప్రసాద్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా జరిగాయి. చైర్మన్‌గా గొరిపర్తి వెంకట కృష్ణ, వైస్ చైర్‌పర్సన్‌గా ముల్లంగి ప్రమీల ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. పాఠశాల అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని ప్రధానోపాధ్యాయులు తాడి ప్రసాద్ సూచిస్తూ నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.

## వెయిట్ లిఫ్టింగ్‌లో ఏలూరు ఘన చరిత్రను పునరావృతం చేయాలి



ఏలూరు

వెయిట్ లిఫ్టింగ్ క్రీడలో ఏలూరుకు ఉన్న ఘన చరిత్రను పునరావృతం చేసేలా క్రీడాకారులు ప్రతిభ కనబరచాలని జిల్లా టీడీపీ అధ్యక్షులు,ఎమ్మెల్యే బడేటి చంటి ఆకాంక్షించారు.స్థానిక ఇండోర్ స్టేడియంలోని వెయిట్ లిఫ్టింగ్ ట్రైనింగ్ సెంటర్‌లో మంగళవారం అస్మిత ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ జూనియర్స్,సబ్ జూనియర్స్ డిస్ట్రిక్ట్ లీగ్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు.జ్యోతి ప్రజ్వలన,రిబ్బన్ కటింగ్ అనంతరం స్వయంగా వెయిట్ లిఫ్టింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచి,కోచ్‌లను సత్కరించారు.ఈ సందర్భంగా బడేటి చంటి మాట్లాడుతూ.. క్రీడలను ప్రోత్సహించడంతో పాటు అట్టడుగు స్థాయి నుంచి ప్రతిభను వెలికితీసేందుకు కేంద్ర ప్రభుత్వం ఖేలో ఇండియా కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు.కార్యక్రమంలో ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బడేటి వెంకట్రామయ్య,ఏఎంసీ ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి,ఈడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, సెట్‌వెల్ సీఈవో కె.ఎస్. ప్రభాకర్,శాయ్ డిప్యూటీ డైరెక్టర్ గుర్నమ్ సింగ్ పాల్గొన్నారు.

### ముసునూరు పాఠశాల భవన పునర్నిర్మాణానికి పూర్వ విద్యార్థి కుటుంబం సహకారం

ప్రజాభూమి ప్రతినిధి–నూజివీడు



ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం పరిధిలోని ముసునూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధిలో భాగంగా పాత భవనాన్ని పునర్నిర్మించి నూతన రూపాన్ని తీసుకొచ్చారు.పాఠశాల పూర్వ విద్యార్థి అట్లూరి బంగారి కుటుంబానికి చెందిన రాజశేఖరరావు, అట్లూరి సీతాదేవి కుటుంబ సభ్యుల సహకారంతో భవన పునర్నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అట్లూరి వెంకట శ్రీనివాస్, శ్రీమతి సౌజన్య దంపతులు తమ వంతు సహకారం అందించారు. సుమారు రూ.5 లక్షల వ్యయంతో పాఠశాల భవన పునర్నిర్మాణ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధికి సహకరించిన దాతలకు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చి సహకరించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దేవినేని ప్రసాద్, దేవినేని శ్రీధర్, దేవినేని భద్రం, తుమ్మల లక్ష్మణరావు, పులివెందుల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన విద్యా కమిటీ ఎన్నికలు




ప్రజాభూమి ప్రతినిధి–కుక్కునూరు

కుక్కునూరు మండల పరిధిలో ఉన్న 65 ప్రభుత్వ పాఠశాలలో విద్యా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి .మండల పరిధిలోని మొత్తం 65 ప్రభుత్వ పాఠశాలలో నిబంధనల మేరకు ఎన్నికల ప్రక్రియను అధికారులు నిర్వహించారు. ఇందులో భాగంగా పోలీస్ పర్యవేక్షణలో ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించారు. తల్లిదండ్రులు, సంరక్షకులు ఈ ఎన్నికల్లో పాల్గొని తమ ప్రతినిధులను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలు ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా అధికారులు మందస్తు చర్యలు చేపట్టారు. ఎన్నికల సందర్భంగా ఆయా పాఠశాలల వద్ద పోలీస్ అధికారుల సహకారంతో బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు గిరి భగవాన్ దాస్, ధనలక్ష్మి ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు, సర్కిల్ ఇన్స్పెక్టర్ బాల సురేష్ , ఎస్సై రాజారెడ్డి, పోలీస్ సిబ్బంది సమన్వయంతో ఎన్నికల నిర్వహణను ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేసి ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఎన్నికలు పూర్తి చేసినట్లు విద్యాశాఖ అధికారి తెలిపారు.

## నా స్థలం ప్రభుత్వ భూమి కాదు.. న్యాయం చేసి రక్షణ కల్పించండి



ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి

ఆగిరిపల్లి పంచాయతీ కార్యాలయం సమీపంలోని తన స్థలాన్ని అధికారులు ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ తాళాలు వేయడం, మంత్రి కొలుసు పార్థసారథి సమక్షంలో గత శుక్రవారం తాళాలు పగలగొట్టడం సరికాదని మాదల సునీత ఆరోపించారు. మంగళవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, 1942 నుంచి తమకు సంబంధించిన లింక్ పత్రాలు ఉన్నాయని, 2024 నుంచి అధికారులు తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. తన స్థలంలోకి ఓ వ్యక్తి దౌర్జన్యంగా ప్రవేశించి కులం పేరుతో దూషించాడని, తనకు ప్రాణభయం ఉన్నందున రక్షణ కల్పించాలని కోరారు. తన వద్ద ఉన్న పత్రాలతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని, అవసరమైతే భువనేశ్వరికి సమాచారం ఇచ్చి న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానన్నారు. పి–4 పథకం కింద అర్హత లేని కుటుంబానికి భూమి కేటాయించారని, అదే సామాజిక వర్గానికి చెందిన పలువురు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. తాను మూడు కుటుంబాలను ఆదుకుంటూ వారి పిల్లల విద్య, వసతి ఫీజులు చెల్లిస్తున్నట్లు తెలిపారు. దీనిపై తహసీల్దార్ పీఎన్‌వీ ప్రసాద్ వివరణ ఇస్తూ, స్థానిక 83/1 సర్వే నంబరులోని మొత్తం ఏడు ఎకరాల్లో మాదల వెంకటప్పయ్యకు ఒక ఎకరం భూమిని సెటిల్‌మెంట్ కింద కేటాయించామని, మిగిలిన ఆరు ఎకరాల్లో 5.65 ఎకరాల్లో ఇళ్లు నిర్మించుకున్నారని, మరో 35 సెంట్లు భూమి మిగిలి ఉందని తెలిపారు. మాదల సునీతకు ఆ భూమిపై ఎలాంటి హక్కు లేదని, అది ప్రభుత్వ భూమేనని స్పష్టం చేశారు.

## పల్లె పండుగతో గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎంపీడీవో అబ్దుల్ సలాం తెలిపారు. మంగళవారం ఆగిరిపల్లి మండలం శోభనాపురం ఎస్సీ పేటలో క్యాటిల్ షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం బొద్దనపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి దశలవారీగా చేపడుతున్నామని, పల్లె పండుగ ద్వారా గ్రామాలకు మరింత మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## ఆగిరిపల్లి జడ్పీ పాఠశాలలో నూతన ఎస్ఎంసీ ఎన్నిక



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

జడ్పీహెచ్ఎస్ ఆగిరిపల్లిలో మంగళవారం నూతన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రధానోపాధ్యాయురాలు పి. పుష్పలత, మండల విద్యాభివృద్ధి అధికారి కె. ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్ఎంసీ చైర్మన్‌గా ఎస్. లక్ష్మణరావు, వైస్‌చైర్మన్‌గా బి. స్రవంతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం సభ్యులు తల్లిదండ్రుల ప్రతిజ్ఞ చేశారు. పాఠశాల అభివృద్ధికి సమాజ భాగస్వామ్యం అవసరమని చైర్మన్ ఎస్. లక్ష్మణరావు తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు ఉపయోగపడే స్ఫూర్తి అధ్యయన సామగ్రిని ఎస్ఎంసీ చైర్మన్, వైస్‌చైర్మన్, గ్రామ ప్రముఖుల చేతుల మీదుగా అందించారు.

## దుగుమర్రిలో విద్యా కమిటీ ఎన్నికపై వివాదం



ప్రజా భూమి ప్రతినిధి-నార్పల

దుగుమర్రి గ్రామపంచాయతీ పరిధిలోని పాఠశాలలో విద్యా కమిటీ ఎన్నికల సందర్భంగా వివాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. టీడీపీ అభ్యర్థికి చైర్మన్ పదవి దక్కే పరిస్థితి లేకపోవడంతో హెడ్‌మాస్టర్‌పై ఒత్తిడి తెచ్చి ఎన్నికను వాయిదా వేయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పాఠశాలలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నట్లు తెలుస్తోంది. ఘటనపై విద్యాశాఖ అధికారులు స్పందించి, ఎన్నిక వాయిదా వేయడానికి గల కారణాలను స్పష్టం చేయాలని పలువురు కోరుతున్నారు.

## వాహనాల తనిఖీలు.. ఈ-చలాన్ల విధింపు

**హెల్మెట్ ధరించాలి.. మైనర్లు వాహనాలు నడపొద్దు**

**సీఐ టి. నరసింహులు**

ప్రజా భూమి ప్రతినిధి-వేంపల్లె



స్థానిక పట్టణంలోని గండి రోడ్డులో వాహనాల తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు ఈ-చలాన్లు విధించినట్లు సీఐ టి. నరసింహులు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు చెల్లుబాటు అయ్యే ఇన్సూరెన్స్ ఉండాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు, వాహన యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వాహనం నడిపే సమయంలో డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ నరసింహులు తెలిపారు.

## ఈదర జెడ్పీ హైస్కూల్ ఎస్ఎంసీ ఎన్నికల్లో అయ్యంకి లక్ష్మికి అత్యధిక ఓట్లు




ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఈదర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు సందిపాము శారద ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో అయ్యంకి లక్ష్మికి 46 ఓట్లు, గోళ్ల ఏడుకొండలకు 44 ఓట్లు లభించాయి. చైర్మన్‌గా గోళ్ల ఏడుకొండలు, వైస్‌చైర్మన్‌గా అయ్యంకి లక్ష్మి ఎంపికయ్యారు. పాఠశాల అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలని ప్రధానోపాధ్యాయురాలు సందిపాము శారద సూచించారు. ఉపాధ్యాయులతో సమన్వయంతో పనిచేసి విద్యార్థుల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని సామాజిక కార్యకర్త అయ్యంకి సురేష్‌బాబు కోరారు.

# చంద్రబాబు చేసినది పట్టాభిషేకం కాదు.. రక్తాభిషేకం

- స్థానిక ఎన్నికల కోసమే బాబు ఈవెంట్ల బిల్డప్
- అప్పుల్లో రాష్ట్రాన్ని ముంచి కూడా సెల్ఫ్ క్యాంపెయిన్ చేసుకోవడం చంద్రబాబుకు సిగ్గుచేటు
- ముఖ్యమంత్రి దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనం
- పల్లె పండుగ అంటే గుర్తొచ్చేది జగన్ పాలన
- ఆయన హయాంలోనే పల్లెలకు కాంతులు
- లేని హైప్ ఉన్నట్లు క్రియేట్ చేసి మాయచేయడం బాబుకు వెన్నతో పెట్టిన విద్య
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి-నెల్లూరు

చంద్రబాబు నాయుడు నెల్లూరు జిల్లాలో ఇవాళ చేసినది పట్టాభిషేకం కాదు.. రక్తాభిషేకం అని వైఎస్సార్ సీపీ మాజీ మంత్రి, నెల్లూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి ఎద్దేవా చేసారు. డ్రగ్స్, గంజాయి, మద్యం వంటి మాదక ద్రవ్యాల ప్రభావంతో యువత తీవ్రంగా నష్టపోతున్నారని కాకాణి ఆందోళన వ్యక్తం చేశారు. యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మాదక ద్రవ్యాల ప్రభావంతో యువత రక్తాన్ని పీల్చుకు తాగుతోందని తీవ్ర ఆగ్రహించారు. నెల్లూరు జిల్లాలోని పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలకు ఎవరు ఏం చేశారో తెలుసని, కేవలం ప్రచార కార్యక్రమాలతో వాస్తవాలను మార్చలేరని కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆక్షేపించారు. చంద్రబాబు ఏమీ చేయకపోయినా సరే అన్నీ తానే చేసినట్లు ప్రచారం చేసుకునేందుకే ఆర్భాటంగా ఈవెంట్లు నిర్వహిస్తూ బిల్డప్ ఇస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల్లో భాగంగా కేంద్ర నిధులతో చేసే పనులకు సైతం చంద్రబాబు తానే చేస్తున్నట్లుగా సెల్ఫ్ క్యాంపెయిన్ చేసుకుతిరగడం సిగ్గు చేటని మండిపడ్డారు. పల్లె పండగ పేరుతో చంద్రబాబు ప్రభుత్వం మరోసారి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని ధ్వజమెత్తారు. నెల్లూరులో నిర్వహించిన పట్టాభిషేకం అభివృద్ధి కార్యక్రమం కాదని, కేవలం ప్రచార ఆర్భాటమేనని కాకాణి విమర్శించారు. ఉపాధి హామీ పథకం కింద సాధారణంగా చేపట్టే పనులకు భారీగా ప్రచారం కల్పిస్తూ, కొత్తగా ఏదో సాధించినట్లుగా చెప్పుకోవడం చంద్రబాబు దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనమని ఎద్దేవా చేసారు. ఈ ప్రెస్ మీట్లో ఇంకా ఆయన ఏం మాట్లారంటే.."రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారం చేపట్టినా సరే కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు సహజంగానే సాగుతుటాయి. సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, పంచాయతీ భవనాలు, రచ్చబండలు, ఉద్యానవన పంటల ప్రోత్సాహం వంటి కార్యక్రమాలు కొత్తవి కావు. కేంద్ర ప్రభుత్వాల నిధులతో చేపట్టే ఉపాధి హామీ పనులకు భారీ ఈవెంట్ల పేరుతో రాజకీయ రంగు పులుముడం సరికాదు. ప్రజా సంక్షేమం కంటే ఈవెంట్లు, ప్రచార కార్యక్రమాలపైనే ప్రభుత్వానికి ఎక్కువ ఆసక్తి ఉండటం ప్రజల దురదృష్టం. గత ప్రభుత్వాల పనులకు క్రెడిట్ తీసుకోవం చంద్రబాబుకు అలవాటుగా మారింది. వెలుగొండ ప్రాజెక్టులో వైఎస్సార్ హయాంలోనే సుమారు 80 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను జగన్ ప్రభుత్వం పూర్తి చేసింది. గత ప్రభుత్వాలు చేసిన అభివృద్ధి పనులకు కూడా తానే కారణమన్నట్లుగా చంద్రబాబు ప్రచారం చేసుకోవడం గోబెల్స్ కు సైతం మైండ్ పోతోంది. గతంలో సీ ప్లేన్ ప్రాజెక్టు పేరుతో చేసిన ప్రచారం ఏమైందో ప్రజలకు చంద్రబాబు వివరించాలి. గోదావరి జలాలను అనకాపల్లికి తరలించే విషయంలోనూ ఇప్పటికే ఉన్న వ్యవస్థల పరిధిలోనే అమలు చేస్తున్నారు. దానికే చంద్రబాబు పెద్ద పెద్దగా బిల్డప్ ఇస్తూ హైప్ క్రియేట్ చేసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే. 'పల్లె పండగ అంటే జగన్ హయాంలోనే.. చంద్రబాబు హయాంలో పల్లెలకు చేసినది ఏముంది?' స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలోనే 'పల్లె పండగ-3' పేరుతో భారీ ఈవెంట్ నిర్వహిస్తున్నారు. ఎన్నికల వేళ ప్రజలను మభ్య పెట్టేందుకే వరుసగా వివిధ కార్యక్రమాల పేరుతో ఈవెంట్లు నిర్వహిస్తూ ప్రభుత్వం ప్రచార ఆర్భాటం చేస్తున్నారు. సూపర్ సిక్స్ హామీల అమలుపై ప్రజలు ప్రశ్నిస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పడం లేదు. నిరుద్యోగ భృతి, గ్యాస్ సిలిండర్లు తదితర హామీల అమలుపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలి. రాష్ట్రానికి రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని ప్రభుత్వం చెబుతోందని, అయితే ఆ పెట్టుబడులు ఎక్కడ వచ్చాయి, ఏ సంస్థలు పెట్టుబడులు పెట్టాయి, ఎన్ని ఉద్యోగాలు కల్పించారో ప్రభుత్వం వివరాలు వెల్లడించాలని కాకాని డిమాండ్ చేశారు.

# సంక్షేమానికి-సంక్షోభానికి వ్యత్యాసం చూడండి... మంచికి అండగా నిలవండి

- మాది పేదలకు పట్టాభిషేకం... వాళ్లది విధ్వంసంతో రక్తాభిషేకం
- ప్రధాని మోదీ సహకారం... నా అనుభవం... పవన్ హుషారుతో రాష్ట్రాభివృద్ధి
- నాడు వందల కిలో మీటర్లు... నేడు వేల కిలో మీటర్లలో సీసీ రోడ్ల నిర్మాణం
- 2024 కంటే కూటమికి ఆదరణ పెరిగింది... స్థానిక ఎన్నికల్లోనూ కూటమిదే హవా
- ఉదయగిరి సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు



ప్రజాభూమి ప్రతినిధి-ఉదయగిరి

కూటమి ప్రభుత్వం పేదలకు పట్టాభిషేకం చేస్తుంటే.. మరోవైపు కొందరు విధ్వంసంతో రక్తాభిషేకం చేస్తామంటున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. నాటి విధ్వంసానికి, నేటి వికాసానికి.. నాటి సంక్షోభానికి, నేటి సంక్షేమానికి మధ్య ఉన్న తేడాను ప్రజలు గమనించాలని పిలుపునిచ్చారు. రాజకీయాలను నేరమయం చేసేవారెవరో, రాజకీయాలతో ప్రజల జీవితాలను మార్చే వారెవరో ప్రజలు గమనించాలని అన్నారు. అభివృద్ధికి అడ్డొస్తే ఎంతమాత్రం ఉపేక్షించబోమని, మంచికి మద్దతుగా నిలవాలని సీఎం చంద్రబాబు కోరారు. పల్లె పండుగ-3.0 కార్యక్రమం సందర్భంగా ఉదయగిరి నియోజకవర్గం, వరికుంటంపాడు మండలం, రామాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో గత ప్రభుత్వ తీరును ముఖ్యమంత్రి చంద్రబాబు ఎండగట్టారు. ఓటమి చెందిన తర్వాత కూడా వైసీపీ చేస్తున్న విధ్వంసాన్ని... కుట్రలను సభికులకు వివరించారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని గుర్తించడంతో పాటు... వాళ్ల కుట్రలను కూడా గమనించాలని సూచించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... 2024 ఎన్నికలకు ముందు కూటమిగా ఏర్పడి ప్రధాని నరేంద్ర మోదీ, తాను, పవన్ కళ్యాణ్ ప్రజల ముందుకు వచ్చామని, రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని, అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చామని చెప్పారు. ప్రజలు ఎన్నడూ ఇవ్వనంత మెజార్టీని 2024 ఎన్నికల్లో కూటమికి అందించారని, 94 శాతం స్ట్రైక్‌రేట్‌తో చరిత్ర సృష్టించారని తెలిపారు. నాడు ప్రజలు అద్భుతమైన గెలుపును అందిస్తూ చేసిన విజయధ్వానాలు ఇప్పటికీ తమ చెవుల్లో మార్మోగుతూనే ఉన్నాయని అన్నారు. 2024 ఎన్నికల నాటి కంటే ఇప్పుడు ఎన్డీఏ హవా మరింత పెరిగిందని చంద్రబాబు అన్నారు. స్థానిక ఎన్నికల్లో కూటమిని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ప్రధాని మోదీ అందిస్తున్న కేంద్ర సహకారంతో తన అనుభవం, పవన్ కళ్యాణ్ హుషారుతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

**నాడు పల్లెలు కన్నీళ్లు పెట్టుకున్నాయి...**

గత ప్రభుత్వం చేసిన విధ్వంసంతో నాడు పల్లెలు కన్నీళ్లు పెట్టుకున్నాయని సీఎం విమర్శించారు. నాడు ఎక్కడ చూసినా గుంతలు, వీధి దీపాల కొరత, కనీసం బ్లీచింగ్ పౌడర్ వేసేందుకు కూడా నిధులు లేని పరిస్థితి ఉండేదన్నారు. ఆ దుస్థితి నుంచి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పల్లెలను అభివృద్ధి బాట పట్టించారని చెప్పారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో 880 కిలోమీటర్ల సీసీ రోడ్లు మాత్రమే వేస్తే.. కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే 6,500 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మించి చరిత్ర సృష్టించిందని తెలిపారు. నాడు ఖర్చు చేసిన డబ్బులు ప్రజలకు కనిపించలేదని, నేడు కళ్లకు కనిపించేలా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి సుమారు రూ.10 లక్షల కోట్ల అప్పుల భారాన్ని వారసత్వంగా స్వీకరించామని, ఖజానా ఖాళీగా ఉన్నప్పటికీ సంక్షేమ కార్యక్రమాలను ఆపలేదని చంద్రబాబు చెప్పారు. ఆర్థిక ఇబ్బందులున్నా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి సూపర్‌హిట్ చేశామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించిన సహకారం వల్ల రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లామని, వెంటిలేటర్‌పై ఉన్న ఏపీని ప్రధాని మోదీ ఆదుకున్నారని చెప్పారు. గత పాలకులు దెబ్బతీసిన ఏపీ బ్రాండ్‌ను తిరిగి పునరుద్ధరించామని చంద్రబాబు అన్నారు. గతంలో పారిశ్రామికవేత్తలను రాష్ట్రం నుంచి తరిమేసే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు పరిశ్రమలు రాష్ట్రానికి వస్తున్నాయని చెప్పారు. కొత్త పాలసీలు, సంస్కరణలు తీసుకొచ్చి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపు రాష్ట్రాన్ని తీసుకెళుతున్నామని తెలిపారు.

**అభివృద్ధిని అడ్డుకుంటే సహించం**

వెలిగొండ ప్రాజెక్టు విషయంలో గత ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని చంద్రబాబు అన్నారు. రూ.4 వేల కోట్ల పనులు పెండింగ్‌లో ఉండగానే వెలిగొండ ప్రాజెక్టుకు రిబ్బన్ కట్ చేశారని విమర్శించారు. వెలిగొండ ఫేజ్-2ను కూడా పూర్తి చేసి ఉదయగిరి నియోజకవర్గానికి నీళ్లు అందిస్తామని, మార్కాపురం జిల్లాను సస్యశ్యామలం చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ప్రజల జీవితాలను మార్చే పాలనకు, రాజకీయాలను నేరమయం చేసే విధానాలకు మధ్య తేడాను గమనించాలని కోరారు. పేదరికం లేని గ్రామాలను తీర్చిదిద్దడం, ఆర్థిక అసమానతలను తగ్గించడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. అభివృద్ధి ఫలాలు ప్రతి గ్రామానికి, ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్లే కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని చంద్రబాబు కోరారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని కొందరు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని... ఇక్కడుండేది నరేంద్ర మోదీ, సీబీఎన్, పవన్ కళ్యాణ్ అనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అభివృద్ధికి అడ్డొస్తే ఎంత మాత్రం ఉపేక్షించమని సీఎం చంద్రబాబు హెచ్చరించారు.

## ఉత్సాహంగా ఎన్టీఆర్ జిల్లా యువజనోత్సవాలు-2026

**కళా ప్రతిభను చాటిన 300 మంది యువతీ యువకులు**

**రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా విజేతలు ఎంపిక**



ప్రజాభూమి ప్రతినిధి-విజయవాడ

యువజన సర్వీసుల శాఖ, ఎన్టీఆర్ జిల్లా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు-2026ను విజయవాడలోని నలంద డిగ్రీ కళాశాలలో ఉత్సాహభరితంగా నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 300 మంది యువతీ యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ కళా నైపుణ్యాలను ప్రదర్శించారు. ఫోక్ డాన్స్ గ్రూప్, నుక్కడ్ నాటక్ (వీధి నాటకం), పెయింటింగ్, కవితా రచన తదితర విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను చాటారు. ఈ కార్యక్రమాన్ని యువజన సర్వీసుల శాఖ కమిషనర్ ఎస్. భరణి, ఐఎఫ్ఎస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతలోని సృజనాత్మకత, కళా ప్రతిభను వెలికితీసేందుకు యువజనోత్సవాలు చక్కని వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రానికి చెందిన యువత జాతీయ స్థాయిలో తమ ప్రతిభను ప్రదర్శించి మంచి ఫలితాలు, బహుమతులు సాధించాలని ఆకాంక్షించారు. వివిధ పోటీ విభాగాల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా స్థాయి పోటీల్లో విజయం సాధించిన యువతీ యువకులు నవంబర్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఉత్సవాల్లో పాల్గొంటారు.

## ఉద్యాన పంటల సాగుపై కళాజాత చైతన్య ప్రచార కార్యక్రమాలు

ప్రజాభూమి ప్రతినిధి-చిత్తూరు

రాయలసీమ ,ప్రకాశం, మార్కాపురం ప్రాంతాలను భారతదేశంలోనే అత్యంత కీలకమైన గ్లోబల్ హార్టికల్చర్ హబ్ గా (ప్రపంచ ఉద్యాన కేంద్రం) రూపాంతరం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అడుగులు వేస్తోంది.ఈ బృహత్తర ప్రాజెక్టు ప్రాముఖ్యతను, ప్రతిపాదిత ప్రణాళికలను ప్రజలు, రైతులు, యువతకు విస్తృతంగా అవగాహన కల్పించేందుకు రాష్ట్ర సమాచార మరియు పౌర సంబంధాలు శాఖ ఆధ్వర్యంలో ఉద్యాన శాఖ సమన్వయంతో కళాజాత బృందాల ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో క్షేత్రస్థాయి లో ప్రణాళిక బద్ధంగా రూపొందించిన ఆయా గ్రామాలలో ప్రజా చైతన్య అవగాహన కార్యక్రమాలు రోజువారీగా చేపట్టడం జరిగింది.జిల్లావ్యాప్తంగా సెప్టెంబర్ 30 నుండి అక్టోబర్ 9 వరకు ప్రతిరోజు సాయంత్రం ఉద్యాన శాఖ క్లస్టర్లలోని గ్రామాలలో కార్యక్రమాలు జరుగుతాయి. అందువల్ల ఈ ప్రచార అవగాహన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరడమైనది.ఈ నేపథ్యంలో జిల్లాలో హార్టికల్చర్ హబ్ అభివృద్ధి చెందే దిశగా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఉద్దేశంతో జిల్లాలోని అన్ని నియోజకవర్గ పరిధిలో ఆయా మండలాలలో ప్రతిరోజు రెండు గ్రామాలు చొప్పున కళాబృందాలు పర్యటించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉద్యానవన శాఖ డిడి గారు . మరియు సమాచార పౌర సంబంధాల శాఖ డిడి గారు సంయుక్తంగా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.



# ఆకాంక్ష జిల్లాల్లో కడప దేశంలోనే ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయం..!

### - రాష్ట్ర బిసి సంక్షేమ శాఖామంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్. సవిత

ప్రజాభూమి ప్రతినిధి,కడప: ఆకాంక్ష జిల్లాల కార్యక్రమంలో వైఎస్ఆర్ కడప జిల్లా వరుసగా మూడు త్రైమాసికాల్లో జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడం జిల్లా యంత్రాంగం సమష్టి కృషికి నిదర్శనమని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్. సవిత అభినందించారు. మంగళవారం కడప కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆధ్వర్యంలో, మంత్రి ఎస్. సవిత అధ్యక్షతన జిల్లా సమీక్షా కమిటీ సమావేశం జరిగింది. సమీక్షా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ లు కడప ఆర్. ఎమ్మెల్యే మాధవి రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే సి. ఆదినారాయణ రెడ్డి, ఎమ్మెల్సీ బి. రాంగోపాల్ రెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే ఎన్. వరదరాజుల రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ జయప్రకాష్, రాష్ట్ర ఫిషరీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రాంప్రసాద్, రాష్ట్ర షేక్స్ కార్పొరేషన్ చైర్మన్ ముక్తియార్, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు చైర్మన్ వి. రమేష్ నాయుడు తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులతో పాటు.. జేసీ డా. నిధీమీనా, రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన, డీఎఫ్ఓ గరుడ్ సంకేత్ సునీల్, డీఆర్వో మల్లికార్జునుడు, అన్ని రెవెన్యూ డివిజన్ల ఆర్డీవోలు, వివిధ శాఖల జిల్లా అధికారులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, వ్యవసాయం, సాగునీరు, తాగునీరు, విద్య, వైద్యం, మౌలిక వసతులు తదితర రంగాల్లో జరుగుతున్న పురోగతిపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలోని వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న పనులను శాఖల వారీగా సమీక్షించి, నిర్ణీత గడువులో పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఎస్. సవిత సూచించారు. రైతులు, విద్యార్థులు, మహిళలు, బలహీన వర్గాలు, పట్టణ, గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత మెరుగ్గా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్ వివరించారు. అనంతరం అజెండాలోని అంశాల వారీగా వివిధ శాఖల అధికారులు తమ శాఖల ప్రగతిని వివరించారు.

**ఆకాంక్ష జిల్లాల కార్యక్రమంలో అగ్రస్థానం..**

ఆకాంక్ష జిల్లాల కార్యక్రమంలో కడప జిల్లా వరుసగా మూడు త్రైమాసికాల్లో జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచినట్లు కలెక్టర్ వివరించారు. మార్చి 2026లో 80.06 కాంపోజిట్ స్కోర్ సాధించి అత్యధిక స్కోర్ నమోదైనట్లు తెలిపారు. జిల్లా అభివృద్ధిలో వివిధ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ నిర్దేశిత లక్ష్యాలను సాధిస్తున్నట్లు వివరించారు.

**స్మార్ట్ కిచెన్‌కు జాతీయ గుర్తింపు...**

పాఠశాల విద్యార్థులకు సురక్షితమైన, నాణ్యమైన, పోషకాహారాన్ని అందించేందుకు అమలు చేస్తున్న



స్మార్ట్ కిచెన్ కార్యక్రమం జిల్లాలో విస్తరిస్తోందని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం 36 స్మార్ట్ కిచెన్లు పనిచేస్తుండగా, మొత్తం 38 కిచెన్లను అక్టోబర్ 1 నాటికి అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. రోజుకు 73,698 మంది విద్యార్థులకు భోజనం అందిస్తున్నామని, ఇప్పటివరకు 38.29 లక్షలకు పైగా భోజనాలు అందించినట్లు తెలిపారు.

**వర్షాభావ పరిస్థితులపై ప్రత్యేక కార్యాచరణ..**

ఎల్‌నినో ప్రభావంతో నైరుతి రుతుపవనాల వర్షపాతం లోటు కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లాలో వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సెప్టెంబరు 28 నాటికి సాధారణ వర్షపాతం 395.4 మి.మీ.కు గాను 216.9 మి.మీ. మాత్రమే నమోదై 45.1 శాతం లోటు ఉన్నట్లు వివరించారు. జిల్లాలోని 40 మండలాల్లో 8 మండలాల్లో అత్యల్ప వర్షపాతం, 31 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైందని తెలిపారు. కలసపాడు మండలంలో 84.2 శాతం, రాజంపేటలో 69.1 శాతం వర్షపాతం లోటు ఉన్నట్లు వివరించారు. వర్షపాతం లోటు, సాగు విస్తీర్ణం తగ్గుదల, భూగర్భజలాల మట్టం పడిపోవడం, జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గడం వంటి అంశాల ఆధారంగా 37 మండలాలు నిర్దేశిత కరువు ప్రమాణాలను అందుకున్నాయని కలెక్టర్ తెలిపారు. వీటిలో 19 మండలాలు తీవ్ర, 18 మండలాలు మోస్తరు కరువు కేటగిరీల్లో ఉన్నట్లు వివరించారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని నందలూరు, వొంటిమిట్ట, సిద్దవటం మండలాలను కూడా చేర్చాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. మొత్తం 40 మండలాలను ఖరీఫ్-2026 కరువు ప్రభావిత మండలాలుగా పరిగణించాలని ప్రతిపాదన సమర్పించినట్లు వెల్లడించారు.

**జలాశయాలు, భూగర్భజలాలపై నిరంతర పర్యవేక్షణ...**

జిల్లాలోని ప్రధాన జలాశయాల్లో 82.214 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి గాను 38.216 టీఎంసీల నీరు, అంటే 46.48 శాతం నిల్వ ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇస్తూ నీటి విడుదలను సమన్వయంతో చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టెంబరు 28 నాటికి జిల్లాలో సగటు భూగర్భజల మట్టం 12.91 మీటర్లుగా నమోదైందని తెలిపారు. వేంపల్లిలో 48 మీటర్లు, పోరుమామిళ్లలో 28 మీటర్లు, పులివెందులలో 26.4 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉన్నట్లు వివరించారు. భూగర్భజలాలపై ఒత్తిడి ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**రైతులకు ప్రత్యామ్నాయ పంటలు.. విత్తనాల పంపిణీ...**

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సాగునీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఖరీఫ్‌లో మిగిలిన 13,114 హెక్టార్లలో ముందస్తు రబీ శనగ సాగుకు చర్యలు చేపడుతున్నామని, అదనంగా 10,663 క్వింటాళ్ల విత్తనాలను 35 శాతం రాయితీతో కేటాయించినట్లు వివరించారు. రైతులు పంట బీమా పథకంలో నమోదు చేసుకునేలా చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. సెప్టెంబరు 28 నాటికి సాధారణ సాగు విస్తీర్ణం 76,496 హెక్టార్లకు గాను 48,431 హెక్టార్లలో సాగు జరిగిందని తెలిపారు. ఇందులో వరి 23,636 హెక్టార్లు, వేరుశనగ 4,004 హెక్టార్లు, మినుములు 3,676 హెక్టార్లు, పత్తి 10,041 హెక్టార్లలో సాగైనట్లు వివరించారు.

**తాగునీరు, పశువుల రక్షణకు ముందస్తు చర్యలు..**

తాగునీటి వనరుల పరిరక్షణ, చెరువులు, కాలువల పునరుద్ధరణ, భూగర్భజలాల పునరుద్ధరణ పనులు, నీటి సంరక్షణకు ఉపాధిహామీ పనులను ప్రాధాన్యంతో చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. పశువులకు అవసరమైన పశుగ్రాసాన్ని అందుబాటులో ఉంచేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని, అవసరమైతే పశుగ్రాస కేంద్రాలు, పశువుల శిబిరాల ఏర్పాటుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. వర్షపాతం, జలాశయాల నీటి నిల్వలు, సాగు పురోగతి తదితర వివరాలతో రోజువారీ పరిస్థితి నివేదికను రూపొందించి జిల్లా యంత్రాంగానికి అందించాలని అధికారులను ఆదేశించారు.

**రోడ్లు, తాగునీటి పనులకు ప్రాధాన్యం**

రావులకొలను--ఇనగలూరు రహదారి పనులు పురోగతిలో ఉన్నాయని, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. పనిచేయని ఓవర్‌హెడ్ ట్యాంకులను వినియోగంలోకి తీసుకువచ్చి గ్రామాలకు తాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

**వైద్య సేవల విస్తరణ...**

చెన్నూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవనాన్ని అప్పగించి వైద్య సేవలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రొద్దుటూరు ఏరియా ఆసుపత్రిలో పారిశుధ్య కార్మికుల వేతనాల చెల్లింపుపై చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఆసుపత్రి నిర్మాణ పనుల్లో జాప్యాన్ని సమీక్షించి, పురోగతి సాధించకపోతే ఒప్పంద నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని కాంట్రాక్టర్‌కు స్పష్టం చేసినట్లు తెలిపారు.

**పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి..**

మైదుకూరు కస్టమ్ హైరింగ్ కేంద్రాలపై విజిలెన్స్ విచారణకు సిఫారసు చేసినట్లు అధికారులు తెలిపారు. మైదుకూరు మార్కెట్ కమిటీ కార్యదర్శిపై సస్పెన్షన్ చర్యలు తీసుకున్నట్లు వివరించారు. దిరసవంచ గ్రామంలో నిర్మాణ పనులకు సంబంధించిన నిధుల దుర్వినియోగ ఆరోపణలపై విచారణ, బాధ్యులపై చర్యలు, నిధుల రికవరీకి చర్యలు కొనసాగుతున్నట్లు తెలిపారు.

**స్టార్టప్‌లు, పెట్టుబడులకు ప్రోత్సాహం..**

యువతలో పారిశ్రామిక ఆలోచనలు, కొత్త వ్యాపారాలను ప్రోత్సహించేందుకు 'స్టార్టప్ కడప' ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కేంద్రాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పెట్టుబడిదారులకు ఒకే చోట అవసరమైన సేవలు అందించేందుకు 'ఇన్వెస్ట్ కడప' ద్వారా భూమి, అనుమతులు, ప్రాజెక్టు పురోగతి తదితర అంశాల్లో సహకారం అందిస్తున్నట్లు వివరించారు.

**గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు..**

మదనపల్లెలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆర్థిక మంత్రి పాల్గొననున్న గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రారంభ కార్యక్రమంలో జిల్లాలోని ఉద్యానవన క్లస్టర్ల భాగస్వామ్యం, రైతుల తరలింపు, రవాణా, భద్రతకు సంబంధించి సమగ్ర ప్రణాళిక రూపొందించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని 30 ఉద్యానవన క్లస్టర్ల నుంచి సుమారు 3,000 మంది రైతులు కార్యక్రమానికి హాజరుకానున్న నేపథ్యంలో ప్రతి క్లస్టర్ నుంచి రెండు బస్సుల చొప్పున ఏర్పాటు చేయాలని రవాణా అధికారులకు సూచించినట్లు తెలిపారు. రైతులను సురక్షితంగా కార్యక్రమ ప్రాంగణానికి తీసుకెళ్లడంతో పాటు తిరిగి స్వస్థలాలకు చేర్చే వరకు సంబంధిత అధికారులు పూర్తి బాధ్యతతో ప్రణాళికలు చేపట్టామన్నారు.

**శాఖల సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలు...**

జిల్లా సమగ్ర అభివృద్ధికి క్షేత్రస్థాయి పర్యవేక్షణ, శాఖల మధ్య సమన్వయం, పెండింగ్ సమస్యల వేగవంతమైన పరిష్కారం, ప్రజలకు మెరుగైన సేవలందించడమే ప్రధాన లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పనిచేస్తోందని కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తాగునీరు, వ్యవసాయం, పశువుల రక్షణకు ముందస్తు చర్యలు చేపడుతూనే దీర్ఘకాలిక నీటి సంరక్షణ చర్యలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు.

# రాజంపేట మున్సిపాలిటీకి త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేయాలి

### ఏకపక్ష నిర్ణయాలతో అభ్యర్థిని ఎంపిక చేస్తే పార్టీకి నష్టం - ఇన్‌చార్జి మంత్రికి సీనియర్ నాయకుడు కొమరా వెంకట నరసయ్య విజ్ఞప్తి

ప్రజాభూమి, ఒంటిమిట్ట: రానున్న రాజంపేట మున్సిపాలిటీ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి నియోజకవర్గ స్థాయిలో త్రిసభ్య సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని నియోజకవర్గ సీనియర్ నాయకుడు, రాష్ట్ర మాజీ కల్లుగీత కార్మిక సంఘం డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య జిల్లా ఇన్‌చార్జి మంత్రి సబితమ్మను రినట్లు తెలిపారు. మంగళవారం నిర్వహించిన నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల ఇన్‌చార్జి దీపక్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. రాజంపేట మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థి ఎంపికలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన సీనియర్ నాయకులకు ప్రాధాన్యం ఇవ్వాలని వెంకట నరసయ్య కోరారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ సుధాకర్ గతంలో పార్టీ కష్టకాలంలోనూ చురుకుగా పనిచేశారని, చైర్మన్ పదవికి పోటీ చేసేందుకు ఎవరూ ముందుకు రాని సమయంలో ఆయన పోటీ చేశారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆయనకు అవకాశం కల్పిస్తే పార్టీ శ్రేణుల మద్దతుతో విజయం సాధించే అవకాశం ఉంటుందని వివరించారు. అదేవిధంగా మున్సిపాలిటీని ఓసీ వర్గానికి కేటాయించే పరిస్థితి ఉంటే దశాబ్దాలుగా పార్టీ కోసం పనిచేస్తున్న డాక్టర్ నవీన్‌కు అవకాశం కల్పించాలని కోరారు. అన్ని



వర్గాలను సమన్వయం చేసుకునేందుకు స్థానిక సంస్థల ఎన్నికల కోసం వెంటనే త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కొత్తగా పార్టీలో చేరిన వారికి తక్షణమే కీలక బాధ్యతలు లేదా టికెట్లు కేటాయించడం, ఏకపక్ష నిర్ణయాలతో అభ్యర్థులను ఎంపిక చేయడం వల్ల పార్టీకి నష్టం జరిగే అవకాశం ఉందని వెంకట నరసయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న నాయకుల అభిప్రాయం ఇదేనా అని ఇన్‌చార్జి మంత్రి సబితమ్మ ప్రశ్నించగా, నాయకులంతా ఏకగ్రీవంగా అవునని సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. సమావేశంలో మాజీ ఆర్టీసీ జోనల్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, మేడ విజయశేఖర్‌రెడ్డి, డాక్టర్ సుధాకర్, డాక్టర్ నవీన్, జేసీబీ సుబ్బారెడ్డి, సంజీవరావు, వెంకటేశ్వర నాయుడు, మామిళ్లి ఈశ్వరయ్య, ఉన్నం కిరణ్‌స్వామి, లేబాక నరసయ్య, మాజీ ఎంపీపీ లక్ష్మీ నరసయ్యతో పాటు రాజంపేట, నందలూరు, ఒంటిమిట్ట మండలాలకు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ భృతికి నిధులు లేవు.. ఇన్‌ఫ్లుయెన్సర్ల జీతాలకు ప్రజాధనం ఉందా?

### - బీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట్లూరు సుదర్శన్

### రూ.3,000 నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తారో తేదీ ప్రకటించాలి - ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి

ప్రజాభూమి, పులివెందుల



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ప్రధాన హామీ అయిన నిరుద్యోగ యువతకు నెలకు ?3,000 నిరుద్యోగ భృతి హామీని ఎందుకు అమలు చేయడం లేదో సమాధానం చెప్పాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట్లూరు సుదర్శన్ ప్రశ్నించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు భృతి ఇవ్వడానికి నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం, మరోవైపు ప్రభుత్వ ప్రచార ఆర్భాటాల కోసం ఇన్‌ఫ్లుయెన్సర్లకు పారితోషికాలు చెల్లించాలని అధికారికంగా ఆదేశిస్తే ఆ డబ్బు ఎక్కడి నుంచి వస్తుందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతమంది ఇన్‌ఫ్లుయెన్సర్లను నియమించింది? ఒక్కొక్కరికి నెలకు ఎంత జీతం ఇస్తోంది? ఇప్పటివరకు ఎంత ప్రజాధనం వెచ్చించాలని భావిస్తోందో బహిరంగ పరచాలన్నారు. నిరుద్యోగ యువతకు నెలకు ?3,000 ఇవ్వడం భారమా? ప్రభుత్వ ప్రచారం కోసం జీతాలు చెల్లించడం ప్రాధాన్యతగా మారిందా? అని నిలదీశారు. ప్రభుత్వాన్ని సోషల్ మీడియాలో ప్రశ్నించిన వాళ్లకు అక్రమ కేసులు, అరెస్టులా? చేయని అభివృద్ధిని పొగిడిన వాళ్లకు వేలకు వేలు పారితోషికాలా? అని మండిపడ్డారు. ఎల్లోమీడియా పచ్చ పత్రికలు ఉన్నా అబద్ధాన్ని నిజం చేయాలని ఇన్‌ఫ్లుయెన్సర్ల ద్వారా ప్రజలను మభ్యపెట్టాలని ప్రభుత్వం పన్నాగం పన్నుతోందని ఆరోపించారు. ఈ నియామకం, జీతాలు, చెల్లింపుల విధానంపై శ్వేతపత్రం విడుదల చేయాలని, ప్రజాధనం ప్రజల సంక్షేమానికే ఖర్చు చేయాలని, యువతకు భృతి కావాలి ప్రచారానికి జీతాలు కాదని ఆయన పేర్కొన్నారు.

# సునీల్ యాదవ్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం

## - గన్‌మెన్ కోసమే నాటకాలు

### వైఎస్ కుటుంబంపై ఇష్టానుసారం మాట్లాడటం సరికాదు

### - వైకాపా నాయకులు

ప్రజాభూమి పులివెందుల



వివేకా హత్య కేసులో నిందితుడిగా ఉన్న సునీల్ యాదవ్‌కు గన్‌మెన్ కావాలనే ఉద్దేశంతో ఎవరిపై పడితే వారిపై కేసులు పెట్టడం, తనకు ప్రాణ హాని ఉందంటూ ఫిర్యాదులు చేయడం పరిపాటిగా మారిందని వైసీపీ నాయకులు విమర్శించారు. రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి సుంకర రవి, నియోజకవర్గ బీసీ అధ్యక్షులు చెన్నూరు కార్తీక్, జిల్లా యువజన విభాగ ప్రధాన కార్యదర్శి ఏకాశి మహేష్, యూత్ నాయకులు అరవింద్ మంగళవారం జగన్ క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దస్తగిరి తరహాలో గన్‌మెన్‌లతో పబ్లిక్‌లో కనిపిస్తూ పబ్లిసిటీ పొందాలనే ఉద్దేశంతో న్యూస్ చానళ్లలో వైఎస్ కుటుంబం, వైఎస్ జగన్, భారతిలపై ఏది పడితే అది మాట్లాడితే హైలెట్ అవుతామనే ఆలోచనతో నిరాధార ఆరోపణలు చేయడం సరైన వైఖరి కాదన్నారు. సునీల్ యాదవ్‌పై గతంలో ల్యాండ్ సెటిల్‌మెంట్లు, గుప్తనిధుల అన్వేషణ, వజ్రాల వేట వంటి ఆరోపణలు ఉన్నాయని, గన్‌మెన్ భద్రత లభిస్తే మరింత అరాచకాలకు పాల్పడవచ్చనే అనుమానాలు ఉన్నాయని, అయితే వాస్తవాలు అధికారుల విచారణ లో తేలాల్సి ఉందన్నారు. గతంలో పులివెందులకు చెందిన పవన్ కుమార్, లోకేష్ రెడ్డిలపై దేవాలయంలో హత్యాయత్నం ఆరోపణలు చేయగా, బ్రాహ్మణపల్లిలో బైక్‌పై వెళ్తున్న తనను బెదిరించారని ఫిర్యాదు చేయగా సీసీ ఫుటేజీ పరిశీలనలో ఆధారాలు లేవని తేలిందని తెలిపారు. వినాయక నిమజ్జనం సమయంలోనూ యువకులపై తప్పుడు ఫిర్యాదు చేశారన్నారు. ఎన్నికలు సమీపించిన ప్రతిసారీ వివేకా హత్య కేసుతో తెరపైకి వచ్చి వైఎస్ కుటుంబంపై బురద చల్లడం అలవాటుగా మారిందని, గన్‌మెన్ కావాలంటే వైఎస్ కుటుంబంపై ఆరోపణలు మానుకుని చంద్రబాబును పొగిడితే సరిపోతుందని ఎద్దేవా చేశారు.

# ఎస్సీ గ్రీవెన్స్ అర్జీలపై ఆర్డీఓ విచారణ -ఆర్డీఓ ప్రేమంత్ కుమార్

ప్రజా భూమి శింగనమల



శింగనమల మండల తహసీల్దార్, కార్యాలయంలో గతంలో అందిన ఎస్సీ గ్రీవెన్స్ అర్జీలపై రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) ప్రేమంత్ కుమార్ విచారణ చేపట్టారు. తహసీల్దార్ శేషారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ విచారణలో అర్జీదారుల సమస్యలను పరిశీలించారు. ఎస్సీ గ్రీవెన్స్ ద్వారా అందిన అర్జీలపై అధికారులు తక్షణమే స్పందించి, నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ కోరారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషారెడ్డి, మండల సర్వేయర్ శరత్, గ్రామ సర్వేయర్లు, గ్రామ వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ కమిటీ ఎన్నికల్లో టీడీపీ హవా

ప్రజా భూమి నార్పల



మండలంలోని 46 పాఠశాలలకు గాను 42 పాఠశాలల్లో నావీజ ఎన్నికలు పూర్తయ్యాయని టీడీపీ మండల కన్వీనర్ బండ్లపల్లి కుళ్లాయప్ప తెలిపారు. 42 పాఠశాలల్లో అత్యధిక చోట్ల టీడీపీ మద్దతుదారులు విద్యా కమిటీ చైర్మన్లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని పేర్కొన్నారు. మరో నాలుగు పాఠశాలల్లో చెదురుమదురు ఘటనల నేపథ్యంలో ఎన్నికలను అధికారులు వాయిదా వేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసా నాయుడు, జిల్లా టీడీపీ నాయకులు ఆలం వెంకట నరసానాయుడు సహకారంతో విద్యారంగ అభివృద్ధికి చర్యలు కొనసాగుతున్నాయని కుళ్లాయప్ప తెలిపారు.

# గండి క్షేత్రంలో కొబ్బరికాయల విక్రయ హక్కుకు రూ.95.10 లక్షలు

### - గతేడాది కంటే రూ.19.75 లక్షలు అదనపు ఆదాయం

### - ఆలయ సహాయ కమిషనర్ సి. విశ్వనాథ్

ప్రజాభూమి, చక్రాయపేట



గండి క్షేత్రం శ్రీ వీరాంజనేయ స్వామివారి దేవస్థానం ఆవరణలో కొబ్బరికాయల విక్రయ హక్కు కోసం 2026 నవంబరు 1 నుంచి 2027 అక్టోబరు 31 వరకు ఏడాది కాలానికి ఇ-టెండర్, సీల్డ్ టెండర్, బహిరంగ వేలం నిర్వహించారు. వేలంలో రూ.95.10 లక్షల హెచ్చు పాట నమోదైనట్లు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి సి. విశ్వనాథ్ తెలిపారు. టెండర్లు, వేలం ప్రక్రియను పర్యవేక్షించేందుకు వేంపల్లె శ్రీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె. సుభాష్ హాజరైనట్లు విశ్వనాథ్ తెలిపారు. రూ.10 లక్షల ధరావత్తు చెల్లించి వేలంలో 12 మంది పాల్గొన్నారు. వేంపల్లె మండలం కుప్పాలపల్లి గ్రామానికి చెందిన కె. రామగంగి రెడ్డి రూ.95,10,000తో హెచ్చు పాటదారుగా నిలిచారు. గత ఏడాది రూ.75,35,000కు వేలం జరగగా, ఈ ఏడాది రూ.19,75,000 అదనంగా ఆదాయం సమకూరిందని దేవస్థానం ఛైర్మన్ కల్లూరు వెంకటస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఆలయ పాలకమండలి సభ్యులు, ఏపీజీబీ బ్యాంకు సిబ్బంది, ఆర్కె వ్యాలీ పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో మున్సిపాలిటీలో తాగునీటి కష్టాలు

### బయమ్మ తోటలో బోర్ మోటారు సమస్యను పరిష్కరించిన వైఎస్ మనోహర్ రెడ్డి

ప్రజాభూమి, పులివెందుల



పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న ఏ సమస్యనైనా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ ఇన్‌చార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి అన్నారు. మంగళవారం బయమ్మ తోట కాలనీలో బోర్ మోటార్ కాలిపోవడంతో తాగునీరు అందక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకుని ఆయన వెంటనే స్పందించారు. వైకాపా పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిషోర్ లతో కలిసి కాలనీకి వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. అధికారులతో మాట్లాడి బోర్ మోటారు మరమ్మతు చేయించి నీటి సరఫరా పునరుద్ధరించారు. కాలనీలో చెత్త సేకరణ వాహనాలు సక్రమంగా రావడం లేదని స్థానికులు చెప్పడంతో మున్సిపల్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మనోహర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ప్రజల కనీస అవసరాలు తీరడం లేదని విమర్శించారు. సమస్యల పరిష్కారానికి అవసరమైతే ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఎంపీ నిధులతో, సొంత నిధులతోనైనా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శేఖర్, సుభాష్, హరి పాల్గొన్నారు.

# 35 శాతం సబ్సిడీతో శనగ విత్తనాలు - వ్యవసాయ అధికారి బాల గంగాధర్ రెడ్డి

ప్రజాభూమి, వేంపల్లె



మండలంలో రైతులకు 35 శాతం సబ్సిడీతో శనగ విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఈ. బాల గంగాధర్ రెడ్డి తెలిపారు. మండలానికి 1,000 క్వింటాళ్ల శనగ విత్తనాలను కేటాయించినట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 30 నుంచి పాములూరు, రామిరెడ్డిపల్లి, అలవలపాడు, ముత్తుకూరు, కత్తలూరు రైతు సేవా కేంద్రాల్లో పంపిణీ ప్రారంభమవుతుందని తెలిపారు. ఎకరాకు 40 కిలోల (రెండు బ్యాగులు) చొప్పున విత్తనాలు అందజేస్తామని, ఐదు ఎకరాలు లేదా అంతకంటే ఎక్కువ భూమి ఉన్న రైతులకు గరిష్టంగా 10 బ్యాగులు మాత్రమే ఇస్తామని పేర్కొన్నారు. విత్తనాల గరిష్ట ధర కిలోకు రూ.90 కాగా, సబ్సిడీ పోను రైతు వాటాగా కిలోకు రూ.58.50 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. విత్తనాలు అవసరమైన రైతులు భూమి పాస్‌బుక్, ఆధార్ కార్డు, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్ తదితర వివరాలతో సంబంధిత రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ అనంతరం అర్హత మేరకు సబ్సిడీపై శనగ విత్తనాలు పొందాలని బాల గంగాధర్ రెడ్డి కోరారు.